ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

శనివారం, మే 2, 2026 | సంపుటి - 22 | సంచిక 213 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## దేశంలో పటిష్టంగా తెలంగాణ పోలీసింగ్

- నేర నియంత్రణలో టెక్నాలజీ వినియోగం
- నేరగాళ్ల టెక్నాలజీ సవాల్‌గా మారింది
- డ్రగ్స్ నియంతరణకు మరింత కఠిన చర్యలు
- తెలంగాణ డీజీపీగా సీపీ ఆనంద్ ప్రమాణస్వీకారం

[2]



**హైదరాబాద్,మే1(నినాదం):** తెలంగాణ డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు. డీజీపీ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు పోలీసు ఉన్నతాధికారులు సాదరంగా స్వాగతం పలికారు. కార్యాలయ ఆవరణలో పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పండితులు వేద ఆశీర్వచనాలతో రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరేలా క్రుషి చేస్తానన్నారు. శాంతి భద్రతల కోసం అహర్నిశలూ శ్రమిస్తానని చెప్పారు.

# కాసుల లెక్క కుదరక..
# లారీ కేసు సాగక..!




- పట్టుకున్న టాస్క్ ఫోర్స్ అధికారులు
- చర్యల్లో ముందుకెళ్లని సివిల్ సప్లైస్ బాధ్యులు
- మూడురోజులైనా తేలని ఆ లారీ లెక్క
- పోలీసులకు ఫిర్యాదుకూడా ఇవ్వని వైనం
- బయటపడే పనిలో ఆ 'ఇద్దరు ఖాన్'లు
- తప్పించే దిశగా బేరసారాలు !
- సిద్దిపేట సివిల్ సప్లైస్ శాఖపై తీవ్ర ఆరోపణలు




పట్టుకున్న లారీతో డీఎస్పీ వెంకటేశం ఇతర సిబ్బంది

**హైదరాబాద్ బ్యూరో, మే 1(నినాదం):**

**రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో గల సివిల్ సప్లైస్ శాఖ బాధ్యుల తీరు తీవ్ర విమర్శలకు గురవుతోంది. అక్రమ రవాణాను నియంత్రించకపోగా రేషన్ బియ్యం స్మగ్లర్లకు నేరుగా సహకరిస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. నిరుపేదలకోసం రూపొందించిన పథకం పక్కదారి పట్టకూడదనే ప్రభుత్వ లక్ష్యం వీరి మూలంగా నీరుగారుతోంది. ప్రభుత్వం, ఉన్నతాధికారుల తాజా మార్గదర్శకాలున్నా పట్టుబడ్డ నేరస్తుల విషయంలో కాలం చెల్లిన చర్యలే అవలంబిస్తున్నారు. చట్టాల్లోని లొసుగులే కీలకంగా సాగుతున్న వీరి కళాప్రావీణ్యత స్మగ్లర్లలో ధైర్యాన్ని నింపుతోంది.ఎన్ని సార్లు పట్టుబడ్డా ఏమీ కాదనే ధీమాతోనే వారు ఆగటం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సిద్దిపేట జిల్లాకేంద్రంలో మూడురోజులుగా సాగుతున్న ఓ తంతే పై ప్రస్తావనకు అద్దం పడుతోంది.విషయం తెలిసిన ప్రతిఒక్కరినీ విస్మయానికి గురిచేస్తోంది.**

### ఇదీ అచ్చుటి ముచ్చట..

సివిల్ సప్లైస్ స్టేట్ టాస్క్ ఫోర్స్ బృందం మూడు రోజుల క్రితం తనిఖీలు చేపట్టింది. ఇందులో భాగంగా దుద్దెడ టోల్ ప్లాజా సమీపంలో అనుమానాస్పదంగా వెల్తున్న ఓ లారీ కనిపించింది. దాన్ని ఆపి చెక్ చేయగా సదరు లారీలో పెద్దమొత్తాన బియ్యం లభ్యమయ్యాయి.అధికారులు వాటికి చెందిన వేబిల్లు తదితర ధృవపత్రాలు ఏవని అడుగగా డ్రైవర్లనుండి పొంతనలేని జవాబు వచ్చింది.దీంతో లారీలోని బియ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే అందులో ఫోర్టిఫైడ్ కెర్నాల్స్ కలిసిన బియ్యంగా గుర్తించామని టాస్క్ ఫోర్స్ అధికారులు వెల్లడించారు.ఆపై తదుపరి విచారణకోసం స్థానిక 3 వ టౌన్ పోలీసులకు సమాచారమిచ్చి సివిల్ సప్లైస్ బాధ్యులకు సదరు లారీని అప్పగించినట్లు తెలిపారు.

### అంతా సైలెంట్.. 3 రోజులైనా నో కంప్లైంట్

లోకల్ సివిల్ సప్లైస్ టీమ్ కళాప్రావీణ్యం ఇక్కడే మొదలైంది. స్టేట్ బృందంనుండి సదరు లారీని స్వాధీన పర్చుకున్న పిదప ధాన్యం మొత్తాన్ని తూకం వేసి తదుపరి పూర్తి విచారణకోసం వారు బాధ్యులపై పోలీసులకు ఫిర్యాధు చేయాల్సి ఉంటుంది.కానీ ఇక్కడ అలాంటిదేదీ జరిగినట్లుగా దాఖలాలు లేవు. ఆ లారీ ఎక్కడి నుండి ఎక్కడికి వెల్తోంది,దాని వెనుక ఎవరెవరు ఉన్నారనే వివరాలేవీ తేల్చలేదు,పట్టుకుని మూడురోజులవుతున్నా పోలీసులకు కనీసం ఫిర్యాధు కూడా ఇవ్వకపోవటం గమనార్హం.

### లెక్కలు కుదరకనేనంటూ ఆరోపణలు..

ఇలా ఉంటే సదరు లారీ కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన బావా బావమర్దులైన ఓ ఇద్దరు 'ఖాన్ ల'కు చెందినదని స్థానికంగా వినిపిస్తోంది. వారితో సంబంధిత శాఖకు చెందిన కొందరు సెటిల్మెంట్ కోసం చేస్తున్న బేరసారాలు కుదరటం లేదని,అదే ఆ లారీ విచారణ ముందుకు సాగకపోవటానికిగల అసలు కారణమని పలువురు ఆరోపిస్తున్నారు.

### దాచటంతోనే అనుమానాలు..

రేషన్ బియ్యం తరలిస్తూ అంతపెద్ద లారీ పట్టుబడితే సహజంగా ఓ ప్రెస్ నోట్ ద్వారా నైనా స్థానిక సివిల్ సప్లైస్ బాధ్యులు మీడియాకు తెలియపరుస్తారు.ఇక్కడ అలాంటిదేదీ జరగకపోవటం,కనీసం పోలీసులకు కూడా ఫిర్యాధు ఇవ్వకపోవటం, పై అనుమానాలు,ఆరోపణలకు తావిస్తోంది. వీళ్లు పట్టుకోరూ,సంబంధీకులు పట్టి చేతికిచ్చినా పూర్తి స్థాయిలో తదుపరి పనిచేయరా అంటూ లోకల్ బాధ్యలపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**సుమారు పదేళ్లుగా ఎవ్వరికీ చిక్కని ఈ లారీకి చెందిన ఆసిఫాబాద్'ఖాన్ లు', కోట్లు కొల్లగొడుతున్న ఆ ఇద్దరు డాన్లు ఎవరు దొరికినా సదరు లారీద్వారా ప్రభుత్వం వారిని ఎలా పట్టుకోవచ్చుననే మొదలగు మరిన్ని ఆసక్తికర వివరాలు నినాదం తర్వాతి సంచికలో....**



## జూన్ 2 నాటికి జర్నలిస్ట్‌ల ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం

- న్యాయపరమైన చిక్కుల్లేకుండా ఇళ్లస్థలాలు
- ఎమ్మెల్యేలు, బ్యూరో క్రాట్స్‌తో పాటే అందరికీ స్థలాలు
- ఫ్యూచర్‌సిటీలో ఇవ్వడానికి సిఎం రేవంత్ అంగీకారం
- జర్నలిస్ట్ సంఘాలతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

[వివరాలు 2]

## వడగాలులపై హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్

- తాగునీటి సమస్య రాకుండా చూడాలి
- చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు. ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్ల సరఫరా
- ప్రకృతి విపత్తుల వల్ల నష్టం జరిగితే 15 రోజుల్లో నివేదికలు
- హీట్ వేవ్‌పై 20 విభాగాలతో సమీక్షించిన మంత్రి పొంగులేటి

## నల్లగొండ ఫార్మా కంపెనీలో పేలుడు

[2]

**రియాక్టర్ పేలడంతో 9మందికి గాయాలు**



## భగ్గుమన్న కమర్షియల్ సిలిండర్

- 19 కిలోల సిలిండర్‌పై రూ.993 పెంపు
- హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై తీవ్ర భారం

[6]




## పెట్రో ధరలు పెంచడం లేదు

### ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ వెల్లడి

[2]

**న్యూఢిల్లీ, నినాదం:** దేశంలోని వాహనదారులకు, సామాన్య వినియోగదారులకు ఊరటనిచ్చే వార్తను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని సవరించిన ప్పటికీ, పెట్రోల్, డీజిల్ ధరలలో ప్రస్తుతానికి ఎలాంటి మార్పు ఉండబోదని, అవి స్థిరంగానే కొనసాగుతాయని స్పష్టం చేసింది.




## పెండింగ్ చలాన్లపై కోర్టు ధిక్కరణ

### పోలీస్ అధికారులకు హైకోర్టు నోటీసులు

[2]



## గ్యాస్ ధరల పెంపు.. ఎలక్షన్ బిల్లు

- ధరలపై మేము ముందే చెప్పాం
- పెట్రో, డీజిల్ బాదుడుకు సిద్దంగా ఉండాలి
- గ్యాస్ ధర పెంపుపై రాహుల్ విమర్శలు

[వివరాలు 2]

## గ్యాస్ ధరల పెంపు సామాన్యుడిపై భారం

- ఏకంగా రూ.993లకు పెంచడం దుర్మార్గం
- కేంద్రం తీరుపై మండిపడ్డ మంత్రి ఉత్తమ్

## రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక ప్రభుత్వం

- సిగాచిలో 60 మంది చనిపోతే దిక్కులేకుండా పోయింది
- 120మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారు
- కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న రేవంత్ సర్కార్
- బీఆర్ఎస్ అధికారంలో ఉండగా కార్మిక సంక్షేమాన్ని అమలు చేశాం
- మరో రెండేళ్లు ఆగితే అధికారం మాదే
- మే డే ఉత్సవాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, నినాదం:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మిక రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సరైన పని దినాలు, వసతులు కల్పించక ఇబ్బందులపాలు చేస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో బీఆరఎస్ జెండాను ఎగురవేసి మేడే శుభాకాంక్షలు తెలిపారు.ప్రస్తుతం రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక సర్కార్ నడుస్తోంది. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు కాంగ్రెస్ బాధితులయ్యారు. మంత్రుల జీతాల్లో కోత వేసి ఇస్తామనడానికి వాళ్లు వరద బాధితులా అని అన్నారు.

▸▸తరువాయి2లో..

## ఔటర్ రింగ్‌రోడ్డుపై ఘోర ప్రమాదం

- ఆగి ఉన్న లారీని వేగంగా ఢీకొన్న కారు
- ఆరుగురు అక్కడికక్కడే మృతి.. మరొకరి పరిస్థితి విషయం
- మృతులంతా యాదగిరిగుట్టు వెళ్లి వస్తుండగా ప్రమాదం



**హైదరాబాద్,మే1(నినాదం):** శంషాబాద్ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డుపై శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మ్రుతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది. మ్రుతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నారు.

▸▸తరువాయి2లో..

## రాష్టాలభివృద్ధి లక్ష్యంగా కష్టపడుతున్నా

- ప్రజల సంతోషం చూసి కష్టాలు మరచి పోతున్నా
- ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏపీకి పూర్వ వైభవం
- లేబర్ అడ్డాలను స్కిల్ సెంటర్లుగా అభివృద్ధికి నిర్ణయం
- గోదావరి పుష్కరాల్లోపే పోలవరం పూర్తి చేస్తాం
- విద్యుత్ చార్జీలు పెంచలేదు..ఇకముందు పెంచబోం
- కృష్ణా జిల్లా పమిడిముక్కలలో 'పేదల సేవ'లో సిఎం బాబు

[6]

*విజయవాడ : రాష్టాలభివృద్ధి కోసం రాత్రిపగలు కష్టపడుతున్నామని, పేదల రుణం తీర్చుకునేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రజల సంతోషాన్ని చూసి.. కష్టాన్ని మరిచిపోతున్నట్లు చెప్పారు. కృష్ణా జిల్లా పమిడిముక్కలలో నిర్వహించిన 'పేదల సేవ' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు.*



## ముంబైలో డ్రగ్స్ ముఠా అరెస్ట్

- రూ.1,745 కోట్ల విలువైన కొకైన్ స్వాధీనం
- ఎక్స్ వేదికగా హోంమంత్రి అమిత్ షా వెల్లడి






**ముంబయి, నినాదం:** ముంబయిలో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఛేదించింది. ఆ ముఠా నుంచి రూ.1,745 కోట్ల విలువైన కొకైన్‌ను ఎన్‌సీబీ స్వాధీనం చేసుకుంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఎక్స్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. మాదకద్రవ్యాల రవాణాకు పాల్పడే ముఠాలను అణచివేయాలని నిర్ణయించుకున్నట్లు అమిత్‌షా తెలిపారు. ఇందులోభాగంగా.. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాపై ఉక్కుపాదం మోపిందన్నారు. ముంబయిలో రూ.1,745 కోట్ల విలువైన 349 కిలోల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

▸▸తరువాయి2లో..

## దేశంలో పటిష్టంగా తెలంగాణ పోలీసింగ్

కొత్త టెక్నాలజీని మరింతగా వాడుకుంటూ సమర్ధంగా పని చేస్తామన్నారు. నేరాల దర్యాప్తులో తెలంగాణ పోలీసులు ఇప్పటికే ఉత్తమ పని తీరు కనబరిచారు. మారుతున్న పరిస్థితుల్లాగే నేరాలు జరుగుతున్న విధానం కూడా మారింది. నేరగాళ్లు సైతం కొత్త కొత్త టెక్నాలజీని అనుసరిస్తూ నేరాలు చేస్తున్నారు. ఇది పోలీసులకు సవాలుగా మారింది. ఎన్ని కేసులు పెట్టినా.. డ్రగ్స్ ముఠాలు కూడా విస్తరిస్తున్నాయి. డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ పోలీసుబదం బాగా కషి చేస్తోంది. శాంతిభద్రతల సమస్య రాకముందే అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ చివరి దశకు చేరుకుందని సీవీ ఆనంద్ అన్నారు. ఈ కేసును ప్రస్తుతం సిట్ విచారిస్తోంది. గతంలో హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడే.. ఈ కేసు గురించి నాకు తెలుసు. త్వరలో ఈ కేసును సవి క్షించి తుది ఛార్జిషీట్ ఫైల్ చేస్తామని ఆయన పేర్కొన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర డీజీపీగా నియమించిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సీవీ ఆనంద్ ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చడం కోసం పూర్తిస్థాయిలో అహర్నిశలు క□షి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ పోలీస్ దేశంలోనే నంబర్ వన్ పోలీస్‌గా గుర్తింపు పొందిందని.. బ్రాండ్ ఇమేజ్ సాధించిందని అన్నారు. శాంతి భద్రతలు కాపాడటం, నేర నియంత్రణ, నేర దర్యాప్తులో తెలంగాణ పోలీసులు సమర్థవంతంగా పని చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. శాంతి భద్రతలు కాపాడటంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీజీపీ సూచించారు. కేసుల దర్యాప్తులో టెక్నాలజీ వినియోగంలో తెలంగాణ పోలీస్ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని డీజీపీ తెలిపారు. గతంలో కంటే ఇప్పుడు నేరాల్లో మార్పులు వచ్చాయని, ప్రస్తుతం సైబర్ నేరాలు భారీగా పెరిగాయన్నారు. సైబర్ నేరాలను అదుపు చేయడంలో జిల్లా ఎస్పీల పాత్ర కీలకంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ సమస్య ఇప్పుడు సమాజంలో విస్తరించిందని.. దాన్ని అరికట్టడం కోసం ఈగిల్, నార్కోటిక్స్ సెల్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. తెలంగాణలో డ్రగ్స్ నిర్మూలనకు టాప్ ప్రయారిటీ ఇస్తామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరోను ఏర్పాటు చేయబోతున్నట్లు సీవీ ఆనంద్ ప్రకటించారు. మహిళల సేఫ్టీ, చైల్డ్ ట్రాఫికింగ్ వంటి సమస్యలు వ్యవస్థీక□త నేరాలుగా మారాయని.. వీటిపై ప్రత్యేక ద□ష్టి పెడతామని డీజీపీ తెలిపారు. ప్రక□తి వైపరీత్యాల వల్ల వచ్చే ప్రమాదాలపై కూడా పోలీసు శాఖ మరింత ద□ష్టి సారిస్తుందన్నారు. తెలంగాణ పోలీస్ శాఖలో పునర్వ్యవస్థీకరణ చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. నక్సలైట్ల నిర్మూలన కోసం ఏర్పాటైన గ్రేహౌండ్స్, సరైన విధంగా పోలీస్ శాఖలో వినియోగించుకోవాలని సూచించారు. పోలీస్ శాఖలో ఉన్న ఖాళీలపై త్వరలో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని.. రిక్రూట్‌మెంట్, □ట్రైనింగ్‌లో మార్పులు తీసుకొస్తామని డీజీపీ తెలిపారు. పోలీస్ శాఖలో అధికారులు.. సంప్రదాయాలు, మర్యాదలు మరచిపోతున్నారని సీవీ ఆనంద్ అన్నారు. వాటిని గుర్తు చేసి, అధికారులు సమన్వయంతో పని చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నేర దర్యాప్తులో సీసీ కెమెరాలపై మాత్రమే ఆధారపడటం సరి కాదని.. సీన్ ఆఫ్ అఫెన్స్‌లో దొరికిన ఆధారాలతోనే కేసులను ఛేదించే పాత పద్ధతులను మళ్లీ తీసుకొస్తామని స్పష్టం చేశారు. గోవధపై పోలీసులే చర్యలు తీసుకుంటారని, □ప్రైవేటు వ్యక్తులు రోడ్లపైకి రావొద్దని సీవీ ఆనంద్ హెచ్చరించారు. 1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్.. 2013 నుంచి 2016 వరకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ విధులు నిర్వర్తించారు. 2017లో అదనపు డీజీపీగా పదోన్నతి పొందారు. 2021 డిసెంబర్ 24న హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నియమితులైన ఆయన.. 2023 ఆగస్టు 7న డీజీగా పదోన్నతి పొందారు. 2024 సెప్టెంబర్ 7న రెండోసారి హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2025 సెప్టెంబర్ 27 నుంచి హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఆయన 2028జూన్ వరకు డీజీపీగా కొనసాగనున్నారు.

## పెట్రో ధరలు పెంచడం లేదు

**న్యూఢిల్లీ, నినాదం:**

దేశంలోని వాహనదారులకు, సామాన్య వినియోగదారులకు ఊరటనిచ్చే వార్తను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని సవరించినప్పటికీ, పెట్రోల్, డీజిల్ ధరలలో ప్రస్తుతానికి ఎలాంటి మార్పు ఉండబోదని, అవి స్థిరంగానే కొనసాగుతాయని స్పష్టం చేసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల ఒడిదొడుకులు, ప్రభుత్వ పన్నుల సవరణలు జరిగినప్పటికీ, సామాన్య వినియోగదారులపై అదనపు భారం పడకుండా చమురు సంస్థలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ప్రభుత్వం ఇటీవల ఎక్సైజ్ సుంకంలో కొన్ని మార్పులు చేసినప్పటికీ, ఆ ప్రభావాన్ని వినియోగదారులకు బదిలీ చేయకూడదని ప్రభుత్వం, చమురు కంపెనీలు నిర్ణయించాయి. ఇంధన సరఫరా గొలుసులో స్థిరత్వాన్ని కాపాడతామని, పంపిణీలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూస్తామని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ హామీ ఇచ్చింది. ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న తరుణంలో, ఇంధన ధరలు పెరగకపోవడం అనేది రవాణా రంగంపై సానుకూల ప్రభావం చూపుతుంది. తద్వారా కూరగాయలు, ఇతర నిత్యావసరాల రవాణా ఖర్చులు పెరగకుండా ఉంటాయి. అంతర్జాతీయంగా ఇరాన్`అమెరికా మధ్య ఉద్రిక్తతలు, కాల్పుల విరమణ వంటి పరిణామాల వల్ల చమురు మార్కెట్‌లో అనిశ్చితి నెలకొన్నప్పటికీ, దేశీయంగా ధరలను నియంత్రణలో ఉంచడం గమనార్హం.

## పెండింగ్ చలాన్లపై కోర్టు ధిక్కరణ

హైదరాబాద్, నినాదం: ట్రాఫిక్ పెండింగ్ చలాన్ల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కోర్టుధిక్కరణ కింద డీజీపీ సీవీ ఆనంద్, మాజీ డీజీపీ శివధర్ రెడ్డి, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్‌కు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. పెండింగ్ చలాన్‌లు ఉంటే వాహనాలు సీజ్ చేయొద్దని ఈ ఏడాది జనవరి 20న హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఏప్రిల్ 9న మల్లికార్జున అనే వ్యక్తి బైక్‌ను పోలీసులు సీజ్ చేశారు. హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరించారని ఆరోపిస్తూ కోర్టుధిక్కరణ పిటిషన్ దాఖలైంది. హోంశాఖ సెక్రటరీ, డీజీపీ, ట్రాఫిక్ అదనపు సీపీ, రవాణా శాఖ కమిషనర్‌లను ప్రతివాదులుగా పిటిషనర్ చేర్చారు. పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది విజయ్ గోపాల్.. హైకోర్టు ఉత్తర్వులను పోలీసులు అమలు చేయడం లేదని కోర్టు ద□ష్టికి తీసుకెళ్లారు. వాహనం ఆర్సీ బుక్‌ను చూపించినా ట్రాఫిక్ పోలీసులు అంగీకరించడం లేదని న్యాయవాది తెలిపారు. ఈ క్రమంలో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన హైకోర్టు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే నెల 19కి హైకోర్టు వాయిదా వేసింది.

## ముంబైలో డ్రగ్స్ ముఠా అరెస్ట్

ఒక చిన్న సరకును గుర్తించి.. దానినుంచి ఒక భారీ నెట్‌వర్క్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ విజయానికి గాను ఎన్‌సీబీ బ□ందాన్ని ఆయన అభినందించారు. కాగా.. అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం అనుచరుడు సలీమ్ డోలాను ఇటీవల తుర్కియే నుంచి భారత్‌కు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇంత పెద్ద మొత్తంలో డ్రగ్స్ స్వాధీనం చేసుకోవడం గమనార్హం.

రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక ప్రభుత్వం

## రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక ప్రభుత్వం

రాష్ట్రంలో 120 మంది ఆటో □డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించడం లేదు. రెండేళ్లు భరించండి.. కేసీఆర్ వచ్చి కార్మికులకు మేలు చేస్తారని కేటీఆర్ అన్నారు. బీఆరఎస్ ప్రభుత్వం కార్మికులకు చేతినిండా పని కల్పించి ఆదుకున్నదని, నగరంలో రోడ్లు, వంతెనల నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. కోవిడ్ సమయంలో ఇతర రాష్ట్రా□లకు వెళ్లేందుకు కార్మికులకు ఉచిత రైళ్లను కేసీఆర్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో అవినీతి వల్ల, అసమర్థత వల్ల ఎసఎల్‌బీసీ కుప్పకూలిపోయి చనిపోయిన కార్మికులను అప్పగించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా సిగాచీ పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగి 60 మంది సజీవదహనం అయితే పట్టించుకున్న నాథులే లేరని దుయ్యబట్టారు. కోటి రూపాయల నష్ట పరిహారం ఇస్తామని రేవంత్ హామీ□ ఇచ్చి ఇప్పటి వరకు ఇవ్వలేదని విమర్శించారు. నగరంలో వలసవచ్చి నివాసమేర్పచుకున్న కార్మికుల ఇళ్లను హైడ్రా పేరిట కూల్చి రోడ్డుపాలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో కూల్చివేతలు, ఎగవేతలు, పేల్చివేతలు మాత్రమే జరుగుతున్నవని తెలిపారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు, ఎన్నికలకు ముందు దాన,వీర, శూర కర్ణ. ఎన్నికల తరువాత కుంబకర్ణ పాత్రను పోషిస్తున్నాడని దుయ్యబట్టారు. కొవిడ్ సమయంలో అందరూ ఇళ్లలో ఉంటే.. తాము రోడ్లు, వంతెనలు పూర్తి చేశామన్నారు. ‘ తెలంగాణ అంటే ప్రేమ ఉంది కాబట్టే.. లాక్‌డౌన్‌లో రోడ్లు, వంతెనలు నిర్మించాం. లాక్‌డౌన్ సమయంలో రాష్ట్రంలోని కార్మికులు స్వస్థలాలకు బయల్దేరారు. అభివ□ద్ధి కార్యక్రమాలు ఆగకూడదనే ఉద్దేశంతో లేబర్ క్యాంపులకు వెళ్లి కార్మికులకు దండం పెట్టి.. రోడ్లు నిర్మించాం అన్నారు. దేశ చరిత్రలో ఎన్నడు పెంచనంతగా వాణిజ్య సిలిండర్ల మీద రూ.993 పెంచిన ఘనత కేంద్రంలోని నరేంద్ర మోదీ దేనని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలు అయిపోగానే గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచడం మోదీకి అలవాటేనని అన్నారు. ఒక్క సిలిండర్ మీద దాదాపు రూ.1000 పెంచి సామాన్యులకు, హోటళ్లలో పని చేసే కార్మికులకు మోదీ మేడే కానుక ఇచ్చాడని దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో నిన్నటి వరకు ఒక సిలిండర్ ధర రూ. 2,321 ల నుంచి రూ.3,315 పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హోటళ్లు, మెస్‌ల మీద ఆధారపడి చదువుకునే యువతకు, ఉద్యోగాలు చేసుకునే వారికి ఈ ధరల పెంపు వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. తక్షణమే పెంచి ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

# జూన్ 2 నాటికి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం



**న్యాయపరమైన చిక్కుల్లేకుండా ఇళ్లస్థలాలు**

**ఎమ్మెల్యేలు, బ్యూరో క్రాట్స్‌తో పాటే అందరికీ స్థలాలు**

**ఫ్యూచర్‌సిటీలో ఇవ్వడానికి సిఎం రేవంత్ అంగీకారం**

**జర్నలిస్ట్ సంఘాలతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్, నినాదం:**

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిజాయితీ, చిత్తశుద్ధితో ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే పలు సందర్భాలలో ఇచ్చిన హామీ□ల మేరకు అందరి అభిప్రాయాలను సేకరించి వచ్చేనెల 2వ తేదీనాటికి ఒక కొలిక్కి తీసుకువస్తామని వెల్లడించారు. శుక్రవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్, జర్నలిస్ట్స్ హౌసింగ్, డెక్కన్ జర్నలిస్ట్స్ , తెలంగాణ హౌసింగ్ సొసైటీలతో మంత్రి సమావేశం నిర్వహించారు.హైదరాబాద్ కేంద్రంగా ఉన్న జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలు ఎప్పుడు ఏర్పాటయ్యాయి, అందులో సభ్యుల సంఖ్య, సభ్యత్వానికి అర్హతలు, ఇతర అన్ని అంశాలపై మంత్రిగారు సొసైటీ సభ్యులు అడిగి తెలుసు కున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ మినహా మిగిలిన మ□డు సొసైటీలలో సుమారు 2,424 మంది అర్హులైన జర్నలిస్టులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జర్నలిస్టులు అందరూ ఒకేతాటిపై ఉంటే సమస్యల పరిష్కారం సులువు అవుతుందని, అన్ని సొసైటీలు కలిపి ఒకే వేదికపైకి వచ్చి జేఏసీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జర్నలిస్టు సంఘాలలో సభ్యులు కాని అర్హులైన జర్నలిస్టులకు కూడా ఇళ్ళ స్థలాలు ఇస్తామని చెబుతూ ఎలాంటి విమర్శలకు, అనుమానాల కు తావు లేకుండా ఇళ్ల స్థలాల మంజూరు జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. గతంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదేనని, ఇప్పుడు కూడా ప్రజా ప్రభుత్వం వచ్చాక 18 ఏళ్లుగా పరిష్కారం కాని జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ఇళ్ల సమస్యను కొలిక్కి తీసుకువచ్చి రవీంద్ర భారతిలో జర్నలిస్టుల కుటుంబాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి భూమి అప్పగించినప్పటికీ న్యాయ వివాదాల కారణంగా సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని గుర్తు చేశారు. జర్నలిస్ట్ ల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకొని జూన్ 2వ తేదీ నాటికి కొలిక్కి తీసుకువస్తామని తెలిపారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూల ద□క్పధంతో ఉన్నారని ఫ్యూచర్ సిటీలో ఎమ్మెల్యేలు, బ్యూరో క్రాట్స్ తో పాటే హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి సిద్దంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వారికి సూచన ప్రాయంగా వెల్లడించి సొసైటీలో ఒక తీర్మానం చేసి ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. 18 సంవత్సరాల క్రితమే ఇంటి స్థలాల కోసం ప్రతిసభ్యుడు రెండు లక్షల రూపాయిల చొప్పున చెల్లించారని దీనిని ద□ష్టిలో పెట్టుకొని ఇళ్ల స్థలాల కేటాయింపులో తమ సొసైటీకి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా సభ్యులు మంత్రిని కోరారు. సమావేశంలో మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమీషనర్ జి. ముకుంద రెడ్డి, సిపీఆర్‌వో మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

## వడగాలులపై హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్

**తాగునీటి సమస్య రాకుండా చూడాలి**

**చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు. ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్ల సరఫరా**

**ప్రకృతి విపత్తుల వల్ల నష్టం జరిగితే 15 రోజుల్లో నివేదికలు**

**హీట్ వేవ్‌పై 20 విభాగాలతో సమీక్షించిన మంత్రి పొంగులేటి**

హైదరాబాద్,మే1(ఆరఎనఎ:రాష్ట్రంలో పెరుగుతున్న ఎండలు, వడగాలుల నుంచి ప్రజలను రక్షించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆమేరకు సంబంధిత శాఖలు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది `2026లో ఎండలు , వడగాలులు అధికంగా వీచే అవకాశం ఉందని, జూన్ 15 వరకు కూడా అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని , ఐఎండి హెచ్చరికల నేపధ్యంలో తీసుకోవలసిన చర్యలపై 20 సంబంధిత శాఖలతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమీక్షాసమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ, ఇండియన్ మెట్రాలాజికల్ శాఖ కలిసి సమగ్ర తెలంగాణ స్టేట్ హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్ `2026 ను రూపొందించాయని ఈ సందర్భంగా హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్ `2026ను మంత్రిగారు విడుదల చేశారు. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఈ 45 రోజుల్లో రాష్ట్రంలో గ్రామీణ పట్టణప్రాంతాల్లో ఎక్కడ కూడా త్రాగునీటి కొరత రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా మోటార్లు కాలిపోతే 24 గంటల్లో మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాకు ఆటంకం లేకుండా చూసుకోవాలన్నారు. హైదరాబాద్ నగరంలో డిమాండ్‌కు అనుగుణంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని రోజుకు 14 గంటలు ఫిల్లింగ్ చేసి 15వేల ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. అన్నిశాఖలు ముఖ్యంగా పంచాయితీ రాజ్, మున్సిపల్ ,హెల్త్ సమన్వయం చేసుకొని పనిచేయాలన్నారు. ప్రక□తి విపత్తుల వల్ల నష్టపోయిన బాధితులను ఆదుకోవడానికి వీలుగా 15 రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదికలను పంపించాలని అధికారులను ఆదేశించారు. వడగాలుల ప్రభావం సామాన్యప్రజలపై పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అయినా కూడా అనుకోని పరిస్థితులలో ఎవరైనా చనిపోతే మానవతా ద□క్పధంతో వ్యవహరించి తక్షణం ఎక్స్ గ్రేషియో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో నల్గొండ మంచిర్యాల సూర్యాపేట పెద్దపిల్లి జగిత్యాల ఖమ్మం వరంగల్ కరీంనగర్ మహబూబాబాద్ జిల్లాల్లో వడగాల్పుల ప్రభావం అధికంగా ఉంటుందని ఈ జిల్లాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు చెరువులు, కుంటల వద్దకు వెళ్లి ఆడుకుంటూ ప్రమాదాలకు గురౌతున్నారని అందువల్ల ఆయా ప్రాంతాలలో ఎన్‌డిఆరఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్, పోలీస్ , రెవెన్యూ విభాగాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఎండలకు సంబంధించిన సమాచారం, అధిక ఉష్ణోగ్రతల వేళ ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు, కూల్ వార్డుల ఏర్పాటు, ఆసుపత్రులలో ఫైర్ సేఫ్టీ ఆడిట్ నిర్వహణ వంటి అంశాలపై చర్యలు చేపట్టాలని ప్రజా ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులలో ఓఆరఎస్ ప్యాకట్లను అందుబాటులో ఉంచాలని అదేవిధంగా వేడి ప్రదేశాలలో పనిచేసే కార్మికులను రెండు బ□ందాలుగా విభజించి కనీసం గంట లేదా రెండు గంటల విశ్రాంతి ఇచ్చేలా రొటేషన్ పద్దతి అవలంభించేలా పరిశ్రమలకు సూచించాలన్నారు. బస్టాండ్లు, మార్కెట్లు, పర్యాటక కేంద్రాలు, ప్రార్ధనా స్థలాల వంటి పబ్లిక్ ప్రాంతాలలో అవసరమైన షెల్టర్లు, త్రాగునీరు, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పబ్లిక్ అడ్రస్ సిస్టమ్,ఎల్ ఇ డి స్క్రీన్ల ద్వారా ప్రచారం కల్పించాలని స్థానిక సంస్థలు, మున్సిపాల్టీలు ముందుజాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

## నల్లగొండ ఫార్మా కంపెనీలో పేలుడు

**నల్లగొండ, నినాదం:**

నల్లగొండ జిల్లాలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి 9 మందికి తీవ్ర గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో ఉన్న నోష్ ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలడంతో అగ్నిప్రమాదం జరిగింది. శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. నోష్ ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలడంతో భారీ ఎత్తున తెల్లటి పొగ ఆకాశంలోకి ఎగసిపడుతోంది. దీంతో భయాందోళనకు గురయ్యారు స్థానికులు. ప్రమాదం జరిగిన సమయంలో 3వ బ్లాక్ లో ఉన్న 9 మందికి తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. గాయపడ్డవారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. దట్టమైన పొగ కమ్ముకోవడంతో సహాయక చర్యలకు ఇబ్బందిగా మారింది. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై స్పందించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. తరచు ప్రమాదాలు జరిగుతున్న కంపెనీని సీజ్ చేసి... ప్రమాదం పై పూర్తి విచారణ జరపాలని అన్నారు.



# సేంద్రియ వ్యవసాయానికి పెద్దపీట

**పండించిన పంటల అమ్మకం కోసం యాప్**

**4న ప్రారంభించనున్న మంత్రి తుమ్మల**

**నేరుగా సేంద్రియ ఉత్పత్తులు కొనుగోలుకు వీలు**

హైదరాబాద్ :

తెలంగాణ వ్యవసాయ రంగంలో మరో చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కతం కాబోతోంది. సేంద్రీయ సాగు చేస్తున్న రైతులకు అండగా నిలిచేందుకు, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. మే 4వ తేదీన సేంద్రీయ ఉత్పత్తుల క్రయ విక్రయాల కోసం రూపొందించిన ప్రత్యేక మొబైల్ యాప్ టిజి ఆర్గానిక్స్ ను మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ప్రారంభించనున్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు, జన్యు మార్పిడి పంటలకు స్వస్తి పలికి.. సహజ వనరులు, సేంద్రీయ ఎరువులతో పంటలు పండించడమే సేంద్రీయ వ్యవసాయం. నేటి ఆధునిక కాలంలో అధిక దిగుబడుల కోసం రసాయనాలను విచ్చలవిడిగా వాడుతున్నారు. దీనివల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు పెరగడమే కాకుండా, మనం తినే ఆహారం విషతుల్యమవుతోంది. వాతావరణం కూడా దెబ్బతింటోంది. ఈ పరిస్థితుల్లో ప్రపంచ వ్యాప్తంగా సేంద్రీయ ఉత్పత్తులకు గిరాకీ పెరిగింది. చాలామంది రైతులు ఆసక్తితో సేంద్రీయ సాగు వైపు మొగ్గుచూపుతున్నప్పటికీ.. మార్కెట్‌లో సరైన గుర్తింపు, నాణ్యతా ప్రమాణాలు లేకపోవడం వల్ల వినియోగదారుల్లో నమ్మకం కలగడం లేదు. ఈ సమస్యను అధిగమించేందుకే ప్రభుత్వం యాప్‌ను తీసుకువస్తోంది. దీని ద్వారా రైతులు పండించిన పంటకు సరైన ధర, వినియోగదారులకు కల్తీలేని ఆహారం లభించనున్నాయి. తెలంగాణ సేంద్రీయ సాగులో ఈ యాప్ ఒక నూతన విప్లవానికి నాంది కానుంది. ప్రస్తుతం దాదాపు 500 మంది రైతులు యాప్ లో ఉన్నారు. తెలంగాణలో సేంద్రీయ ద□వీకరణ సేవలు ఇస్తున్న ఇతర రీజినల్ కౌన్సిల్స్ అయిన ఏకలవ్య ఫౌండేషన్, సెంటర్ ఫర్ సస్టెయినబుల్ అగ్రికల్చర్ తో ఇతర ఆర్గానిక్ రైతుల వివారాలు కూడా ఈ యాప్ లో పొందుపరచడం జరుగుతుంది. సుమారు 100 కు పైగా ఆర్గానిక్ ప్రొడక్ట్స్ ఈ యాప్ లో కస్టమర్లకు అందుబాటులో ఉంచడం జరిగింది .రైతు మొబైల్ నంబర్, చిరునామా, లొకేషన్ వివరాలు పొందవచ్చు .రైతు వద్ద అందుబాటులో ఉన్న ద□వీక□ంచిన వివిధ ఆర్గానిక్ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయి. తెలంగాణ రాష్ట్ర విత్తన / సేంద్రీయ ద□వీకరణ అథారిటీ ద్వారా సేంద్రీయ ద□వీకరణ సర్టికెట్లు పొందిన రైతుల వివరాలు మాత్రమే యాప్ లో ఉంటాయి . ఈ యాప్ ద్వారా కేవలం ఆర్గానిక్ రైతు వివరాలు, మరియు అతన వద్ద అందుబాటులో ఉండే ప్రొడక్ట్స్ వివరాలు మాత్రం ఈ యాప్ లో ఉంచడం జరిగింది. ఆర్గానిక్ ప్రొడక్ట్స్ రేటు ను నిర్ణయించే అధికారం రైతుకు మాత్రమే ఉంటుంది. కావునా రైతును నేరుగా సంప్రదించి ధర విషయాలు చర్చించుకోవచ్చు.

# బెంగాల్లో రెండు నియోజకవర్గాల్లో రీ పోలింగ్

**మొత్తం 15 పోలింగ్ బూతుల్లో నేడు ఎన్నిక**

**కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం**

**ఇవిఎంల ట్యాంపరింగ్ ఆరోపణలు తోచిపుచ్చిన ఇసి**

న్యూఢిల్లీ:

పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కొన్నిచోట్ల అవకతవకలు జరిగినట్టు వచ్చిన ఫిర్యాదులపై భారత ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. రెండు నియోజకవర్గాల్లోని 15 పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్ నిర్వహించాలని నిర్ణయించింది. మగ్రహత్ పశ్చిమ్ నియోజకవర్గంలోని 11, డైమండ్ హార్బర్ నియోజకవర్గంలోని 4 పోలింగ్ బూత్‌లలో మే 2న శనివారం రీపోలింగ్ జరుపనున్నట్టు ప్రకటించింది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందని ఎన్నికల సంఘం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈనెల 29న జరిగిన ఎన్నికలకు సంబంధించి 142`మగ్రహత్ పశ్చిమ్ ఏసీ, 143`డైమండ్ హార్బర్ ఏసీ పరిశీలకులు, రిటర్నింగ్ అధికారుల నుంచి అందిన సమాచారం ప్రకారం ప్రజాప్రాతినిధ్య చట్టం`1951లోని సెక్షన్ 58లోని సబ్ సెక్షన్ (2)కింద 15 పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్‌కు ఎన్నికల కమిషన్ నిర్ణయించినట్టు ఈసీ తెలిపింది. కాగా, రీపోలింగ్‌కు సంబంధించి పోలింగ్ ఏరియాల్లో విస□తమైన ప్రచారం జరపాలని, తాజా పోలింగ్‌కు సంబంధించిన సమాచారాన్ని అభ్యర్థులకు లిఖిత పూర్వకంగా తెలియజేయాలని సంబంధింత అధికారులను ఈసీ ఆదేశించింది. ఈనెల 29న పశ్చిమబెంగాల్ అసెంబ్లీ తుది విడత పోలింగ్ ముగిసింది. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి. ఇదిలావుంటే భవానీపూర్‌లో పరిస్థితిని సవి క్షించేందుకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సౌత్ కోల్‌కతాలోని స్ట్రాంగ్ రూమ్‌కు వెళ్లడం, బీజేపీ కార్యకర్తలు అడ్డుకోవడంతో తలెత్తిన హైడ్రామాపై ఎన్నికల కమిషన్ స్పందించింది. ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందంటూ త□ణమల్ కాంగ్రెస్ చేసిన ఆరోపణలను తోసిపుచ్చింది. మమతా బెనర్జీ పోటీచేసిన భవానీపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కౌంటింగ్ సెంటర్ సఖావత్ మెమోరియల్ స్కూల్‌లో ఉంది. అక్కడి ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసేందుకు బీజేపీ ప్రయత్నించినట్లు టీఎంసీ కార్యకర్తలు ఆరోపించారు. అయితే టీఎంసీ ఆరోపణను నార్త్ కోల్‌కతా జిల్లా ఎన్నికల అధికారి స్మితా పాండే తోసిపుచ్చారు. పోస్టల్ బ్యాలెట్లను సెగ్రిగేట్ చేయడానికి చట్టబద్ధమైన పక్రియ ఉంటుందన్నారు. ఎన్నికల విధుల్లో ఉంటే అధికారులు, సిబ్బంది నేరుగా ఓటు వేయలేరని, అందువల్ల ఫెసిలిటేషన్ సెంటర్‌లో వారు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని చెప్పారు. ఈ పక్రియ కూడా పూర్తి కట్టుదిట్టమైన, భద్రతా వాతావరణంలో జరుగుతుందన్నారు. 'మా వాళ్లు కారిడార్‌లో కూర్చుని ఉన్నారు. ఈవీఎం □స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేసి ఉంది' అని చెప్పారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ల నిర్వహణ ఉంటుందని, ఈవీఎం రూమ్ సెపరేట్‌గా, పోస్టల్ బాలెట్ల రూమ్ సెపరేట్‌గా ఉంటాయని, తాము వాటిని తొలగించి సెగ్రిగేట్ చేస్తామని వివరించారు. ఈవీఎం ట్యాంపరింగ్ ఆరోపణల నేపథ్యంలో కౌంటింగ్ సెంటర్ వద్ద మమతాబెనర్జీ గురువారం రాత్రి సుమారు నాలుగు గంటలు ఉన్నారు. నిష్పాక్షిక ఎన్నికల పక్రియ నిర్వహణకు పారదర్శకత, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరని ఆమె ఉన్నారు. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసే ఎలాంటి చర్యలను సహించేది లేదని హెచ్చరించారు. ప్రజల ఓట్లను పరిక్షించాలని, తనకు పలు ఫిర్యాదులు రావడంతో ఇక్కడకు వచ్చానని, కేంద్ర బలగాలు తొలుత తనను లోపలకు రానీయలేదని చెప్పారు.

## గ్యాస్ ధరల పెంపు..ఎలక్షన్ బిల్లు

న్యూఢిల్లీ, నినాదం:

దేశంలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు రూ.993 మేర పెరగడంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. త్వరలో పెట్రోల్, డీజిల్ వంతు వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల తరువాత ధరాభారం పెరుగుతుందని తాను ముందే చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది ఎలక్షన్ బిల్లు అని వ్యాఖ్యానించారు. ఎక్స్ వేదికగా ఈ మేరకు పోస్టు పెట్టారు. కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధర మునుపెన్నడూ చూడని స్థాయిలో ఒక్కసారిగా పెరిగాయని రాహుల్ గాంధీ విమర్శించారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకూ రూ.1380ల మేర ధర పెరిగిందని అన్నారు. కేవలం మండు నెలల్లోనే ధర 81 శాతం మేర పెరిగిందని వివరించారు. ఎన్నికల తరువాత ఇలా జరుగుతుందని తాను ముందే చెప్పానని గుర్తు చేశారు. 'టీ స్టాల్స్, ధాబాలు, బేకరీ, స్వీట్ షాపులు.. ఇలా అందరిపైనా భారం పెరిగింది. చివరకు మీ ఆహార ఖర్చులపైనా ప్రభావం పడుతుంది. మొదట ఎల్‌పీజీ గ్యాస్ వంతు.. ఆ తరువాత పెట్రోల్`డీజిల్ ధరల వంతు వస్తుంది' అని అన్నారు. ఎన్నికలు ముగిశాక దేశంలో పెట్రోల్ ధరలు పెరుగుతాయని రాహుల్ గాంధీ మంగళవారం పేర్కొన్నారు. 'అలర్ట్‌గా ఉండండి.. ఎన్నికల వల్ల కలిగిన ఉపశమనం ఇక ముగిసినట్టే. ఇంధన ధరలు తక్కువగా ఉన్నప్పుడు మోదీ ప్రభుత్వం లాభాలను దండుకుంది. ఇప్పుడు ధరలు పెరిగాయి కాబట్టి ధరాభారాన్ని ప్రజలపై పెడుతుంది' అని రాహుల్ అప్పట్లో విమర్శించారు

## గ్యాస్ ధరల పెంపు సామాన్యుడిపై భారం

**హైదరాబాద్, నినాదం:**

కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం అమాంతం పెంచి సామాన్యుడి నడ్డి విరిచిందని తెలంగాణ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై మంత్రి ఫైర్ అయ్యారు. గ్యాస్ ధర పెంపుతో సామాన్యుడిపై పెను భారం మోపారంటూ ఆగ్రహించారు. 19 కేజీల గ్యాస్ సిలిండర్ ధరను రూ.993లకు అంటే సుమారు వెయ్యి రూపాయలకు పెంచడం దుర్మార్గమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. ఒక్కసారిగా 30 నుంచి 35 శాతం పెంచడంతో హోటళ్లు, రెస్టారెంట్లతో సహా చిన్నచిన్న వీధి వ్యాపారులపైనా తీవ్ర ప్రభావం పడనుందని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిసి 24 గంటలు పూర్తి కాగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తీవ్ర విమర్శలు గుప్పించారు. కమర్షియల్ గ్యాస్ ధర పెంపుతో సామాన్యుల జీవన ప్రమాణాలపై కోలుకోలేని దెబ్బ పడిందని మంత్రి ఆరోపించారు. మోదీ ప్రభుత్వం తక్షణమే స్పందించి ధరల పెంపు నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. కాగా, కమర్షియల్ గ్యాస్ ధరను పెంచుతూ మోదీ సర్కార్ ఈరోజు ఉదయం ఉత్తర్వులు జారీ చేసింది. 19 కేజీల సిలిండర్‌పై ఏకంగా రూ.993 పెంచింది. దీంతో ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో 19 కేజీల సిలిండర్ ధర రూ.3071.50కి చేరింది. కేంద్రం నిర్ణయంపై దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిసిన వెంటనే మోదీ ప్రభుత్వం యథావిధిగా ధరలు పెంచేసిందని ఆగ్రహిస్తున్నాయి. సామాన్యుడి నడ్డి విరిచేలా తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

## ఔటర్ రింగ్‌రోడ్డుపై ఘోర ప్రమాదం

లారీ వెనుక భాగంలో కారు ఇరుక్కుపోయి, నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ప్రమాదంపై సమాచారం అందుకోగానే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. లారీ వెనుక భాగంలో ఇరుక్కుపోయిన కారును యంత్రాల సహాయంతో బయటకు తీసారు. పెద్ద గోల్కొండ ఓఆరఆర్ ఎగ్జిట్ 16వ వద్ద ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదానికి గురైన కారు నెంబర్ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నామని పోలీసులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యాదగిరిగుట్ట వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు వివరించారు. మ్రుదేహాలను అతికష్టం మీద వాహనం నుంచి వెలికి తీశారు. ప్రమాద సమయంలో కారులో ఏడుగురు ఉన్నారు. అతి వేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. మ□తులంతా సిరిసిల్లకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న వీరంతా యాదగిరిగుట్ట వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలి

## అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశం




**వనపర్తి ప్రతినిధి, మే 1 (నినాదం):** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 2న నిర్వహించనున్న నియోజకవర్గస్థాయి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ ఆదేశించారు. మే 2న జిల్లాలో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ తో కలిసి శుక్రవారం జిల్లా అధికారులతో వెబ్ఎక్స్ ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మే 2న ఉదయం 10.00 గంటలకు వనపర్తి పట్టణంలోని దాచా లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఇటీవల నిర్వహించిన మండల స్థాయి, గ్రామస్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల మాదిరిగానే నియోజకవర్గస్థాయి కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలని సూచించారు. ఇందుకోసం సంబంధిత శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాల వివరాలను సిపిఓ కు అందజేయాలని సూచించారు. అన్ని వివరాలతో కలిపి సమగ్రంగా ఒక నోట్ తయారుచేసి కార్యక్రమంలో అందరికీ పంపిణీ చేయాలని ఆదేశించారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే పూర్తయిన ఐదు థీమ్స్(అరైవ్ అలైవ్, హెల్త్, యాంటీ డ్రగ్స్, బాలల రక్షణ, సంక్షేమం) కు సంబంధించి పిపిటి ప్రజెంటేషన్ ఇవ్వాల్సి ఉంటుందని, ఆ దిశగా సంబంధిత అధికారులు సిద్ధం కావాలని సూచించారు. అదేవిధంగా సంబంధిత శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అదనంగా ఈ కార్యక్రమానికి సంబంధించి కొన్ని ముఖ్య సూచనలు చేస్తూ ప్రజలకు ప్రయోజనం చేకూరే విధంగా ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ స్పష్టం చేశారు. కార్యక్రమానికి వచ్చే వారందరికీ భోజనాలు, తాగునీరు తదితర ఏర్పాట్లన్నీ పక్కాగా చేయాలని ఆదేశించారు. సర్పంచులు, వార్డు మెంబర్లు, కౌన్సిలర్లు అందరూ ప్రజాప్రతినిధుల్ని ఇందులో పాల్గొనే విధంగా వారికి సమాచారం తెలియజేయాలని సూచించారు.

సరిగ్గా 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమయ్యే విధంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పి సీఈవో యాదయ్య, సిపిఓ హరికృష్ణ, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, వనపర్తి నియోజకవర్గం అన్ని మండలాల తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి జాతర మహోత్సవం

## ప్రత్యేకపూజలు నిర్వహించిన జువ్వాడి కృష్ణారావు



**కోరుట్ల, మే 1 (నినాదం):** కోరుట్ల నియోజక వర్గ పరిధిలోని మెట్ పల్లి మండలం మేడిపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహిం చిన శ్రీ వేంకటేశ్వర స్వామి జాతర మహోత్సవంలో రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ ఆ వెంకటేశ్వర స్వామి కరుణ కటాక్షాలతో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచులు, వివిధ హోదాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పేదవాడి పక్షాన నిలిచేది ఎర్రజెండానే..

### అనంతగిరి, శాంతినగర్, బొజ్జగూడెం తండా గ్రామాల్లో ఘనంగా మేడే ర్యాలీ

### కార్మిక, కర్షకుల హక్కుల కోసం ఎర్రజెండా నిరంతర పోరాటం

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి



**కోదాడ,మే1(నినాదం):** పేదవాడి పక్షాన పోరాడేది ఎప్పటికీ ఎర్రజెండానే అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి అన్నారు. కార్మిక, కర్షకుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేసేది కమ్యూనిస్టు ఉద్యమమేనని ఆయన స్పష్టం చేశారు. అనంతగిరి మండల కేంద్రంతో పాటు శాంతినగర్, బొజ్జగూడెం తండా గ్రామ శాఖల ఆధ్వర్యంలో మేడే (అంతర్జాతీయ కార్మిక దినోత్సవం)ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించి ఎర్రజెండా రెపరెపల మధ్య కార్మికుల ఐక్యత, హక్కుల సాధన నినాదాలతో గ్రామాలు మార్మోగాయి. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో... బద్దం కృష్ణారెడ్డి మాట్లాడుతూ... కమ్యూనిజాన్ని అణిచివేయడం ఎవరి వల్లా సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాలు మారినా ప్రజల పక్షాన, ప్రజా సమస్యలపై నిలబడి పోరాడేది ఒక్క కమ్యూనిస్టులేనని ఆయన అన్నారు. కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఎర్రజెండా ఎప్పుడూ ముందుండి పోరాటం చేస్తుందని తెలిపారు. సిపిఐ మండల కార్యదర్శి ఎర్రసాని రవి మాట్లాడుతూ మేడే స్ఫూర్తిని ప్రతి గ్రామానికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామ శాఖ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం మేడే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా నినాదాలు చేశారు.



# బాలసదనంలోని చిన్నారులకు క్రీడా సామాగ్రి పంపిణీ

## ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సీతక్క




**ములుగు ప్రతినిధి, మే 1 (నినాదం):** ములుగు జిల్లా కేంద్రంలోని బాలసదనంలో ఉన్న చిన్నారులకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక (99 రోజుల ప్రత్యేక కార్యాచరణ) ను అనుసరించి నిర్వహిస్తున్న బాలల భద్రత, సంరక్షణ మరియు సంక్షేమ వారోత్సవాలలో భాగంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం ములుగు ఆధ్వర్యంలో క్రీడా పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. జిల్లా బాలల పరిరక్షణ అధికారి జే ఓంకార్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి, జిల్లా సంక్షేమ అధికారి పి ప్రేమలత అధ్యక్షత వహించగా, రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారులకు క్రీడా సామాగ్రి అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ బాలసదనంలో ఉన్న పిల్లలంతా బాల సదనాన్ని ఒక వసతి గృహంలా కాకుండా ఇల్లులా భావించి కుటుంబ వాతావరణంతో జీవించాలని సూచించారు. బాల సదనంలోని చిన్నారులంతా చక్కగా చదువుకొని ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ప్రయోజకులు కావాలని అన్నారు. ఈ సందర్భంగా బాలసదనంలో ఉంటున్న చిన్నారుల ఆలనా పాలన చూస్తున్న సిబ్బంది అధికారులను ప్రత్యేకంగా అభినందించి, ఇలాగే ఎల్లప్పుడూ పిల్లలను కన్నబిడ్డల్లాగా కంటికి రెప్పలా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముందుగా డిసిపిఓ ఓంకార్ మాట్లాడుతూ బాలల భద్రత, రక్షణ, డ్రగ్స్ నిర్మూలన మరియు సంక్షేమ వారోత్సవాలలో భాగంగా ఇప్పటివరకు నిర్వహించిన కార్యక్రమాలను మంత్రిగారికి వివరించారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారి ఈపి ప్రేమలత మాట్లాడుతూ జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ పరిధిలోని వివిధ విభాగాల ఆధ్వర్యంలో ఇప్పటివరకు నిర్వహించిన కార్యక్రమాలను, ముఖ్యంగా బాల్య వివాహం - బ్రతుకు ఆగం కార్యక్రమం ద్వారా ములుగు జిల్లాను బాల్య వివాహాలు లేని జిల్లాగా తీర్చిదిద్దుటకు నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల వివరాలను మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, ములుగు సిడిపిఓ శ్రీమతి కూచన శిరీష, స్థానిక ఐసిడిఎస్ సూపర్వైజర్లు, జిల్లా మహిళా సాధికారత కేంద్రం డి ఎం సి రమాదేవి, సఖి సిఏ లావణ్య, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ నరేష్, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ మమత, కార్యాలయ సిబ్బంది మరియు ఆయా విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నీట్ ప్రవేశ పరీక్షకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు...

- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** భూపాలపల్లి జిల్లాలో మే 3న నిర్వహించబడనున్న నీట్ -- 2026 ప్రవేశ పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద శాంతి భద్రతలు కాపాడేందుకు సెక్షన్ 163 బిఎన్ఎస్-ఎస్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్,ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష రోజు మధ్యాహ్నం 12:00 గంటల నుండి సాయంత్రం 7:00 గంటల వరకు పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో నిబంధనలు అమల్లో ఉంటాయని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి గుంపులుగా నిలవడం నిషేధమని, సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదన్నారు. ముఖ్యంగా మైకులు, డీజేలు వినియోగించడం పూర్తిగా నిషేధించడం జరిగిందని, పరీక్ష సమయంలో ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని, విద్యార్థులు పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచీలు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దని ఆయన సూచించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయని, పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పోలీస్ పెట్రోలింగ్ బృందాల నియామకం చేశామని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా బృందాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు, సంఘాల నాయకులు, తల్లిదండ్రులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. నిబంధనలు అతిక్రమించిన పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

# ఘనంగా మేడే ఉత్సవాలు

### రెపరెపలాడిన కార్మిక జెండాలు

### వేడుకల్లో పాల్గొన్న కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు




**కోరుట్ల, మే 1 (నినాదం):** ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా కార్మిక జెండాలు రెపరెపలాడాయి. నియోజక వర్గ కేంద్రమైన కోరుట్ల పట్టణం లో శుక్రవారం మేడే సందర్భం గా మున్సిపల్ కార్యాలయ సమీపంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు, కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ లు జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, నాయకులు సుతారి రాములు, రాంబాబు మున్సిపల్ కార్మికులు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రేపు దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, కాలిపర్లు పంపిణీ

## నారాయణ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో అందజేత



**హైదరాబాద్ బ్యూరో, మే 1 (నినాదం):** నారాయణ సేవా సంస్థాన్ (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో మే 3న హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్లో భారీ ఉచిత కృత్రిమ అవయవాల పంపిణీ శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో ముందుగా ఎంపికైన 745 మంది దివ్యాంగులకు మొత్తం 815 నారాయణ మాడ్యులర్ కృత్రిమ అవయవాలు, కాలిపర్లు ఉచితంగా అందించనున్నారు. సీఎస్ఆర్ భాగస్వాములతో కలిసి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో నిపుణులైన వైద్యులు అవయవాల అమరికతో పాటు, వాటి వినియోగంపై శిక్షణ కూడా ఇస్తారు. ఈ శిబిరం ద్వారా దివ్యాంగులకు స్వావలంబన, ఆత్మవిశ్వాసం పెంపొందించడం లక్ష్యమని సంస్థ ప్రతినిధులు, తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు ప్రశాంత్ అగర్వాల్ మాట్లాడుతూ, "దివ్యాంగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తున్నాం. అవసరమైన ప్రతి ఒక్కరికీ కృత్రిమ అవయవాలు అందించి, వారు గౌరవప్రదమైన జీవితాన్ని గడపడం మా ముఖ్య లక్ష్యం" అని తెలిపారు. సంస్థ పేట్రన్ అల్కా చౌదరి మాట్లాడుతూ, "ఇలాంటి శిబిరాలు దివ్యాంగుల జీవితాల్లో కొత్త ఆశను నింపుతాయి. వారికి స్వతంత్రంగా జీవించే అవకాశాన్ని కల్పించడం మా ధ్యేయం" అని పేర్కొన్నారు. హైదరాబాద్ ఆశ్రమం హెడ్ మహేంద్ర సింగ్ రావత్ మాట్లాడుతూ, "హైదరాబాద్లో ఈ శిబిరాన్ని నిర్వహించడం గర్వంగా ఉంది. లబ్ధిదారులకు ఉత్తమ సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాము" అని తెలిపారు. శిబిర ఇన్చార్జ్ హరి ప్రసాద్ లడ్డా మాట్లాడుతూ, "లబ్ధిదారుల ఎంపిక నుండి అవయవాల అమరిక వరకు ప్రతిదీ నిపుణుల పర్యవేక్షణలో జరుగుతుంది. వారికి సరైన శిక్షణ కూడా అందిస్తాము'' అని చెప్పారు.

# హరితహారం మొక్కలకు నిప్పు.. మంటలు అదుపులోకి



**కోదాడ, మే1, (నినాదం):** అనంతగిరి మండల కేంద్రం నుంచి అమీనాబాద్ వెళ్లే రహదారి మార్గమధ్యంలో హరితహారం మొక్కలకు గుర్తుతెలియని అగాంతకులు నిప్పు పెట్టారు. దీంతో మొక్కలు దగ్ధమయ్యాయి. స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా, వారు ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తూ విచారణ చేపట్టాలని కోరుతున్నారు.

# కార్మికుల హక్కులను కాలరాస్తే కఠినచర్యలు

## భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**భూపాలపల్లి ప్రతినిధి, మే 1(నినాదం):** కార్మికుల హక్కులను కాలరాస్తే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హెచ్చరించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా కార్మిక, ఉపాధి, కర్మాగారాలు మరియు శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మే డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డా బిఆర్ అంబేద్కర్ కార్మికులకు 8 గంటలు పని గంటలు ఉండాలని రాజ్యాంగంలో పొందుపరచినట్లు తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్మికులచే వెట్టి చాకిరి చేపించే వ్యవస్థలపై ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా వ్యవహరిస్తుందని, చట్ట ప్రకారం ప్రతి ఒక్కరూ తమ విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. మెగా ఏజెన్సీ 140 మంది కార్మికులు చేయాల్సిన పనులను 70 మందితో పనులు నిర్వహిస్తున్నదని, దీనిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే, అధిక పని భారం మోపే అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలను బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలని సూచించారు. అనంతరం కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం మే డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తోందని తెలిపారు. కార్మికుల కృషితోనే సమాజం అభివృద్ధి చెందుతుందని, ఎన్నో త్యాగాల ఫలితంగా ఈ హక్కులు సాధ్యమయ్యాయని కొనియాడారు. కార్మికులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. "డిగ్నిటీ ఆఫ్ లేబర్ ఈజ్ యువర్ రైట్" అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, కార్మిక శాఖ అధికారి వినోద, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, ఐటీఐ ప్రిన్సిపాల్ జుమ్లా నాయక్, సింగరేణి ఏజీఎం ఎర్రన్నతో పాటు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి, వెంకటేశ్వర్లు, సతీష్, ఐఎన్టీయుసి జిల్లా కార్యదర్శి మధుకర్ రెడ్డి, క్యాతం సతీష్, కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏటీసీలో షార్ట్ టర్మ్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేయబడిన ఉద్యోగులను సన్మానించారు.

# కార్మికుల హక్కుల కోసం పోరాడాలి..





## మాజీ సర్పంచ్ రాంలాల్ నాయక్

## మరిపెడలో ఘనంగా మేడే వేడుకలు

**డోర్నకల్ /మరిపెడ, మే 01 (నినాదం):** గౌరవ అధ్యక్షులు పాంగోత్ రాంలాల్ నాయక్ మాట్లాడుతూ చికాగో నగరంలో కార్మికులపై జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ ఏడుగురు కార్మికులు మృతి చెందడంతో 18 గంటల పని దినాన్ని ఎనిమిది గంటలకు కుదించి కార్మికులందరూ ఏకమై ప్రపంచ వ్యాప్తంగా కార్మిక దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు. నేటి ప్రభుత్వాలు తమ పబ్బం గడుపుకోవడం కోసం కార్మికులను ఇబ్బంది పెడుతున్నాయని, కార్మిక హక్కులను సాధించుకోవడం కోసం కార్మికుల అందరం ఏకమై పోరాటం చేయవలసిన సమయం వచ్చిందన్నారు. ఏఐ (ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్) అనేక కార్మికుల ఉద్యోగాలు పోయే అవకాశం ఉంది..కావున టెక్నాలజీకి వ్యతిరేకం కాదని,కానీ కార్మికుల పక్షాన కూడా ప్రభుత్వాలు ఆలోచన చేయాలని కోరారు.మేడే వేడుకలను ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించేది,కార్మికుల హక్కులను సాధించుకోవడం కోసమే తప్ప ఏదో సంతోషం కోసం కాదన్నారు. ఇప్పటికైనా కార్మికులందరూ ఏకమై హక్కుల కోసం పోరాడిల్సి వస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి అలవాల వీరన్న,ఏఐటియుసి కార్యదర్శి రషీద్,సిపిఐ మరిపెడ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ,వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి బాణాల రాజన్న, సిపిఎం మండల కార్యదర్శి గుండగాని మధు,భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు కొండ ఉప్పలయ్య,సివిల్ సప్లై హమాలీ సంఘం అధ్యక్షులు నారాయణ, కార్మికుల సంఘం అధ్యక్షులు ధరావత్ వెంకన్న నాయక్, మున్సిపల్ చైర్ పర్సన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి,వైస్ చైర్ పర్సన్ సునీత రవీందర్ రెడ్డి,15 వార్డుల కౌన్సిలర్లు,అల్వాల ఉపేందర్ ప్రజాపతి, మున్సిపాలిటీ కమిషనర్, మున్సిపాలిటీ సిబ్బంది శ్రీను నాయక్,అశోక్, మున్సిపాలిటీ వర్కర్లు, మార్బుల్ టైల్స్ సంఘం అధ్యక్షులు పటాన్ పాషా,నరసింహారెడ్డి, తాజుద్దీన్ పెయింటర్ సంఘం అధ్యక్షులు, అన్ని అనుబంధ కార్మిక సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.




# ఉత్తమ ప్రతిభ కనబరిచిన మౌంట్‌ఫోర్ట్ విద్యార్థులకు అభినందనలు




**హుజూర్‌నగర్ (మఠంపల్లి), మే 01 (నినాదం):** మఠంపల్లి మండల కేంద్ర&లోని మాంట్ ఫోర్ట్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బ్రదర్ వినోద్ రెడ్డి వారిని అభినందించారు. బ్రదర్ వినోద్ రెడ్డి మాట్లాడుతూ మొత్తం 27 మందికి 27మంది విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించారని 20మందికి 500 మార్కులు కంటే ఎక్కువ వచ్చాయని,మండలం ఫస్ట్ 578 మార్కులు బానోతు లోహిత మా పాఠశాల విద్యార్థికి రావడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు.అనంతరం కెక్ కట్ చేసి విద్యార్థులకు తినిపించి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఇలాగే ఉన్నత చదువులలో అత్యంత ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తేవాలని కొనియాడారు. ఇట్టి కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# అంబిటస్ స్కూల్ టాపర్‌కు సన్మానం



**సిద్దిపేట, మే 01(నినాదం):** పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి స్కూల్ టాపర్‌గా నిల్చిన విద్యార్థినిని రాందేని వర్షశ్రీ ని పాఠశాల యాజమాన్యం గురువారం అభినందించారు. సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామానికి చెందిన రాందేని గణేష్ సత్తవ్వ దంపతులు పట్టణంలోని రాంనగర్‌లో గత కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నారు. వీరి చిన్న కూతురు రాందేని వర్షశ్రీ జిల్లా కేంద్రం సిద్దిపేటలోని అంబిటస్ పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసింది. బుధవారం వెలువడిన పది ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి 600 మార్కులకు గాను 588 మార్కులు సాధించి వర్షశ్రీ స్కూల్ టాపర్‌గా నిలిచింది. దీంతో పాఠశాల యాజమాన్యం ఎడ్ల జ్యోతిరెడ్డి, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డిలు విద్యార్థినిని పాఠశాలలో గురువారం శాలువాతో సన్మానించి, అభినందించారు. అదేవిదంగా పాఠశాలలో 550కి పైగా 35మంది, 500 మార్కులకు పైగా 76మంది విద్యార్థులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతి తెలిపారు. సహకరించిన పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను, విద్యార్థులను అభినందించారు. స్కూల్ ఫస్ట్ వచ్చేలా తనకు సహకరించిన పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులకు వర్షశ్రీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ విజయ్‌భాస్కర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరు సుబిక్షంగా ఉండాలి

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్



**మల్కాజ్‌గిరి, మే 1(నినాదం):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ నేరేడ్ మెట్ లోని సమయపురం మరియమ్మన్ దేవాలయం 21వ వార్షికోత్సవ పూజా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నేరేడ్ మెట్ లోని గణపతి దేవాలయం నుండి సమయపురం మరియమ్మన్ దేవాలయం వరకు భక్తులు బోనాలతో నిర్వహించిన భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మరియమ్మ ఆలయ అభివృద్ధి, భక్తులకు అందిస్తున్న సౌకర్యాలపై నిర్వాహకులతో చర్చించారు. అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కదిరివెల్ దేవాలయం స్వామి షణ్ముఖ మణికంఠ సుబ్రహ్మణ్యం, స్థానిక బీఆర్ఎస్ నాయకులు రావుల అంజయ్య, చిందం శ్రీనివాస్, వెంకన్న, హేమంత్ పటేల్, నవీన్ రాజు, అవినాష్, జేకే సాయి గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రాజేష్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

**కలెక్టర్ దివాకర టీఎస్**
**మొక్కజొన్న కొనుగోలు వేగవంతం చేయాలి**
**మద్దతు ధరతో**
**2,3 రోజుల్లో కొనుగోలు పూర్తి**
**మద్దులపల్లి, నాగులవంచ, మధిర మార్కెట్ యార్డులలో కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్**





**ఖమ్మం ప్రతినిధి,మే1 (నినాదం) :** మొక్కజొన్న కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ రైతులకు భరోసా కల్పించారు.జిల్లా కలెక్టర దివాకర టీఎస్ పాలేరు నియోజక వర్గం ఏదులాపూరం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మధిర నియోజకవర్గం లోని చింతకాని మండలం నాగులవంచ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని, అలాగే మధిర వ్యవసాయ మార్కెట్ యార్డు లోని కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల వరకు మొక్కజొన్న రావడం జరుగుతుం దని తెలిపారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో ప్రైవేట్ మార్కెట్‌లో ధరలు పడిపోవడంతో రైతులు పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలకు వస్తున్నారని, దీంతో ఒక్కసారిగా కొనుగోలు కేంద్రాలపై ఒత్తిడి పెరిగిందన్నారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని మౌళిక సదుపాయాలు తక్షణం అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రవాణా, హమాలీ సంబంధిత సమస్యలు ఎలాంటి పరిస్థితుల్లోనూ తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. మార్కెట్ యార్డుల్లోకి వచ్చే నాణ్యమైన మొక్కజొన్నను మద్దతు ధరతో 2-3 రోజుల్లో కొనుగోలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వాతావర ణంలో మార్పుల కారణంగా అకాల వర్షపాతం వలన మొక్కజొన్న ఆలస్యం చేయకుండా ఎప్పటికప్పుడు తూకం చేసి సురక్షితంగా నిల్వ చేయాలని తెలిపారు. పంట దిగుబడి అధికంగా ఉన్న ఈ సమయంలో రైతులకు అన్ని విధాలుగా అధికారులు సహకరించాలని కలెక్టర్ సూచించారు.మొక్కజొన్న నిల్వపై అన్ని మార్కెట్ యార్డుల్లో సమాంతరంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎప్పటికప్పుడు కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించాలని తెలిపారు. అకాల వర్షాలకు ముందస్తు చర్యల్లో భాగంగా గన్నీబ్యాగులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకొని అప్రమత్తంగా ఉండాల ని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి అలీమ్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ సెక్రటరీ పీ.వీరాంజనేయులు, ఏదులాపూరం మున్సిపల్ కమీషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, ఎదులాపురం మున్సిపల్ చైర్ పర్సన్ పి.అనిత, మధిర మార్కెట్ కమిటి చైర్మెన్ బండారు నరసింహారావు, ఆర్డీఓ శ్రీనివాస్, మధిర తహసీల్దారు రాంబాబు, ఖమ్మం రూరల్ తహసిల్దార్ వినయేందర్ రెడ్డి, చింతకాని తహసీల్దారు పి.బాబ్జీ ప్రసాద్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి పురోగతి సాధించాలి

**గద్వాల బ్యూరో మే1 (నినాదం) :** ఇందిరమ్మ పథకం కింద మంజూరైన ఇళ్లను లబ్ధిదారులు వేగవంతంగా పూర్తి చేసుకునేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసి సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాపు పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా మంజూరైన ఇళ్లు,గ్రౌండింగ్, పనుల పురోగతి,నిర్మాణ దశలు, ఇంకా ప్రారంభం కాని ఇళ్లపై తీసుకున్న చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జిల్లా రాష్ట్రంలో చివరిస్థానంలో ఉండడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పురోగతిని వేగవంతం చేసి, లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మంగళవారం, గురువారం ఎంపీడీఓలు క్షేత్ర స్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రదేశాలకు వెళ్లి లబ్ధిదారుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మొదటి విడతలో ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు పూర్తి స్థాయిలో గ్రౌండింగ్ జరగాల్సిందేనని స్పష్టం చేశారు.ఇంటి నిర్మాణం చేపట్టేందుకు ముందుకురాని వారి మంజూరీలను రద్దు చేసిన చోట, వారి స్థానంలో అర్హులైన కొత్త వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ కమిటీలను సంప్రదించి ఆసక్తి కలిగిన అర్హులను




గుర్తించాలన్నారు. మార్క్ అవుట్ నుంచి బేస్‌మెంట్, స్లాబ్ దశల ద్వారా ఇల్లు పూర్తయ్యే వరకు ప్రతి దశను కట్టుదిట్టంగా పర్యవేక్షిస్తూ పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యానికి తావు కల్పిస్తే ఉపేక్షించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పంచాయతీ కార్యదర్శుల పనితీరును ఎంపీడీఓలు కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని సూచించారు. ఐహెచ్ఎల్ టాయిలెట్లకు సాంక్షన్ ఆర్డర్లు వెంటనే జారీ చేసి, ఇల్లు పూర్తయ్యే సమయానికి టాయిలెట్ నిర్మాణం కూడా పూర్తయ్యేలా అధికారులు లబ్ధిదారులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా సమయానికి చెల్లింపులు జరగాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, డి.ఆర్.డి.ఓ ముసాయిదా బేగం,ఆయా మండలాల ఎంపీడీఓలు, హౌసింగ్ డి.ఈలు, ఏ.ఈ లు పాల్గొన్నారు.

# అన్నదాతలు దళారుల ఆశ్రయించి దగా పడొద్దు

**ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం విక్రయించాలి**
**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు**





**కోరుట్ల, మే1 (నినాదం) :** ఆరుగాలం అనేక కష్టనష్టాలకు ఓర్చి అన్నదాతలు దళారుల ఆశ్రయించి పండించిన వరి ధాన్యం విక్రయించి దగా పడకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. కోరుట్ల మండలంలోని గుమ్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలంలోని గోధూర్ గ్రామాల్లో శుక్రవారం కోరుట్ల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, ఇబ్రహీంపట్నం మండల వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎల్లాల వెంకటరెడ్డితో కలిసి కొనుగోలు కేంద్రాలను కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ రనాయకులు జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కట్టింగుల పేరుతో రైతులను మోసం చేసిందని, కానీ నేడు రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతిగా రైతుల సంక్షేమ సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తుందని రైతులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ఆదుకుంటుందని తూకం విషయంలో రైతులకు ఎలాంటి అన్యాయం జరిగిన ఊరుకోబోమన్నారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకొని ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర పొందాలని దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, ఇబ్రహీంపట్నం మండల వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎల్లాల వెంకటరెడ్డి, కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం, కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోయినపల్లి సత్యనారాయణ రావు, ఇబ్రహీంపట్నం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూడ శ్రీకాంత్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మండల పరిషత్ మాజీ అధ్యక్షులు కోటగిరి వెంకటస్వామి, వివిధ గ్రామాల సర్పంచులు, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు గడ్డం వెంకటేష్ గౌడ్, కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటేష్ గౌడ్, రంజిత్ రెడ్డి, డైరెక్టర్ బూస రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# రహదారులపై చికెన్ వ్యర్థాలు

**దుర్వాసనతో వాహనదారుల ఇబ్బందులు**
**షాపుల నిర్వాహకుల నిర్లక్ష్యంతో ప్రజారోగ్యానికి ముప్పు**
**చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్**





**కోదాడ,మే1(నినాదం):** అనంతగిరి మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ప్రధాన రహదారులైన అనంతగిరి-ఖానాపురం, అనంతగిరి-పాలవరం, త్రిపురవరం-వల్లపురం మార్గాల్లో చికెన్ షాపుల నిర్వాహకులు, పౌల్ట్రీ యాజమానులు వ్యర్థాలను ఇష్టారీతిగా రహదారుల వెంట పారవేస్తుండటంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.చికెన్ వ్యర్థాలు, మాంసపు అవశేషాలు, రెక్కలు రహదారులపై పెద్ద ఎత్తున పేరుకుపోవడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. వాహనదారులు, ప్రయాణికులు, పాదచారులు ఆ మార్గాల్లో ప్రయాణించా లంటేనే ఇబ్బందిగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో ఎండ తీవ్రతకు తోడు వ్యర్థాల దుర్వాసన మరింత పెరుగుతోందని పేర్కొంటున్నారు.గాలి దుమారాలు వచ్చినప్పుడు కోడి రెక్కలు, వ్యర్థాలు ఎగిరి రోడ్డంతా వ్యాపించడంతో పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. దీంతో దోమలు, ఈగల పెరుగుదల కూడా అధికమవుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు కలిగించే పరిస్థితి అని స్థానికులు హెచ్చరిస్తున్నారు.చికెన్ షాపుల, పౌల్ట్రీ యజమానులు, వ్యర్థాలను సక్రమంగా నిర్వహించకపోవడం, డంపింగ్ పాయింట్లు లేకపోవడం కూడా సమస్యను మరింత తీవ్రతరం చేస్తోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. సంబంధిత గ్రామ పంచాయతీలు, మండల అధికారులు వెంటనే స్పందించి వ్యర్థాల నిర్వహణకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.రహదారులపై పారిశుధ్య చర్యలు చేపట్టి, వ్యర్థాలు పారవేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. లేదంటే ప్రజారోగ్య సమస్యలు మరింత పెరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి వేగం పెంచాలి

**లబ్ధిదారుల ఎంపిక, నిర్మాణ పురోగతిపై కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ సమీక్ష**



**కరీంనగర్, మే 1(నినాదం) :** కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ హౌజింగ్, మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నగరంలో పేదల సొంతింటి కలను నెరవేర్చే ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు, నిర్మాణాల పురోగతిపై విస్తృతంగా చర్చించారు. మొదటి విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణ పనుల స్థితిని పరిశీలించిన కమీషనర్, పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. నిర్మాణాలు చేపట్టలేమని లిఖితపూర్వకంగా తెలిపిన లబ్ధిదారుల స్థానంలో అర్హులైన కొత్త వారిని ఎంపిక చేయాలని సూచించారు. డివిజన్ వారీగా ప్రాథమిక జాబితాలో ఉన్న లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిజమైన అర్హులను గుర్తించాలన్నారు. ఇళ్ల నిర్మాణంలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించడం, బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యం లేకుండా చూడాలని హౌజింగ్ అధికారులను ఆదేశించారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా, ప్రాంతాల్లో పర్యటించి పనుల నాణ్యతను పరిశీలించాలని సూచించారు. ప్రతి అర్హ పేద కుటుంబానికి ఇల్లు అందించే ప్రభుత్వ లక్ష్య సాధనకు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ఈ సమావేశంలో నగరపాలక సంస్థ ఉప కమీషనర్ ఖాధర్ మొహియుద్దీన్ సహా హౌజింగ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్‌ప్రతినిధి, మే1(నినాదం):** జిల్లాలో ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో వేసవికాలం త్రాగునీటి సరఫరాపై జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ప్రజలకు అందిస్తున్న త్రాగునీటి గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ కూడా ప్రజలకు త్రాగునీటికి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఎక్కడైనా ప్రజలకు త్రాగునీరు అందించడంలో ఇబ్బందులు ఎదురైతే, అధికారులు వెంటనే స్పందించి, త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని అన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాలలో ఎక్కడైనా తాగునీటి సరఫరా పైపులు లీకేజీలు, మరమ్మత్తులు ఉంటే రిపేర్లు చేపట్టాలన్నారు. నీటి ఎద్దడి ఉన్న గ్రామాలలో త్రాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, డిపిఓ శ్రీనివాస్, జెడ్పి సీఈవో భాగ్యలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చలివేంద్రాల ఏర్పాటు

**ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**



**మల్కాజ్‌గిరి, మే 1 (నినాదం) :** మల్కాజిగిరి నియోజకవర్గంలో రోజు రోజుకూ పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యల్లో భాగంగా మల్కాజిగిరి లోని సాయిరాం ధియేటర్ ఎదురుగా, కాకతీయ నగర్ లోని నాగలక్ష్మి ఫంక్షన్ హాల్ వద్ద, పల ప్రాంతాలలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదాచారులు, కార్మికులు, ప్రయాణికులు తీవ్ర ఎండలో దాహంతో ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, వారి కోసం ఉచిత తాగునీటి సదుపాయం అందించాలనే ఉద్దేశంతో ఈ చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఈ చలివేంద్రాల ద్వారా స్థానిక ప్రజలు, రోజువారీ కూలీలు, ప్రయాణికులు తాగునీటి సదుపాయం పొందుతూ వేసవి తాపాన్ని తట్టుకునేలా సహాయం అందించబడుతుందని తెలిపారు. చలివేంద్రాల ఏర్పాటులో సహకరించిన మాజీ కార్పొరేటర్ ఏకే మురుగేష్, బిఆర్ఎస్ నాయకులు సంపత్ యాదవ్ లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, జేపీసీ వెంకన్న, మేకల రాము యాదవ్, చిన్న యాదవ్, ధర్మేంద్ర యాదవ్, సురేష్, బాలకృష్ణ, ఉమాపతి, వెంకటేష్, హేమంత్ పటేల్, హేమంత్ రెడ్డి, పేపర్ శీను, వినీత్, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

**నాగర్ కర్నూల్ కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్, రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ డాక్టర్ ఆకునూరి మురళి**



**నాగర్ ర్నూల్ మే 1( నినాదం) :** నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని వంగూరు మండలంలో విద్యా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగం గా నిర్మాణంలో ఉన్న తెలంగాణ మోడల్ పబ్లిక్ స్కూల్ పనులను రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ డాక్టర్ ఆకునూరి మురళి, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ శుక్రవారం ప్రత్యక్షంగా పనుల పురోగతిని పరిశీలించారు. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని వంగూరు మండలంలోని పోల్కంపల్లి, వంగూరు, గ్రామాల్లో నిర్మాణం జరుగుతున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ భవిష్యత్తులో గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన, ఆధునిక విద్య అందించే కేంద్రాలుగా రూపుదిద్దుకుంటున్నాయని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్, రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ డాక్టర్ ఆకునూరి మురళి పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల నాణ్యత, వేగం, ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం పనులు కొనసాగుతున్నాయా లేదా అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా తరగతి గదులు, లైబ్రరీ భవనాలు, సైన్స్ మరియు కంప్యూటర్ ప్రయోగశాలలు, విద్యార్థుల కోసం ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, క్రీడా మైదానాలు తదితర మౌలిక వసతుల నిర్మాణాలను సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ డాక్టర్ ఆకునూరి మురళి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా పట్టణ స్థాయి విద్యా వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యారంగాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరిస్తోందని తెలిపారు. విద్యార్థుల విద్యకు ఎటువంటి అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనులు నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా తరగతి గదులు, తాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్లు వంటి ప్రాథమిక వసతులను ప్రాధాన్యతగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ వేగవంతంగా నిర్మాణాలు పూర్తి చేయాలని, ప్రభుత్వం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆధునిక విద్యా వసతులు కల్పించేందుకు కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే సమయానికి విద్యార్థులకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం అందుబాటులో ఉండేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని , అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందిస్తున్న ఈ మోడల్ పబ్లిక్ స్కూల్స్‌లో విశాలమైన తరగతి గదులు, డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు, ఆధునిక ప్రయోగశాలలు, సమృద్ధిగా పుస్తకాలతో కూడిన గ్రంథాలయాలు, విద్యార్థుల శారీరక వికాసానికి అనువైన క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గ్రామీణ విద్యార్థులు కూడా పోటీ ప్రపంచానికి తగిన విధంగా తయారవ్వడానికి ఈ పాఠశాలలు కీలకంగా మారతాయని డాక్టర్ ఆకునూరి మురళి సూచించారు. జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ప్రభుత్వ విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించిందని, అందులో భాగంగానే నాగర్కర్నూల్ జిల్లాలో ప్రథమంగా నెలకొల్పుతున్న ఈ పాఠశాలల నిర్మాణ పనుల్లో ఎలాంటి రాజీ లేకుండా పనులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. నిర్మాణ పనుల పురోగతిపై జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందన్నారు. పనులు వేగవంతంగా, నాణ్యతతో పూర్తయ్యేలా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన మరియు సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పాఠశాల భవనాల నిర్మాణం వేగవంతంగా కొనసాగేందుకు అవసరమైన అన్ని వనరులను సమయానికి అందుబాటులో ఉంచుతామని చెప్పారు. ముఖ్యంగా ఇసుక సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా జిల్లా యంత్రాంగం మైనింగ్ శాఖ అధికారులతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తోందన్నారు. పాఠశాల నిర్మాణానికి అవసరమైనంత ఇసుకను ఎప్పటికప్పుడు సరఫరా చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, నిర్మాణ పనులు గడువులోపు పూర్తి అయ్యేలా అన్ని శాఖలు సమిష్టిగా పనిచేస్తాయని కలెక్టర్ తెలిపారు. .పనుల నాణ్యత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రతి దశలో సాంకేతిక ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని వారు అధికారులకు సూచించారు. నిర్మాణ సంస్థలు నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేసి విద్యార్థులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు కూడా పనుల పర్యవేక్షణలో భాగస్వామ్యం కావాలని సూచించారు.పాఠశాల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాఠశాలల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని, నిర్మాణ పనులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి..!

**బుర్ర శ్రీనివాస్ గౌడ్, గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్**
**ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న గౌడ సంఘనేతలు**



**హుస్నాబాద్, మే 1(నినాదం):** హుస్నాబాద్ పట్టణంలో శ్రీ రేణుక ఎల్లమ్మ మహా జాతర శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది.ఈ సందర్భంగా గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకు దెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ జాతర నెల రోజులపాటు జరగనుందని,భక్తుల పాలిట ఇలవేల్పు కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారం శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకునేందుకు వివిధ రాష్ట్రాల నుంచి మరియు వివిధ జిల్లాల నుంచి అనేకమంది వచ్చి మొక్కులను చెల్లించుకుంటారని అయన అన్నారు.కాకతీయ కాలంనాటి పురాతన ఈ ఎల్లమ్మ ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందిందని,అని అన్నారు.నెల రోజులపాటు జరిగే ఈ ఎల్లమ్మ జాతర మహోత్సవంలో భాగంగా ఎంతో మంది భక్తులు వస్తుంటారని అందుకు తగినట్లుగా ప్రభుత్వ ఏర్పాట్లు చేయాలని ఎండ తీవ్రత ఉన్నటువంటి పరిస్థితులలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు.రేణుక ఎల్లమ్మ తల్లి దీవెనలతో ఈ సంవత్సరం అందరు సుభక్షంగా ఉండి పాడి పంటలతో సమృద్ధిగా ఉండాలని కోరుకున్నట్లు బుర్ర శ్రీనివాస్ గౌడ్ తెలిపారు ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నేతలు పూదరి లక్ష్మీనారాయణ గౌడ్,పచ్చిమట్ల రవీందర్ గౌడ్,పూదరి వరప్రసాద్ గౌడ్,పచ్చిమట్ల శ్రీకాంత్ గౌడ్, పచ్చిమట్ల శ్రీనివాస్ గౌడ్, మాటూరి గోపి గౌడ్,నరేష్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ కార్యక్రమాలు సమర్థంగా నిర్వహించాలి

**ధాన్యం కొనుగోళ్లు వేగవంతం**
**నీట్ పరీక్ష, రైతు వారం ఏర్పాట్లపై దిశానిర్దేశం**
**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్, మే1 (నినాదం) :** కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా నియోజకవర్గ స్థాయి కార్యక్రమాలను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం జరిగే కార్యక్రమాలకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని సూచించారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన సమీక్షలో ధాన్యం కొనుగోళ్లు, నీట్ పరీక్ష ఏర్పాట్లు, రైతు వారం నిర్వహణపై జిల్లాస్థాయి అధికారులతో చర్చించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నీడ, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఇప్పటివరకు అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించి ప్రజలకు వివరించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా చేపట్టి మిల్లులకు తరలించాలని, రైతులకు చెల్లింపులు తక్షణమే అందేలా చూడాలని ఆదేశించారు. ఆదివారం జరిగే నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేసి, విద్యార్థులు సమయానికి కేంద్రాలకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మే 4 నుంచి ప్రారంభమయ్యే రైతు వారం కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలని, రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే డి శ్రీనివాస్ రెడ్డి ఆర్డీవోలు కే మహేశ్వర్ రమేష్ బాబు సిపిఓ రామ్ దత్తారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి డిఆర్ డి ఓ శ్రీధర్ డిపిఓ జగదీశ్వర్ జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అప్పులు తీర్చడమెలా..
# అన్న ఆలోచనేదీ?

**సంపాదకీయం**

అప్పులు తీర్చడమెలా..రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమెలా .. అన్న ఆలోచన ప్రభుత్వాలు చేయడం లేదు. కెసిఆర్ చేసిన అప్పుల గురించి ప్రశ్నించినప్పుడు ఆస్తులు సృష్టిస్తున్నామని అనేవారు. ఎపిలో చంద్రబాబుది కూడా అదే పాలసీ. కెసిఆర్ అప్పులు చేసి దివాళా తీసాడని ఆరోపించి, అధికారం చేపట్టిన రేవంత్ రెడ్డి అంతకు మించిన అప్పులు చేస్తున్నారు. చంద్రబాబు కూడా అదే కోవలో ఉన్నారు. జీతాలు, భత్యాలకు డబ్బులు లేవు. ఉచిత పథకాలకు మాత్రం చేతికి ఎముక లేదన్నంతగా దోచిపెడు తున్నారు. ఈ లెక్కన మరో వదందేళ్లయినా అప్పులు తేరవు. వీరు సృష్టించిన ఆస్తులు అప్పులు తీర్చలేవు. ఉన్న భూములను తెగనమ్మేస్తున్నారు. ప్రధానంగా ఖర్చులు తగ్గించుకుని అప్పులు లేకుండా చేసుకునే ప్రణాళికలు రచించాలి. అప్పులు తీర్చడం ప్రథమ కర్తవ్యం కావాలి. ఇందుకోసం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజలు అధికారం అప్పగించింది అప్పులు చేయడానికి కాదని గుర్తించాలి. పాలన పేరుతో రాష్ట్రాలను దివాళా తీయించే అధికారం రేవంత్‌కి, చంద్రబాబుకు లేదు. అలాగే దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్లే ప్రయత్నాలను మోడీ కూడా సమర్థించరాదు. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసాయరంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి నిచ్చెనగా మారగలదు. దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయరంగాన్ని ఆధునీకరించాలి. రైతులు పండించిన ధాన్యాన్ని సక్రమంగా కొనడం లేదు. దానిని ప్రజలకు చేరవేయడం లేదు. గతంలో లాగా చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి. ఉచిత పథకాలు రాష్ట్రాల, దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నా.. అధికారంలో ఉన్నవారు పట్టించుకోక పోవడం వల్లనే రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకు పోయాయి. నెలనెలా వడ్డీలకే వేలకోట్లు తగలేయడం వల్ల ఒక్క అభివృద్ధి పని జరగడం లేదు. రాష్ట్రాలు ఆర్థికంగా దివాళా తీస్తున్నా, జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నా కేంద్రం పట్టించుకోవడం లేదు. తెలంగాణలో ఇప్పుడు జీతాలు కూడా అప్పులు చేసి ఇవ్వాల్సి వస్తోంది. విపక్షంలో ఉన్నవారు మరిన్ని ఉచిత పథకాల గురించి డిమాండ్ చేస్తున్నారు. ఈ పథకాలు కొంప ముంచుతున్నా ,రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. అభివృద్ధిని పక్కనపెట్టి ఎన్నికల్లో ప్రయోజనం పొందడానికే ఉచితాల మీద ఉచితాలు ప్రకటిస్తున్నారు. వీటివలన పేదలకు చెప్పుకోదగిన శాశ్వత ప్రయోజనం దక్కడం లేదు. ప్రభుత్వాలు ఆర్థికంగా దివాలా తీస్తున్నాయి. ఖర్చులు తగ్గించుకోవడం కోసం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలకు ముందు పెన్షన్లు రద్దు చేయాలి. రాజకీయ ప్రాపకం కోసం అందరికీ కేబినేట్ హోదాతో సలహాదారులను నియించుకోవడం పక్కన పెట్టాలి. అలాగే వీరి జీతభత్యాలను కూడా కనీసానికి తగ్గించాలి. లక్షల కోట్లు అప్పులు తెచ్చి, వడ్డీలు కట్టలేక, ఉద్యోగుల జీతాలు కూడా భారమై ప్రభుత్వాలు నవ్వుల పాలవుతున్న వేళ, సలహాదారులకు లక్షల్లో జీతాలు తగలేయడం సరికాదు. ఇందుకోసం ఉన్న భూములను తెగనమ్మడం, లిక్కర్ ధరలు పెంచడం, భూముల రిజస్ట్రేషన్ ధరలు పెంచడం, పరోక్షంగా పన్నులు బాదడం వంటి చర్యలకు ఒడిగడుతున్నారు. ఉచిత రేషన్, ఉచిత గ్యాస్, ఉచిత ఇల్లు, ఉచిత బియ్యం, ఉచితంగా పెన్షన్ వంటివన్నీ ఖజానాను దివాళా తీయిస్తున్నాయి. ఇందులో అసలు లబ్దిదారుల కన్నా అనర్హులే ఎక్కువ మంది ఉన్నారు. సంక్షేమం అవసరమే కానీ మోతాదు మించకుండా చూసుకోవడం కూడా ముఖ్యమే. తాజాగా తెలంగాణలో మరో ఇద్దరు సలహాదారులను నియమించారు. ఇప్పటికే ఉన్నవారికి తోడు మరో ఇద్దరికి పునరావసం కల్పించాల్సిన అసవరం ఏమొచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నరేండ్లలో 14మంది సలహాదారులుగా నియమితులయ్యారంటే..వారు ఏంచేస్తారని జనం ప్రశ్నించాలి. వీరంతా క్యాబినెట్ హోదా ఉన్నవారే కావడంతో జీతాలు, భత్యాలు సరేసరి. ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రుల సంఖ్యకు దాదాపు సమానంగా సలహాదారులు ఉన్నారు. వీరంతా లక్షలకు లక్షల జీతాలు, భత్యాలూ అందుకుంటున్నారు. సలహాదారులు రాష్ట్ర ఖజానాకు తీవ్ర ఆర్థికనష్టం కలిగిస్తున్నారని ఎన్నికల ముందు చెప్పిన రేవంత్.. ఇప్పుడు మళ్లీ పలువురిని సలహాదారులుగా నియమించారు. అప్పులు తెచ్చి మరీ సలహాదారులకు జీతభత్యాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. అసలు ఇంతమంది సలహాదారులను ఎందుకు నియమిస్తున్నారు. వారు ఏం చేస్తున్నారనేది ఎవరికీ అంతుచిక్కడం లేదు. ఉద్యోగ విరమణ పొందిన అధికారులకు పోస్టులు సృష్టించిమరీ ఎందుకు నియమిస్తున్నారన్నది అర్థం కాదు. కెసిఆర్ చేసిన పనినే రేవంత్ కూడా చేస్తున్నారు. సూర్యదేవర ప్రసన్నకుమార్‌ను ఆగమేఘాల పై ఢిల్లీ నుంచి తీసుకొచ్చి బాధ్యతలు అప్పజెప్పారు. తాజాగా విహెచ్‌ను, రిటైర్డ్ డిజిపి శివప్రసాద్ రెడ్డిని సలహాదారులుగా నియమించారు. సలహాదారుల పోస్టులను కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ పునరావాసం కోసం వాడుకొంటు న్నది. సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. తర్వాత మూడు రోజులకే ఏడుగురు సలహాదారు లను తొలగించారు. 'రాష్ట్ర ఖజానాకు తీవ్ర ఆర్థిక నష్టం కలిగించడంలో సలహాదారుల పాత్ర ఉన్నదని ఆనాడు చెప్పారు. జనవరి 20న అంటే అధికారంలోకి వచ్చిన నెలన్నరకు సీఎం తనకు నమ్మకస్తుడైన వేం నరేందర్‌రెడ్డిని ప్రధాన సలహాదారుగా నియమించారు. క్యాబినెట్ హోదా కల్పించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు షబ్బీర్ అలీకి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఓబీసీ శాఖల ప్రధాన సలహాదారుగా, మరో సీనియర్ నేత హర్కర వేణుగోపాల్‌ను ప్రొటోకాల్, ప్రజాసంబంధాల సలహాదారుగా నియమించి క్యాబినెట్ హోదా ఇచ్చారు. పార్లమెంటు ఎన్నికల ముందు బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఏపీ జితేందర్‌రెడ్డిని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా, బీఆరఎస్ నుంచి వచ్చిన పోచారం శ్రీనివాసరెడ్డిని వ్యవసాయ శాఖ సలహాదారుగా, బీఆరఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన కేశవరావును పబ్లిక్ ఎఫైర్స్ సలహాదారుగా నియమించారు. మరో మాజీమంత్రి సుదర్శన్ రెడ్డిని కూడా సలహాదారుగా నియమించారు. వీరంతా ఏం సలహాలు ఇస్తారు. తెలంగాణ గట్టెక్కడానికి ఏం చేస్తారన్నది ప్రశ్న. ఖజానాకు గండిపడుతుంటే కొత్తగా ఖర్చులు చేయడం వల్ల ప్రజలపై భారం పడుతుంది. దీనిని లోచించాలి. ఇలాంటి వారిని ప్రజల నెత్తిన రుద్దడం సరికాదు. ఖర్చులు తగ్గించడానికి అవసరమైతే ఓ కన్సల్టెన్సీని నియమించడం మంచిదేమో.

# అరవై ఏళ్ల 'అనర్హత'..
## వ్యవస్థల నిర్లక్ష్యానికి బలి అవుతున్న అనుభవజ్ఞులు

భారతదేశం వంటి సువిశాల దేశంలో, అందునా గ్రామీణ నేపథ్యం అధికంగా ఉన్న సమాజంలో ఒక సామాన్యుడికి విశ్రాంతి అనేది కేవలం ఒక నిఘంటువులోని పదం మాత్రమే తప్ప వాస్తవ జీవితంలో ఎక్కడా కనిపించదు. జీవితాంతం కష్టపడి, కుటుంబం కోసం, సమాజం కోసం తన రక్తాన్ని చెమటగా మార్చిన ఒక రైతు లేదా అసంఘటిత రంగ కార్మికుడు, వయస్సు పండిన వేళ ప్రశాంతంగా గడుపుతాడని భావిస్తే అది కేవలం ఒక భ్రమ మాత్రమే అవుతుంది. దురదృష్టవశాత్తు మన పరిపాలనా వ్యవస్థలు, బీమా కంపెనీలు మరియు బ్యాంకింగ్ నిబంధనలు ఒక మనిషి సామర్థ్యాన్ని అతని పుట్టిన తేదీని బట్టి నిర్ణయిస్తున్నాయి. ముఖ్యంగా అరవై ఏళ్లు నిండిన వారు ఒక్కసారిగా ప్రభుత్వ పరంగా లభించే అనేక బీమా సౌకర్యాలు, ఆర్థిక వెసులుబాటులకు దూరం కావడం అనేది నేడు సామాజికంగా పెను సవాలుగా మారింది.

ఒక వ్యక్తికి అత్యంత ఆసరా, భద్రత, ఆర్థిక స్థిరత్వం అవసరమైన వయస్సులోనే, వ్యవస్థలు అతన్ని 'పథకాలకు అనర్హుడు'గా ముద్రవేసి పక్కన పెట్టడం ఎంతవరకు సమంజసం అన్నది నేడు ప్రతి పౌరుడిని వేధిస్తున్న ప్రశ్న. మన దేశంలో వృద్ధాప్యం అనేది ఒక గౌరవప్రదమైన దశగా ఉండాల్సింది పోయి, కేవలం ప్రభుత్వ రికార్డుల్లో నిలిచిపోయే ఒక కాలపరిమితిగా మారిపోవడం బాధాకరం. క్షేత్రస్థాయిలో పరిస్థితిని గమనిస్తే, అరవై ఏళ్లు నిండిన మరుసటి రోజే ఆ వ్యక్తి రక్షణ కవచం నుండి బయటకు నెట్టబడుతున్నాడు. ప్రమాదాలు సంభవించినప్పుడు లేదా ఆకస్మికంగా మరణించినప్పుడు ఆ వయస్సులో ఉన్న వారి కుటుంబాలకు జరిగే నష్టాన్ని పూడ్చేందుకు ఏ చట్టమూ ముందుకు రాకపోవడం గమనార్హం.

### సాంకేతిక నిబంధనల వెనుక మసక బారుతున్న మానవత్వం

ఈ వివక్షకు ప్రధాన కారణం ఇన్సూరెన్స్ కంపెనీలు మరియు ప్రభుత్వం మధ్య ఉండే సాంకేతిక ఒప్పందాలు. ఇన్సూరెన్స్ నిబంధనల ప్రకారం, 60 ఏళ్లు దాటిన వారిలో మరణాల రేటు ఎక్కువగా ఉంటుందని భావించే 'యాక్చువేరియల్' లెక్కలే ఈ అన్యాయానికి పునాది. 18 నుండి 59 ఏళ్ల వరకు తక్కువ ప్రీమియంతో బీమా కల్పించే కంపెనీలు, 60 దాటిన వారిని 'హై రిస్క్' కేటగిరీలో చూస్తాయి. ఈ వయస్సు వారిని కూడా పథకంలో చేర్చుకుంటే ప్రభుత్వం చెల్లించాల్సిన ప్రీమియం భారం అనేక రెట్లు పెరుగుతుందని, ఆ ఆర్థిక భారాన్ని మోయలేక పాలకులు కఠినమైన వయస్సు పరిమితులను విధిస్తున్నారు. రైతు బీమా వంటి పథకాలు ఆగిపోవడానికి ఇదే ప్రధాన కారణం.

నిజానికి, వయస్సు పెరిగే కొద్దీ ప్రమాదాలు లేదా ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువ కాబట్టి ఆ సమయంలోనే బీమా రక్షణ మరింత అవసరం. కానీ, వ్యవస్థలు మాత్రం లాభనష్టాల లెక్కలకే ప్రాధాన్యత ఇస్తూ మనిషి ప్రాణానికి ఉండే విలువను వయస్సుతో ముడిపెడుతున్నాయి. ఇన్సూరెన్స్ కంపెనీలు తమ లాభనష్టాల లెక్కల్లో భాగంగా, మరణాల రేటు ఎక్కువగా ఉండే వయస్సు విభాగాలను మినహాయించడం వ్యాపారరీత్యా వారికి లాభదాయకం కావచ్చు కానీ, ఒక సంక్షేమ రాజ్యంలో ప్రభుత్వం కూడా అదే వ్యాపార దృక్పథంతో ఆలోచించడం పౌరుల పట్ల చూపే చిన్నచూపుకు నిదర్శనం. దశాబ్దాల పాటు పన్నుల రూపంలోనో, శ్రమ రూపంలోనో దేశ నిర్మాణంలో భాగస్వామి అయిన వ్యక్తికి, అరవై ఏళ్లు రాగానే భద్రతను నిరాకరించడం సామాజిక వివక్షకు పరాకాష్ట.

### బ్యాంకింగ్ వైరుధ్యం.. పెట్టుబడికి ఓకే.. భరోసాకు నో!

వృద్ధుల పట్ల బ్యాంకింగ్ రంగం అనుసరిస్తున్న విధానం మరింత విస్మయానికి గురిచేస్తోంది. ఇక్కడ ఒక విచిత్రమైన పరిస్థితి ఉంది. ఒకవైపు 60 ఏళ్లు దాటిన వారికి కొత్త రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు సవాలక్ష నిబంధనలు విధిస్తాయి. "తిరిగి చెల్లించే సామర్థ్యం" లేదనే నెపంతో వారిని ఆర్థికంగా అంటరానివారిగా చూస్తాయి. కానీ, అదే బ్యాంకులు వృద్ధులు దాచుకున్న సొమ్మును మాత్రం ఆప్యాయంగా స్వీకరిస్తాయి. భారతదేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థలో ఉన్న మొత్తం ఫిక్స్‌డ్ డిపాజిట్లలో దాదాపు 30 నుండి 40 శాతం వరకు సీనియర్ సిటిజన్లవే ఉంటాయి. తమ జీవిత కాల కష్టార్జితాన్ని, పదవీ విరమణ ప్రయోజనాలను భద్రత కోసం బ్యాంకులకే అప్పగిస్తారు.

బ్యాంకులు ఈ భారీ మొత్తాలను తక్కువ వడ్డీకే సేకరించి, వాటిని పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలకు పెట్టుబడులుగా, రుణాలుగా ఇచ్చి వేల కోట్ల రూపాయల లాభాలు గడిస్తున్నాయి. అంటే, వృద్ధుల సొమ్ము బ్యాంకులకు ఆర్థిక ఇంధనంలా పనిచేస్తోంది. వారి సొమ్ముతో లాభాలు పండిస్తున్న బ్యాంకులు, తిరిగి వారికే సేవలు అందించేటప్పుడు మాత్రం ముఖం చాటేస్తున్నాయి. వృద్ధులకు అత్యవసరంగా ఏదైనా రుణం కావాలన్నా, ఆరోగ్య సమస్యల కోసం ఆర్థిక సాయం కోరినా ఇన్సూరెన్స్ లేదనో, వయస్సు దాటిందనో సాకులు చెబుతున్నాయి. తమ సొమ్మును వాడుకుంటూ తమకే భద్రత కల్పించని ఈ వ్యవస్థలో వృద్ధులు తమ సొమ్మును ఉంచడం ఎంతవరకు ఉత్తమం అనే సందేహం కలగడం సహజం.

### చట్టపరమైన పరిహారాల్లో కొనసాగుతున్న అన్యాయం

చట్టపరమైన పరిహారాల విషయంలో కూడా 60 ఏళ్లు దాటిన వారికి అన్యాయం జరుగుతోంది. ప్రమాద బాధితులకు నష్టపరిహారాన్ని లెక్కించేటప్పుడు ఉపయోగించే 'మల్టిప్లైయర్' విధానం వయస్సు పెరిగిన కొద్దీ పరిహార మొత్తాన్ని తగ్గిస్తుంది. దీని వెనుక ఉన్న క్రూరమైన తర్కం ఏమిటంటే, ఆ వ్యక్తిపై ఆధారపడే వారి సంఖ్య తగ్గిందని భావించడం. కానీ వాస్తవంగా నేటి ఆర్థిక పరిస్థితుల్లో వృద్ధులు కూడా కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ ఉన్నప్పటికీ, అసంఘటిత రంగంలోని కోట్లాది మందికి ఆ వెసులుబాటు లేదు. వారికి ఇచ్చే కొద్దిపాటి 'ఆసరా' పింఛన్లు ఆకలి తీర్చడానికే సరిపోతాయి తప్ప, అనారోగ్యం వంటి ఆపదలను తట్టుకోవడానికి ఏమాత్రం సరిపోవు. రాజకీయాల్లో వయస్సుతో నిమిత్తం లేకుండా పదవులు అనుభవిస్తున్న నాయకులు, సాధారణ పౌరుడి వద్దకు వచ్చేసరికి మాత్రం వయస్సు నిబంధనలు గుర్తుకు రావడం విడ్డూరం.

### వృద్ధులు 'మార్గదర్శకులు' కావాలి.. భారం కాదు

అరవై ఏళ్లు నిండిన వారు ఈ వ్యవస్థకు అవసరమా లేదా అన్నది ఒక పెద్ద చిక్కుముడిలా మిగిలిపోతోంది. ఒకవైపు అనుభవం పండిన వృద్ధులను 'మార్గదర్శకులు' అని గౌరవిస్తాం, మరోవైపు అదే వ్యక్తులను ప్రభుత్వ పథకాల నుండి 'అనర్హులు' అని తొలగిస్తాం. అంటే ఇక్కడ వయస్సు అనేది గౌరవానికి చిహ్నమా లేక పథకాలకు అనర్హతకు ప్రమాణమా అన్నది అర్థం కాని పరిస్థితి. ఒక మనిషి జీవించి ఉన్నప్పుడు భరోసా ఇవ్వని నిబంధనలు, ఆ మనిషికి వయస్సు అయిపోయిందని చెప్పి ఆదుకోకపోవడం సామాజిక న్యాయం అనిపించుకుంటుందా?

రైతుకు భూమిపై ఉన్న హక్కుకు వయస్సుతో సంబంధం లేనప్పుడు, ఆ భూమిని కాపాడే రైతుకు ఇచ్చే బీమాకు మాత్రం వయస్సుతో నిబంధనలు ఎందుకు ఉండాలి? నిబంధనలు మనుషుల కోసం పుట్టాయా లేక మనుషులనే నిబంధనల కోసం బలి ఇస్తున్నారా అన్నది పాలకులకే ఎరుక. అరవై ఏళ్లు నిండిన వారు సామాజికంగా ఒక ఆస్తిగా మారాల్సిన చోట, కేవలం సాంకేతిక కారణాల వల్ల ఒక సమస్యగా మిగిలిపోవడం ఈ వ్యవస్థల వైఫల్యమే తప్ప వ్యక్తి లోపం కాదు.

ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్ళు తెరవాలి. వయస్సు నిబంధనలను సడలించి, వృద్ధులకు ఇచ్చే గౌరవం కేవలం మాటల్లో కాకుండా చేతల్లో చూపాలి. ముఖ్యంగా బ్యాంకింగ్ రంగంలో వృద్ధుల డిపాజిట్లపై ప్రత్యేక రక్షణ, వారికి సులభంగా రుణాలు అందేలా నిబంధనల మార్పు తక్షణ అవసరం. దశాబ్దాల అనుభవం ఉన్న మేధస్సును, సమాజ నిర్మాణం కోసం అలిసిన దేహాలను గౌరవించని ఏ నాగరిక సమాజం కూడా అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లలేదు. పండిన అనుభవానికి భద్రత లేని చోట వ్యవస్థల మనుగడ ఎప్పుడూ ప్రశ్నార్థకమే.

**వెంక గారి భూమయ్య,**
**సీనియర్ జర్నలిస్ట్ 9848559863**

# భగ్గుమన్న కమర్షియల్ సిలిండర్
### 19 కిలోల సిలిండర్‌పై రూ.993 పెంపు
### హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై తీవ్ర భారం

న్యూఢిల్లీ :
పశ్చిమాసియా ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిణామాల ప్రభావం భారత్‌పై స్పష్టంగా కనిపిస్తోంది. ఇందనం సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. చమురు నౌకలను దిగ్బందించారు. ఈ క్రమంలో కొరత అనివార్యంగా మారింది. ఈ క్రమంలో ముఖ్యంగా వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించే 19 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెరిగింది. దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు వంటి వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా రూ.993 పెంచింది. ఈ పెంపుతో హైదరాబాద్‌లో కమర్షియల్ సిలిండర్ రేటు రూ.3,315కు చేరింది. ఢిల్లీలో 19 కిలోల సిలిండర్ ధర రూ.3,071కి చేరుకుంది. ఢిల్లీలో వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర గతంలో రూ. 2,078.50 ఉండేది. అదేవిధంగా, ముంబైలో వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.2,031 నుంచి రూ. 3,024కు పెరిగింది. ఇక 5 కిలోల సిలిండర్ ధర రూ.914.50కి పెరిగింది. ముఖ్యంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ప్రారంభమైన ఫిబ్రవరి 28 నుంచి 19 కేజీల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరలను మూడుసార్లు పెంచింది కేంద్రం. మొదట మార్చిలో రూ.144 పెరగగా, ఏప్రిల్ 1న దాదాపు రూ.200 మేర పెరిగింది.

# మైదానం నుంచి పోలీసింగ్ వరకు..
### పాఠశాల నుంచి పీహెచ్‌డీ దాకా: ఒకే జంట - రెండు భిన్న విజయ తీరాలు
**ఆశయాల వారధి.. ఆదర్శాల సారధి: సి.వి. ఆనంద్ - లలిత ఆనంద్ జంట యువతకు స్ఫూర్తి**

హైదరాబాద్ మహానగరం భారతదేశానికి ఎన్నో ప్రతిభావంతులను అందించిన సృజనాత్మక నేల. పరిపాలన, విజ్ఞానం, క్రీడలు, కళలు, సాహిత్యం, సాంకేతికత వంటి అనేక రంగాల్లో ఈ నగరం నుంచి వెలుగులోకి వచ్చిన వ్యక్తులు దేశవ్యాప్తంగా తమ ముద్ర వేశారు. అలాంటి అరుదైన స్ఫూర్తిదాయక దంపతులలో సి.వి. ఆనంద్ – లలిత ఆనంద్ జంట ప్రత్యేక స్థానం సంపాదించింది. ఒకవైపు క్రమశిక్షణ, ప్రజాసేవ, ఆధునిక పరిపాలనతో భారత పోలీసు సేవలో ప్రత్యేక గుర్తింపు పొందిన సి.వి. ఆనంద్ ఉంటే, మరోవైపు విద్య, పరిశోధన, కళా సాధన, ఆరోగ్య చైతన్య రంగాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన లలిత ఆనంద్ ఉన్నారు. ఈ ఇద్దరి జీవన ప్రయాణం ఆధునిక భారతీయ కుటుంబ వ్యవస్థకు ఆదర్శంగా నిలుస్తోంది. విజయాన్ని కేవలం పదవులు, సంపదలతో కాకుండా వ్యక్తిత్వ వికాసం, కుటుంబ విలువలు, సమాజానికి అందించిన స్ఫూర్తితో కొలవాలని ఈ దంపతుల జీవితం తెలియ జేస్తోంది.





సి.వి. ఆనంద్ పూర్తి పేరు చామ వెంకట ఆనంద్. తెలంగాణ మట్టిలో జన్మించి పెరిగిన ఆయన చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, కృషి, క్రీడాస్ఫూర్తి, విద్యాపట్ల ఆసక్తితో ఎదిగారు. రంగారెడ్డి జిల్లా ప్రాంతానికి చెందిన ఆయన కుటుంబం తర్వాత హైదరాబాద్‌లో స్థిరపడింది. అప్పటి హైదరాబాద్ నగరం విద్యా, సాంస్కృతిక, క్రీడా రంగాలకు కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న దశలో ఉండటం ఆయన ఎదుగుదలకు దోహద పడింది. బేగంపేటలోని ప్రసిద్ధ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఆయన విద్యాభ్యాసం సాగింది. ఈ విద్యాసంస్థ దేశానికి అనేక మంది పరిపాలనా అధికారులు, వ్యాపారవేత్తలు, క్రీడాకారులు, ప్రజాప్రతినిధులను అందించింది. అలాంటి ప్రేరణాత్మక వాతావరణంలో పెరిగిన ఆనంద్ చదువుతో పాటు క్రీడల్లోనూ సమాన ప్రతిభను కనబరిచారు.

క్రికెట్ ఆయన జీవితంలో అత్యంత కీలకమైన అధ్యాయం. విద్యార్థి దశలోనే హైదరాబాద్ క్రికెట్ వర్గాల్లో ఆయన పేరు మారుమోగేది. నిజాం కాలేజీలో డిగ్రీ చదువుతున్న సమయంలో హైదరాబాద్ జట్టుకు ప్రాతినిధ్యం వహించి ప్రతిభ చాటారు. బ్యాటింగ్‌లో స్థిరత్వం, ఫీల్డింగ్‌లో చురుకుదనం ఆయన ప్రత్యేకత. దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన యువ క్రీడాకారుల మధ్య భారత అండర్–19 జట్టులో చోటు సంపాదించడం ఆ కాలంలో గొప్ప ఘనతగా పరిగణించ బడింది. ఇంగ్లాండ్ పర్యటనకు ఎంపిక కావడం ఆయన క్రీడా ప్రతిభకు నిదర్శనం. అయితే అదే సమయంలో ఆయన జీవితంలో ఒక కీలక మలుపు వచ్చింది. క్రికెట్‌ను వృత్తిగా కొనసాగించాలా? లేక ఉన్నత విద్యతో పాటు పరిపాలనా రంగంలోకి అడుగు పెట్టాలా? అనే సందిగ్ధ పరిస్థితి ఎదురైంది.

చివరకు ఆయన విద్య, ప్రజాసేవ వైపు అడుగులు వేశారు. ఈ నిర్ణయం తర్వాత ఆయన జీవితాన్ని పూర్తిగా మార్చేసింది.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. ఎకనామిక్స్‌లో బంగారు పతకం సాధించడం ఆయన మేధస్సుకు ప్రతీక. ఆర్థిక శాస్త్రంపై ఆయనకు ఉన్న అవగాహన తర్వాత పరిపాలనా వ్యవస్థలోనూ ఎంతో ఉపయోగపడింది. లక్షలాది మంది అభ్యర్థులు పోటీ పడే యూపీఎస్సీ పరీక్షలో తొలి ప్రయత్నంలోనే 147వ ర్యాంకు సాధించి భారత పోలీసు సేవకు ఎంపిక కావడం అసాధారణ ఘనత. అతి చిన్న వయసులోనే ఐపీఎస్‌గా ఎంపిక కావడం ఆయన ప్రతిభను స్పష్టం చేసింది. ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ క్యాడర్ లభించడం ఆయనకు ప్రజలతో ప్రత్యక్ష అనుబంధం కలిగిన సేవా అవకాశాలను తెచ్చిపెట్టింది.

పోలీసు సేవలో సి.వి. ఆనంద్ సాంకేతికత ఆధారిత ఆధునిక పోలీసింగ్‌కు కొత్త రూపు తీసుకొచ్చిన అధికారిగా గుర్తింపు పొందారు. ట్రాఫిక్ నియంత్రణలో డిజిటల్ పద్ధతుల వినియోగం, సీసీటీవీ వ్యవస్థల విస్తరణ, సైబర్ నేరాల నియంత్రణ, ప్రజలకు చేరువయ్యే పోలీసింగ్ విధానాలు వంటి అనేక సంస్కరణలకు ఆయన కృషి చేశారు. హైదరాబాద్ నగరాన్ని స్మార్ట్ పోలీసింగ్ దిశగా మలచడంలో ఆయన పాత్ర ప్రముఖమైనది. సామాజిక మాధ్యమాలను ప్రజల సమస్యల పరిష్కార వేదికగా ఉపయోగించడం ద్వారా ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెంచే ప్రయత్నం చేశారు. సేవలో కఠినత్వంతో పాటు మానవీయ దృక్పథం కలిగిన అధికారిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది.

ఇలాంటి వ్యక్తిత్వానికి సరితూగే జీవిత భాగస్వామిగా లలిత ఆనంద్ నిలిచారు. ఆమె జీవితం పట్టుదల, త్యాగం, పునరాగమనానికి ప్రతీకగా నిలుస్తుంది. సాధారణంగా కుటుంబ బాధ్యతలు, పిల్లల పెంపకం కారణంగా మహిళల వ్యక్తిగత ఆశయాలు మధ్యలోనే ఆగిపోతాయి. కానీ లలిత ఆనంద్ తన కలలను వదిలి పెట్టలేదు. కుటుంబ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ సరైన సమయంలో తిరిగి విద్యా రంగంలో ప్రవేశించారు. నలభై ఏళ్ల వయసులో ఐఐటీ మద్రాస్‌లో పీహెచ్‌డీ పూర్తి చేయడం ఆమె అసాధారణ మేధస్సుకు నిదర్శనం. మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్, కార్పొరేట్ ఫైనాన్స్ రంగాల్లో ఆమె చేసిన పరిశోధనలు విద్యా రంగంలో గుర్తింపు పొందాయి. భారతదేశంలోని ప్రముఖ మేనేజ్‌మెంట్ విద్యాసంస్థలలో ఒకటైన ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో పరిశోధకురాలిగా, అనంతరం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసి అనేక మంది విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించారు.

లలిత ఆనంద్ వ్యక్తిత్వంలో మరో విశిష్ట కోణం కళాసాధన. చిన్నప్పటి నుంచే శాస్త్రీయ నృత్యంపై ఆసక్తి ఉన్నప్పటికీ కుటుంబ బాధ్యతల కారణంగా కొంతకాలం ఆ అభిరుచిని పక్కన పెట్టాల్సి వచ్చింది. అయితే ఆమె కళాప్రేమను పూర్తిగా వదల్లేదు. యాభై ఏళ్ల వయసులో తిరిగి భరతనాట్య సాధన ప్రారంభించి, 57 ఏళ్ల వయసులో అరంగేట్రం చేయడం అనేక మందిని ఆశ్చర్యానికి గురి చేసింది. సాధారణంగా బాల్యంలో పూర్తిచేసే ఈ కళాసాధనను జీవితంలో తరువాతి దశలో సాధించడం ద్వారా వయసు విజయానికి అడ్డంకి కాదని ఆమె నిరూపించారు.

యువతకు, ఉద్యోగస్తులకు, మహిళలకు, మధ్యవయసులో కొత్త ఆశయాలతో ముందుకు సాగాలనుకునేవారికి, కుటుంబ బాధ్యతలతో తమ కలలను అణిచి వేసుకున్న వారికి ఈ జంట జీవితం ఒక వెలుగుదీపం. పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధన ఉంటే ఏ రంగంలోనైనా విజయాన్ని సాధించవచ్చని వారి ప్రయాణం చెబుతోంది. హైదరాబాద్ నగరానికే కాదు, తెలంగాణ సమాజానికే ఈ దంపతులు

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# రాష్ట్రాలభివృద్ధి లక్ష్యంగా కష్టపడుతున్నా

**ప్రజల సంతోషం చూసి కష్టాలు మరచి పోతున్నా**
**ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏపీకి పూర్వ వైభవం**
**లేబర్ అడ్డాలను స్కిల్ సెంటర్లుగా అభివృద్ధికి నిర్ణయం**
**గోదావరి పుష్కరాల్లోపే పోలవరం పూర్తి చేస్తాం**
**విద్యుత్ చార్జీలు పెంచలేదు..ఇకముందు పెంచబోం**
**కృష్ణా జిల్లా పమిడిముక్కలలో 'పేదల సేవ'లో సిఎం బాబు**

విజయవాడ :
రాష్ట్రాభివృద్ధి కోసం రాత్రిపగలు కష్టపడుతున్నామని, పేదల రుణం తీర్చుకునేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రజల సంతోషాన్ని చూసి.. కష్టాన్ని మరిచిపోతున్నట్లు చెప్పారు. కృష్ణా జిల్లా పమిడిముక్కలలో నిర్వహించిన 'పేదల సేవ' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని, ఏపీకి పూర్వవైభవం తీసుకొస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పింఛన్ల కోసం ఏటా రూ.33 వేల కోట్లు ఖర్చు పెడుతున్నాం. పింఛన్ల పంపిణీని భారంగా భావించట్లేదు.. బాధ్యతగా భావిస్తున్నామని చంద్రబాబు అన్నారు. దేశంలో ఏ రాష్ట్రం ఇంత పెద్ద మొత్తంలో పింఛన్లు ఇవ్వట్లేదు. కార్మికుల కోసం లేబర్ అడ్డా నిర్మాణాలు చేపడుతున్నాం. లేబర్ అడ్డాలు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా మారాలి. పని ఉంటే పనికెళ్తారు.. లేని రోజు లేబర్ అడ్డాల్లో నైపుణ్యం పెంచుకుంటారు. తొలి దశలో లేబర్ అడ్డాలు విజయవంతమైతే.. మిగిలిన ప్రాంతాలకు విస్తరిస్తాం అని చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్ల పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ప్రస్తుతం మళ్లీ వెయ్యి కోట్లతో పోలవరం డయాఫ్రమ్ వాల్ నిర్మిస్తున్నాం. 2027లో గోదావరి పుష్కరాల్లోపు పోలవరం పూర్తి చేస్తాం. ఆ తర్వాత కృష్ణా నదికి అనుసంధానిస్తాం. డిసెంబర్ నాటికి బందర్‌పోర్టు నిర్మాణం పూర్తి చేస్తాం. హైదరాబాద్` మచిలీపట్నం హైవే ఎక్స్‌ప్రెస్ రోడ్డుగా అభివృద్ధి చెందుతోంది. విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతోంది. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. ఇప్పటి వరకు పెంచలేదు. ఎన్నికలయ్యే వరకు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇస్తున్నానని పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వం విధించిన ట్రూఅప్ ఛార్జీలను ట్రూడౌన్ చేశాం. గత ప్రభుత్వం 9సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిందని విమర్శించారు. ఇకపై ప్రతి సమావేశంలోనూ ఎమ్మెల్యే పనితీరు గురించి ప్రజలనే అడుగుతా. ఎమ్మెల్యే పనితీరు సరిగా లేకుంటే.. వారికి ఇంకొక ఛాన్స్ ఉండదు. అచ్యుతాపురం, గుంటూరు, కర్నూలులో ఈఎసఐ ఆస్పత్రులు తీసుకొస్తాం. శ్రీసిటీ, తిరుపతి, అమరావతిలో ఈఎసఐ ఆస్పత్రులు తీసుకొస్తాం. అందరూ ఆరోగ్యంగా ఉండాలనేదే మా లక్ష్యం. నేర ప్రవృత్తి వ్యక్తులు రాజకీయాలకు పనికిరారు. వైకాపా అధినేతకు మానసిక సమస్య ఉంది. ఒకసారి అవకాశమిస్తే అందర్నీ మోసం, నాశనం చేశారు. ప్రజావేదికను నిర్మిస్తే.. రెండు గంటల్లో కూల్చేశారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టును నాశనం చేశారు. అమరావతిని శ్మశానం అని ప్రచారం చేశారు. పోలవరం పూర్తయి ఉంటే.. రైతులు బంగారం పండించే వారు. నీటి ఎద్దడి ఉండేది కాదు. గొడ్డలి పార్టీకి మద్దతిచ్చేవారు ఒకసారి ఆలోచించుకోండి. బాబాయిని హత్య చేసి గుండెపోటు అన్నారు. మరుసటి రోజు నా చేతిలో కత్తి పెట్టి.. నారాసుర రక్త చరిత్ర అని 'సాక్షి'లో రాశారు. విపక్షంలో ఉండేది వైకాపా కాదు.. గొడ్డలి పార్టీ అని చంద్రబాబు అన్నారు. ఈమేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పార్టీ కాదని.. కోడికత్తి, గొడ్డలి పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. జగన్‌కు మానసిక సమస్య ఉందని సెటైర్లు గుప్పించారు. ప్రజలు అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని నాశనం చేశారని.. అలా చేయడమే ఆయనకు అలవాటుగా మారిందని విమర్శించారు. ఆయన మానసిక పరిస్థితి అందరినీ మోసం చేయడమేనని.. ఆ తర్వాత మాట మార్చడమే పనిగా పెట్టుకున్నారని ఆక్షేపించారు. 2019లో అధికారంలోకి వచ్చిన తొలి సమావేశంలోనే ప్రజావేదికను కూల్చేశారని ధ్వజమెత్తారు. రెండేళ్లు కష్టపడి కడితే.. రెండు గంటల్లోనే దానిని కూల్చేశారని మండిపడ్డారు. అమరావతి రాజధాని కావడంతో స్థానిక రైతుల దశా దిశ మారిపోయిందని చెప్పుకొచ్చారు. విశాఖపట్నం తర్వాత అభివృద్ధి, ఆదాయంలో ముందుండేది కృష్ణా జిల్లా అని పేర్కొన్నారు. కార్మికుల కోసం అత్యాధునిక పనిముట్లతో తొలి దశలో 15 నగరాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను నిర్మిస్తామని ఉద్ఘాటించారు. తొలి దశలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు విజయవంతమైతే.. మిగిలిన ప్రాంతాలకు విస్తరిస్తామని చెప్పుకొచ్చారు. తానూ రైతు కుటుంబం నుంచే వచ్చానని.. వారి కష్టం తనకు తెలుసునని ప్రస్తావించారు. జగన్ హయాంలో ప్రజలు, నేతలు బయట తిరిగే పరిస్థితి లేదని పేర్కొన్నారు.ఏపీలో ప్రజలందరికీ మరో స్వాతంత్ర్యాన్ని తీసుకొచ్చిన ఘనత ఎన్డీఏదేనని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రతి సమావేశంలో ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజలనే అడుగుతానని అన్నారు. ఎమ్మెల్యేల పనితీరు సరిగా లేకుంటే.. వారికి మరోసారి సీటు ఇచ్చే ఛాన్స్ ఉండదని స్పష్టం చేశారు. పోలవరం కోసం కష్టపడి తాము 70 శాతానికి పైగా పనులు పూర్తి చేశామని.. అలాంటి ప్రాజెక్టును నాశనం చేసి.. జగన్ హయాంలో ఆ పనులు నిలిపివేశారని సీఎం చంద్రబాబు దుయ్యబట్టారు. అమరావతి ప్రజా రాజధాని.. మన మైథాలజీలో దేవతల రాజధాని అని అభివర్ణించారు. అలాంటి అమరావతిని ఎడారి అని, శ్మశానమని మొత్తం నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్మాణం చేస్తుంటే.. వారు విధ్వంసం చేశారని ఫైర్ అయ్యారు. మళ్లీ అలాంటి విధ్వంసకర పాలన అధికారంలోకి రాకూడదని ప్రజలు గుర్తించాలని అన్నారు. నరకాసుడి వధ కారణంగా మనం దీపావళి చేసుకుంటున్నామని.. దుర్మార్గుడు చనిపోయారని.. సమాజం బాగుపడింది.. అంటే అలాంటి వారిని మళ్లీ సమర్థించకూడదని అర్థమని అన్నారు. ప్రతి ఒక్కరూ మీ గుండె మీద చేయి వేసుకుని ఆలోచన చేయాలని కోరారు. 2019లో జగన్ మోసాలు తెలుసుకోకుండా.. ఓట్లు వేసి 151 సీట్లు ఆయనకు ఇచ్చి గెలిపించారని సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. జగన్ హయాంలోని ఐదేళ్లు విధ్వంసకర పాలన చేశారని ఆగ్రహించారు. తాను, మోదీ, పవన్ కల్యాణ్ కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తే 94శాతం సీట్లతో గెలిపించారని తెలిపారు. తాను అభివృద్ధి చేయడం.. ఆ తర్వాత ఎవరో వచ్చి నాశనం చేయడం ఇలా అవసరమా అని ప్రశ్నించారు. ప్రజలంతా ఆలోచన చేసి.. మరోసారి ఎన్డీఏకు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.. సుపరిపాలన ఇచ్చే బాధ్యత తమదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సమావేశంలో మంత్రి వాసంశెట్ట ఇసుభాష్ తదితరులు పాల్గొన్నారు.



# హైటెక్ సిటీలో 'డాండీ అండ్ డాండీ'





**హైదరాబాద్ బ్యూరో,(నినాదం):** నినాదంనగరంలో కొత్తగా హైటెక్ సిటీలో ప్రారంభమైన 'డాండీ అండ్ డాండీ' డైనింగ్ నైట్ లైఫ్ అనుభవాలను ఒకే వేదికపై సమన్వయం చేస్తూ ప్రత్యేకతను చాటుతోంది. పగటిపూట ప్రశాంత భోజనాలు, సంభాషణలకు అనువుగా ఉండే ఈ ప్రదేశం, సాయంత్రం నుంచి ఉత్సాహభరితమైన బార్ వాతావరణంగా మారుతుంది. అంతర్జాతీయ శైలిలో రూపొందించిన మెనూ, సమయానుసారంగా మారే కాక్టెయిల్స్, సంగీతం ఈ ప్రదేశానికి ప్రధాన ఆకర్షణ లుగా నిలువనుంది . ఆధునిక జీవనశైలిని దృష్టిలో ఉంచుకుని, పని నుంచి వినోదానికి సహజ మార్పు కలిగించేలా ఈ కాన్సెప్ట్ రూపొందించామని నిర్వాహకులు కౌశిక్



తెలిపారు. డైనింగ్, నైట్ లైఫ్ మధ్య ఉన్న గీతలను చెరిపేస్తూ, 'డాండీ డ డాండీ' హైదరాబాద్‌లో కొత్త అనుభవాన్ని అందించనుంది అని అయన అన్నారు.

# బుద్ధవనంలో ఆధ్యాత్మిక సౌరభం

## బౌద్ధ వారసత్వానికి పూర్వవైభవం తెస్తాం: రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు

**నల్లగొండ ప్రతినిధి మే 1( నినాదం)**
ప్రపంచ ప్రఖ్యాత బౌద్ధ వారసత్వ క్షేత్రం నాగార్జున సాగర్‌లోని 'బుద్ధవనం' ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. బుద్ధ పూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం ఇక్కడ నిర్వహించిన ప్రత్యేక వేడుకల్లో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బుద్ధ వనం చేరుకున్న వీరు ముందుగా బుద్ధ చరిత వనంలోని బుద్ధుడి పాదాల వద్ద ప్రార్థనలు చేశారు. అనంతరం వందన సమర్పణతో పుష్పాంజలి ఘటించారు. మహస్తూపం అంతర్భాగంలోని ధ్యాన మందిరంలో బౌద్ధ సంప్రదాయబద్ధంగా ప్రార్థనలు నిర్వహించి ధ్యానం చేశారు. బుద్ధవనం విశేషాలను తెలియజేశారు. శాంతి మార్గమే ప్రపంచానికి శరణ్యం: మంత్రి జూపల్లి ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. గౌతమ బుద్ధుని బోధనలు ఎప్పటికీ ఆచరణీయమని కొనియాడారు. ప్రపంచానికి శాంతి, అహింసల మార్గాన్ని చూపిన మహనీయుడు బుద్ధుడు. ద్వేషం ఉన్న చోట ప్రేమను, అశాంతి ఉన్న






చోట ప్రశాంతతను నెలకొల్పడమే బౌద్ధ ధర్మం యొక్క ప్రధాన ఉద్దేశ్యం అని చెప్పారు. తెలంగాణ గడ్డపై బౌద్ధ వారసత్వ సంపద పుష్కలంగా ఉందని, నాగార్జున సాగర్‌లోని బుద్ధవనాన్ని అంతర్జాతీయ స్థాయి బౌద్ధ పర్యాటక కేంద్రంగా మరింత తీర్చిదిద్దుతామని, ఇక్కడికి వచ్చే పర్యాటకుల కోసం మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే కాకుండా, బుద్ధుని జీవిత విశేషాలను భావితరాలకు తెలియజేసేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తాం అని మంత్రి స్పష్టం చేశారు.బౌద్ధమత ప్రాశస్త్యాన్ని చాటిచెప్పేలా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రాంగణమంతా దీపాలతో అలంకరించడంతో బుద్ధవనం దేదీప్యమానంగా వెలిగిపోయింది.ఈ వేడుకల్లో నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ (౦+ఉజ) చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్, టీజీటీడీసీ ఎండీ గౌతమి, డైరెక్టర్ ఆఫ్ టూరిజం లక్ష్మణ్ రంజిత్ నాయక్, బుద్ధవనం స్పెషల్ ఆఫీసర్ మల్లెపల్లి లక్ష్మయ్య, ఇతర అధికారులు, బౌద్ధ భిక్షువులు పాల్గొన్నారు.

# నేరెడు పండ్లు తింటున్నారా?



**సర్జరీ చేయించుకున్నారా?:**

నేరేడు పండుకు రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను చాలా వేగంగా తగ్గించే శక్తి ఉంది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఇది వరమే అయినా, సర్జరీకి సిద్ధమవుతున్న వారికి లేదా సర్జరీ పూర్తి చేసుకున్న వారికి ఇది శాపంగా మారవచ్చు. ఆపరేషన్ సమయంలో ఆ తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉండటం చాలా ముఖ్యం. నేరేడు పండు తింటే చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పడిపోయి, రోగి కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది. అందుకే సర్జరీకి కనీసం రెండు వారాల ముందు నుంచి వీటికి దూరంగా ఉండాలి.

దీనివల్ల ఆస్తమా రోగులకు ఊపిరి అందక ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. అంతేకాకుండా నేరేడు పండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది కాబట్టి కిడ్నీలు సరిగ్గా పనిచేయని వారు వీటిని తింటే, ఆ పొటాషియం రక్తంలో పేరుకుపోయి గుండెపోటు వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది.

**నేరేడు పండును సురక్షితంగా ఎలా తినాలి?:**

నేరేడు పండ్లను కొద్దిగా ఉప్పు లేదా వాము పొడితో కలిపి తింటే వాయు సమస్యలు రావు. భోజనం చేసిన గంట తర్వాత వీటిని తినడం ఉత్తమమైన పద్ధతి. మధుమేహ వ్యాధిగ్రస్తులు పండు కంటే, దీని గింజలను ఎండబెట్టి చేసిన పొడిని వాడటం వల్ల షుగర్ లెవల్స్ అద్భుతంగా నియంత్రణలో ఉంటాయి. "అతి సర్వత్ర వర్జయేత్" అన్నట్లుగా.. నేరేడు పండు ఎంత మేలు చేసినా, పరిమితి దాటితే ప్రమాదకరమే.

**గర్భధారణ సమయంలో ఆచితూచి..**

గర్భిణీలు నేరేడు పండ్లను తినే విషయంలో వైద్యుల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. నేరేడు పండులో ఉండే ఆక్సలేట్లు కాల్షియం గ్రహించకుండా అడ్డుకోవచ్చు. ఆయుర్వేదం ప్రకారం నేరేడు పండ్లు శరీరంలో వేడిని కలిగిస్తాయి. గర్భధారణ సమయంలో అధిక వేడి శిశువుపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. కాబట్టి, గర్భిణీలు రోజుకు 2–3 పండ్ల కంటే ఎక్కువ తీసుకోకూడదు, అది కూడా డాక్టర్ సలహా మేరకే.



**ఖాళీ కడుపుతో తింటే గ్యాస్ట్రిక్ టామ్:**

నేరేడు పండు రుచికి పులుపు, వగరుగా ఉండటానికి కారణం అందులోని ఆమ్ల గుణాలు. ఉదయాన్నే ఏమీ తినకుండా నేరేడు పండ్లు తీసుకుంటే కడుపులో తీవ్రమైన మంట, అజీర్ణం కలుగుతాయి. నేరేడు పండ్లు తిన్న వెంటనే పొరపాటున కూడా పాలు తాగకూడదు. పాలు, నేరేడు పండులోని రసాయనాలు కలిస్తే అది విషతుల్యంగా మారి వాంతులు, విరేచనాలకు దారితీస్తుంది.

**శ్వాసకోశ సమస్యలు:**

మీరు తరచూ జలుబు, దగ్గు లేదా ఆస్తమాతో బాధపడుతున్నారా? అయితే నేరేడు పండుకు దూరంగా ఉండండి. నేరేడు పండుకు శరీరాన్ని అతిగా చల్లబరిచే గుణం ఉంటుంది. ఇది ఊపిరితిత్తుల్లో కఫం పేరుకుపోయేలా చేస్తుంది.






# ఏప్రిల్‌లో జీఎస్టీ వసూళ్లు రూ.2.43 లక్షల కోట్లు

దేశంలో స్థూల వస్తు, సేవల పన్ను వసూళ్లు (GST Collections) రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. ఏప్రిల్ నెలకు గానూ 8.7 శాతం వృద్ధితో రూ.2.43 లక్షల కోట్ల మేర వసూళ్లు అయ్యాయి. దేశీయంగా విక్రయాలు పెరగడం, దిగుమతుల కారణంగా పన్ను వసూళ్లు ఈ స్థాయిలో పెరిగినట్లు ప్రభుత్వ గణాంకాలను బట్టి తెలుస్తోంది. 2025 ఏప్రిల్‌లో రూ.2.37 లక్షల కోట్లు వసూలయ్యాయి. గత నెల కూడా జీఎస్టీ వసూళ్లు రూ.2 లక్షల కోట్లు దాటిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు ఉన్నప్పటికీ.. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభ నెల కావడమూ ఈ వసూళ్లకు ఓ కారణంగా కనిపిస్తోంది. 2025 ఏప్రిల్ నెలలో కూడా ఇదే ఊపు కనిపించింది. ఇక రిఫండ్ల సర్దుబాటు అనంతరం ఏప్రిల్ నెలకు నికరంగా జీఎస్టీ వసూళ్లు రూ.2.11 లక్షల కోట్లుగా ఉన్నాయి. దేశీయంగా విక్రయాల ద్వారా 4.3 శాతం వృద్ధితో రూ.1.85 లక్షల కోట్ల మేర జీఎస్టీ ఆదాయం సమకూరగా.. దిగుమతుల రూపంలో 25.8 శాతం వృద్ధితో రూ.53,861 కోట్ల వసూళ్లు నమోదయ్యాయి.

# విదేశీ మదుపర్లు అమ్మేస్తున్నారు.. ఏప్రిల్‌లో 60వేల కోట్లు?

**ఢిల్లీ:** దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్లు తమ పెట్టుబడులను పెద్ద మొత్తంలో తరలిస్తున్నారు. ఒక్క ఏప్రిల్ నెలలోనే రూ.60,847 కోట్ల విలువైన ఈక్విటీలను విదేశీ సంస్థాగత మదుపర్లు విక్రయించినట్లు ఎన్ఎస్‌డీఎల్ డేటా చెబుతోంది. ప్రస్తుత క్యాలెండర్ సంవత్సరంలో ఇప్పటివరకు రూ.1.92 లక్షల కోట్ల విలువైన సొమ్మును ఉపసంహరించినట్లు పేర్కొంది. 2025 మొత్తం క్యాలెండర్ సంవత్సరంలో ఉపసంహరించిన రూ.1.66 లక్షల కోట్లతో పోలిస్తే ఈ మొత్తం చాలా ఎక్కువ. ఒక్క ఫిబ్రవరి నెల మినహా 2026 క్యాలెండర్ సంవత్సరం ప్రారంభం నుంచి విదేశీ మదుపర్లు విక్రయాలు కొనసాగి స్తున్నారు. జనవరిలో రూ.35,962 కోట్ల ఈక్విటీలను విక్రయించిన ఎఫ్‌పీఐలు.. ఫిబ్రవరిలో మాత్రం రూ.22,615 కోట్ల నిధు లను మన మార్కెట్‌లో పెట్టుబడిగా పెట్టారు. మళ్లీమార్చి నెలలో రికార్డు స్థాయిలో రూ.1.17 లక్షల కోట్లు, ఏప్రిల్ నెలలో రూ.60,847 కోట్లు ఉపసంహరించినట్లు డేటా చెబుతోంది. సమీప భవిష్యత్‌లో రేట్లలో కోత ఉండకపోవ డం,బాండ్ రాబడులు అధిక స్థాయిలో ఉండ డం భారత్ సహా వర్ధమాన మార్కెట్లపై ఎఫ్‌పీఐల అనాసక్తికి కారణమని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా డబ్ల్యూటీఐ క్రూడ్ బ్యారెల్ 90 డాలర్ల దిగువకు చేరితే ఎఫ్‌పీఐ ఇన్‌ఫ్లోలు పెరిగే అవకాశం ఉందని ఏంజిల్ వన్‌లో సీనియర్ అనలిస్ట్ వకార్ జావేద్ ఖాన్ అంచనా వేశారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ.1.7 లక్షల కోట్ల విలువైన ఈక్విటీలను దేశీయ సంస్థాగత మదుపరులు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.

# ఇన్ఫోసిస్‌లో లేఆఫ్‌ల్లేవ్

## సీఈఓ సలీల్ పరేఖ్




కృత్రిమ మేధ ప్రభావంతో దిగ్గజ కంపెనీల్లో కొనసాగుతోన్న లేఆఫ్‌లు ఆందోళనకు గురిచేస్తోన్న వేళ.. ఇన్ఫోసిస్ గుడ్‌న్యూస్ చెప్పింది. తమ సంస్థల్లో ఉద్యోగుల తొలగింపులు చేపట్టబోమని వెల్లడించింది. రానున్న రోజుల్లో కొత్త నియామకాలు, నైపుణ్యాల పెంపుపై తమ కంపెనీ దృష్టిసారించనున్నట్లు తెలిపింది.

గతేడాది ఇన్ఫోసిస్‌లో ఎలాంటి లేఆఫ్‌లు చేపట్టలేదని కంపెనీ సీఈఓ సలీల్ పరేఖ్ మనీకంట్రోల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. రాబోయే రోజుల్లోనూ తొలగింపులు ఉండబోవని వెల్లడించారు. ఏఐ రాకతో ఎంట్రీ లెవల్ ఉద్యోగాల్లో కొన్ని మార్పులు ఉన్నప్పటికీ.. కృత్రిమ మేధతో పని పరిధి మరింత విస్తరిస్తుందన్నారు. ఏఐ వల్ల ఉద్యోగాల కోతలు ఉండబోవని అభిప్రాయం వ్యక్తం చేశారు. కృత్రిమ మేధను అందిపుచ్చుకుని తమ ఉద్యోగులకు ఆ నైపుణ్యాల్లో మరింత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026–27)లో కంపెనీ కనీసం 20,000 మంది ఫ్రెషర్లను నియమించుకునే ప్రణాళికలో ఉందని ఇటీవల ఇన్ఫీ ప్రకటించిన సంగతి తెలిసిందే.
ఇదిలాఉండగా.. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా టెక్ కంపెనీల్లో లేఆఫ్‌లు కొనసాగుతున్నాయి. ఏఐ సేవల కోసం బిగ్ టెక్ కంపెనీలు డేటా సెంటర్లు, ఇతర మౌలిక వసతులకు బిలియన్ల కొద్దీ డాలర్లను కుమ్మరించాల్సి వస్తోంది. దీంతో ఆయా కంపెనీలు ఖర్చు తగ్గింపు పనిలో పడ్డాయి. ఇప్పటికే మెటా, మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీలు ఈ ఏడాదికి కోతలను ప్రకటించాయి.

# ఈ ఏడాది ఎలాన్ మస్క్ వేతన ప్యాకేజీ.. ఏకంగా రూ.15 లక్షల కోట్లు..!



అపర కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ వేతన అంశం మరోసారి వార్తల్లో నిలిచింది. 2025 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆయనకు ఏకంగా 158 బిలియన్ డాలర్ల వేతన ప్యాకేజీని టెస్లా ప్రకటించింది. ఈమేరకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో కంపెనీ వెల్లడించింది. అయితే, ఈ మొత్తం మస్క్ ) ఖాతాలో పడదండోయ్..! ఇందుకు కొన్ని షరతులుంటాయి.

సాధారణంగా టెస్లా సీఈఓగా ఎలాన్ మస్క్ నెలవారీ జీతంగా ఎలాంటి మొత్తాన్ని పొందరు. స్టాక్ అవార్డులు, ఇతరత్రా రూపంలో పారితోషిక ప్యాకేజీని అందుకుంటారు. 2025 ఆర్థిక సంవత్సరానికి గానూ మస్క్‌కు 158 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.15 లక్షల కోట్లు) ప్యాకేజీని టెస్లా ప్రకటించింది. అయితే, ప్రకటనలో ఉన్న మొత్తంతో పోలిస్తే.. వాస్తవంగా ఆయన పొందే విలువలో గణనీయమైన వ్యత్యాసం ఉండొచ్చని కంపెనీ తమ ఫైలింగ్‌లో వెల్లడించింది.



**మస్క్ పంపేస్తే.. రూ.19 వేల కోట్ల కంపెనీని నడిపిస్తున్నాడు..!**
తాజాగా ప్రకటించిన దానిలో.. కంపెనీ పనితీరు ఆధారిత పారితోషికం విలువ 132 బిలియన్ డాలర్లుగా పేర్కొన్నారు. పనితీరు విషయంలో కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలన్నీ నెరవేరితేనే ఈ మొత్తం మస్క్‌కు అందుతుంది. ఇక, ప్యాకేజీలో మిగతా 26 బిలియన్ డాలర్లు.. టెస్లా బోర్డు ఆమోదించిన మధ్యంతర అవార్డు రూపంలో లభిస్తుంది. గతేడాది కూడా మస్క్‌కు టెస్లా కంపెనీ ట్రిలియన్ డాలర్ల ప్యాకేజీని ప్రకటించిన సంగతి తెలిసిందే. అది పూర్తిగా ఈక్విటీ అవార్డు గ్రాంట్ల రూపంలో ఇవ్వనున్నట్లు నాడు తెలిపింది. అంటే.. టెస్లా స్టాక్ విలువ పెరిగి, నిర్వహణ పరంగా కంపెనీ నిర్దేశించుకున్న మైలురాళ్లను చేరుకుంటే ఆ మొత్తం మస్క్‌కు లభిస్తుందన్నమాట. అయితే, గతేడాది టెస్లా మార్కెట్ విలువ పెరగలేదు. నిర్దేశించుకున్న లక్ష్యాలను కూడా అందుకోకపోవడంతో.. మస్క్‌కు ఎలాంటి పారితోషికం లభించలేదు.




## మహిళలకు పోస్టల్‌శాఖ

# అదిరిపోయే గుడ్ న్యూస్..

### ఈ అకౌంట్ తీసుకుంటే అన్నీ ఉచితమే..

**ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ దేశ ప్రజల కోసం మరో కీలక ముందడుగు వేసింది. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు మరో కొత్త సేవింగ్స్ అకౌంట్‌ను ప్రవేశపెట్టింది. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు, స్వయం సహాయక సంఘాలకు బ్యాంకింగ్ సౌకర్యం కల్పించేందుకు స్వయం సహాయక బృందాల సేవింగ్స్ అకౌంట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని వల్ల స్వయం సహాయక సంఘాల(SHG)కు సులభమైన, సరసమైన బ్యాంకింగ్ సేవలు అందనున్నాయి. చిన్న వ్యాపారులు, లేదా ఆర్థిక కార్యకలాపాలు ఎక్కువగా నిర్వహించే మహిళలకు ఇది ఉపయోగపడనుంది. కేవలం గ్రామీణ మహిళల కోసమే ప్రత్యేకంగా ఈ కొత్త సేవింగ్స్ అకౌంట్ లాంచ్ చేశారు. అసలు అకౌంట్ బెనిఫిట్ ఏంటి..? దీనిని ఎలా ఓపెన్ చేయాలి? అనే విషయాలు చూద్దాం.**




**SHG సేవింగ్స్ అకౌంట్ ప్రత్యేకతలు**
- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ కోసం ప్రత్యేకంగా తీసుకొచ్చిన అకౌంట్ ఇది
- స్వయం సహాయక సంఘాలకు బ్యాంకింగ్ సేవలు సులువుగా అందటం, ఆర్థిక నిర్వహణను బలోపేతం చేయడం దీని లక్ష్యం
- జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్, నాబార్డ్, గ్రామీణాభివృద్ధి అజెండకు మద్దతుగా ఈ అకౌంట్ తీసుకొచ్చారు
- స్వయం సహాయక సంఘాల్లోని మహిళల ఆర్థిక తోడ్పాటుకు ఇది సహాయపడుతుంది



**అన్నీ ఉచితమే..**

- పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ నా+ అకౌంట్‌లో జీరో బ్యాలెన్స్ ఉన్నా ఎలాంటి జరిమానాలు ఉండవు
- అకౌంట్ ఉచితంగా ఓపెన్ చేయవచ్చు. ఎలాంటి మినిమం బ్యాలెన్స్ అకౌంట్లో ఉండాల్సిన అవసరం లేదు
- ఎలాంటి ఫైన్లు, రుసుంలు ఉండవు
- మనీ డిపాజిట్, విత్ డ్రాకు ఎలాంటి సర్వీస్ ఛార్జీలు ఉండవు
- రూ.20 లక్షల వరకు నగదు నిల్వ చేసుకోవచ్చు
- సేవింగ్స్‌పై వార్షిక వడ్డీ కూడా ఉంటుంది
- ప్రతీ నెలా ఉచితంగా ఒకసారి బ్యాంక్ స్టేట్‌మెంట్ పొందవచ్చు
- ఇక అకౌంట్ క్లోజింగ్, క్యూఆర్ కార్డు జారీ చేసేందుకు ఎలాంటి ఛార్జీలు ఉండవు
- ఈ అకౌంట్‌ను మీ ఇంటి వద్దనే డిజిటల్‌గా ఓపెన్ చేయవచ్చు
- పోస్టాఫీసులు, గ్రామీణ డావ్ సేవకల సహాయంతో ఖాతా తెరవొచ్చు
- ఇంటి వద్ద నుంచే డిజిటల్ సేవల ద్వారా ఈ ఖాతాను నిర్వహించుకోవచ్చు
- గ్రామీణ ప్రాంతాల్లో కూడా డిజిటల్ బ్యాంకింగ్ సేవలు విస్తరించేలా పోస్టల్ శాఖ ప్రయత్నాలు చేస్తోంది

# కార్మికుల సేవలు వెలకట్టలేనివి





### కలెక్టర్ మను చౌదరి

### కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది

### కలెక్టరేట్లో ఘనంగా మేడే వేడుకలు

**మేడ్చల్ కలెక్టరేట్, మే1 (నినాదం):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే)ను ఘనంగా నిర్వహించారు. సమాజ నిర్మాణంలో కార్మికుల అపారమైన సేవలను స్మరించుకుంటూ, వారి కృషికి గౌరవం తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఒ జిల్లా మేజిస్ట్రేట్ శ్రీ మిక్కిలినేని మనూ చౌదరి, ఐ.ఏ.ఎస్., ఈ సందర్భంగా కార్మికులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఫైజాన్ అహ్మద్, ఐ.ఏ.ఎస్., అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కూడా కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి కృషి దేశ ఆర్థికాభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, న్యాయమైన వేతనాలు, సురక్షితమైన పనివాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కార్మిక సంక్షేమం కోసం జిల్లా పరిపాలన కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ, కార్మిక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం, కార్మికుల జీవిత స్థితిగతులను మెరుగుపరచడం అత్యంత ముఖ్యమని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిని సన్మానించారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ అంజనేయులు ఈఎస్ఐ విభాగానికి చెందిన డా. కనక దుర్గాదేవి ఐటీఐ మెడ్చల్ ప్రిన్సిపాల్ శ్రీ హనుమా నాయక్ డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీ మనోహర్ రెడ్డి ని ప్రశంసిస్తూ సత్కరించారు. అదనంగా, బాల కార్మికత్వం నుండి రక్షించబడిన మరియు ప్రస్తుతం విద్యను అభ్యసిస్తున్న కుమారి మీనా ను "బెస్ట్ చైల్డ్ సర్వైవర్"గా గుర్తించి సత్కరించారు. ఆమె పట్టుదల మరియు విద్యపై ఆసక్తిని అధికారులు అభినందించారు. అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం నుండి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్రీ లక్ష్మీపతి గారు కార్మిక సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు. ఎంప్లాయ్మెంట్ ఆఫీసర్ శ్రీమతి రాధిక గారు నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి అవకాశాల పెంపుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు శ్రీ సాయి సుమన్ పి. శ్రీ అంజనేయులు కార్మికులకు కొత్త కార్మిక చట్టాలు (లేబర్ కోడ్స్) ఉద్యోగుల హక్కుల గురించి వివరణ ఇచ్చారు. వారు కార్మికులు తమ హక్కులు, సంక్షేమ పథకాలపై అవగాహన కలిగి ఉండడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. జిల్లాలో కార్మికులకు అవగాహన కల్పించేందుకు మే 02 నుండి మే 10 వరకు ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరాలలో కార్మిక చట్టాలు, భద్రతా ప్రమాణాలు, సంక్షేమ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించబడుతుంది అని తెలిపారు.

## వికలాంగుల సమస్యలు పరిష్కరించండి

### తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుతారి రమేష్



**చేర్యాల, మే 1 (నినాదం):** చేర్యాల మండలం నుండి వికలాంగులు ఎదుర్కొన్న సమస్యల మీద మద్దూరు కొమరవెల్లి చేర్యాల్ దుల్మిట్ట మండలాల్లో ఉన్న వికలాంగులు ఇబ్బందులకు గురవుతున్నారు ప్రభుత్వం నుంచి వచ్చే ఏ పథకాలు అందుకోలేక పోతున్నారు జిల్లా ఏమో సిద్దిపేట కలెక్టర్ ఆఫీస్ ఎన్నోసార్ల కలెక్టర్ ఆఫీస్కి దరఖాస్తులు పెట్టుకున్న న్యాయం జరగట్లేదు కారణం జిల్లా సిద్దిపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జనగామ ఎంపీ వచ్చి భువనగిరి ఇలాంటి పరిస్థితుల్లో ఒక వికలాంగుడు ఎవరికి చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నారు దీనిపై వికలాంగులైన చైర్మన్ ముత్తినేని వీరయ్య కలిసి మెమొరండం అందించారు కారణం ఏంటో తెలియట్లేదు కానీ ప్రతి ఒక్క జిల్లాలో గాని మండలంలో గాని వికలాంగుల సమస్యలు పరిష్కరించండి అని చైర్మన్తో మాట్లాడటం జరిగింది ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాము అని హామీ ఇచ్చారు అలాగే త్వరగా పరిష్కరిస్తామని చెప్పరు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోషల్ మీడియా కన్వీనర్ సుతారి రమేష్ పవన్ శ్రీనివాస్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్సి ఫలితాలలో నారాయణ స్కూల్ ప్రభంజనం



**అల్వాల్, మే 1 (నినాదం):** అల్వాల్ డివిజన్ పరిధిలో అల్వాల్ నారాయణ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఎస్ ఎస్ సి 2026 ఫలితాలలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి సత్తా చాటారు. రామ్ తేజ్, రిష్విక్ రెడ్డి, 585/600 టాప్ మార్కులు సాధించారు. అలాగే 69 విద్యార్థులలో 51 విద్యార్థినీ విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించి 100/శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ ఉమా నాగలక్ష్మి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీఎం పురుషోత్తం రెడ్డి, ప్రిన్సిపాల్ ఉమా లక్ష్మి, అకాడమిక్ డీన్ శైలజ, టెన్త్ ఇంచార్జ్ రామకృష్ణ, ఉపాధ్యాయులు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

## వ్యవసాయ పంటలపై అవగాహన సదస్సు



**వెల్దుర్తి, మాసాయిపేట/మే 1 (నినాదం):** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వావిద్యాలం ఆధ్వర్యంలో, జరుగుతున్న "రైతులు ముంగిట్లో, శాస్త్రవేత్తలు" కార్యక్రమలో భాగంగా, వ్యవసాయ ఇంజినిరింగ్ కళాశాల కంది మండలం సంగారెడ్డి బోధన సిబ్బంది శుక్రవారం నాడు డాక్టర్. లక్ష్మణరావు, డాక్టర్.నీమా మాట్లాడుతూ. మాసాయిపేట మండలంలోని పోతిన్ శెట్టిపల్లి గ్రామంలో, అన్నదాతలకు, అవగాహనా సదస్సు, నిర్వహించడం, జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్. లక్ష్మణ్ రావు మాట్లాడుతు, పంటలలో యూరియా వినియోగం తగ్గించడం, రసాయన ఎరువుల వినియోగం, తగ్గించి జీవ ఎరువులు, వాడడం మరియు సేంద్రియ పద్ధతులపై, వివరించడం జరిగింది. డాక్టర్. నీమా మాట్లాడుతూ. పంట మార్పిడివల్ల జరిగే మేలు, నీటి ఆదా చేయడం, అదేవిధంగా, మార్కెట్లో గిరాకీ ఉన్న వరి పంటలపై, చర్చించడం జరిగింది. ఉద్యాన విస్తరణ అధికారి గోవిందా కూరగాయల పండ్ల తోటల, పెంపకం గురించి, అవగాహన కల్పించడం, జరిగింది. శీఅశ్రీ జుఖ్రీఎ ఆయిల్ ఫామ్, పాటించవలసిన జాగ్రత్తలు, అనంతరం, సబ్సిడీ గురించి, వివరించడం, జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప్పల ప్రశాంత్ , ఉప సర్పంచ్, వార్డు, సభ్యులు , రైతులు, మరియు ఎచ్ఈఎం, గోవింద్ , అయి ల్, ఫామ్ ఫీల్డ్ ఆఫీసర్ ఉదయ్ కుమార్ , ఏ ఈ ఓ రజిత, పంచాయతీ సెక్రెటరీ ప్రమోదిని, తదితరులు, పాల్గొన్నారు.

## మేడే సందర్భంగా సిఐటియు జెండావిష్కరణలు

**దుబ్బాక, మే 1 (నినాదం):** సిద్ధిపేట జిల్లా దుబ్బాకలో ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే ను పురస్కరించుకొని సిఐటియు అనేక గ్రామాలలో జండావిష్కరణలు చేసుకొన్నారు. దుబ్బాక మండల కేంద్రాలను సిఐటియు జండావిష్కరణ చేస్తున్న కోశాధికారి జి.భాస్కర్ అనంతరం ఆయన మాట్లాడుతూ మేడే సందర్భంగా అన్ని గ్రామాలలో మరియు మున్సిపల్ పట్టణంలో వివిధ వార్డులలో హమాలి,భవననిర్మాణ, బీడీ కార్మికులు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కార్మికులు, సిఐటియు జండావిష్కరణలు ఎగురవేసి,మేడే కార్మిక దినోత్సవం జరుపుకున్నారని తెలిపారు. కార్మిక వర్గం మతతత్వ,అస్తిత్వ రాజకీయాలను నిశితంగా పరిశీలించి కార్మికవర్గ ఐక్యతను చాటాలని అన్నారు. రక్తం ఏరులై పారిన సందర్భంలో అవతరించిన రోజే మేడే అన్నారు. భారతదేశంలో కూడా కార్మిక హక్కులకు సంబంధించిన అనేక చట్టాలు రూపొందించ బడ్డాయన్నారు. ఇప్పుడు ఆ చట్టాలన్నీ మటు మాయం అయిపోయి లేబర్ కోడ్లలో కలిసిపోయి కార్మికులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. దోపిడీ వర్గాలను ధీటుగా ఎదుర్కొనే గుణాత్మక పోరాటాలను నిర్మించడానికి ప్రతి ఒక్కరూ కదిలీ త్యాగాల ఫలితంగా సాధించుకున్న హక్కులను కాపాడుకునే మేడే స్ఫూర్తితో పోరాటాలకు



సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో పట్టణ కన్వీనర్ కొంపల్లి భాస్కర్ ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎస్. నవీన అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి.పద్మ నాగరాణి హాస్పిటల్ వర్కర్స్ లావణ్య,ఇంద్ర,యాదగిరి, సత్యనారాయణ,ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి భాగ్యలక్ష్మి,స్వరూప,శారద,సంతోష ,స్వామి,భాస్కర్, ఎండి సాదిక్, ఎండి లక్ష్మినర్సయ్య,రాజు, నాగరాజు,కిషన్, రవికుమార్, చంద్రయ్య మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ కార్మికుల దినోత్సవం

**వికారాబాద్, మే 1(నినాదం):** కార్మికుల హక్కులు సాధించుకున్న నేపథ్యంలో చికాగో నగరంలో ఎగిరిన ఎర్ర జెండా సాక్షిగా ప్రతి ఏటా నిర్వహించే కార్మికుల దినోత్సవం మే డే ను శుక్రవారం జిల్లాలో ఘనంగా జరుపున్నారు. జిల్లా కేంద్రంలో బి ఆర్ టి యూ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మే డే జెండాను ఎగురవేసి మే డే ను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బి ఆర్ టి యూ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న 39 కార్మిక చట్టాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నాలుగు కార్మిక కోడ్లుగా మారుస్తూ యాజ మాన్యాలకు అనుకూలమైన చట్టాలను రూపొందించడం జరిగిందని అన్నారు. దీని మూలంగా కార్మికవర్గం పోరాడి సాధించుకున్న. కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుగుణంగా మార్చడం



ఎంతవరకు సమంజసమని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఆగ్రహం వ్యక్తం చే శారు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలను అన్నింటిని అప్పనంగా , ఆదాని, అంబానీ లకు కారు చౌకగా కట్టబెడుతూ లక్షల కోట్ల రూపాయలను తన అనుయాయులకు లాభలు చేకూరుస్తున్నా రని, ఆరోపించారు. ఈ కార్యమాల్లో కార్మిక సంఘాల నాయకులు గోపాల్ రెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

## రసాయన శాస్త్రంలో నగరపు లక్ష్మీకుమారికి పీహెచ్.డీ.



**పటాన్చెరు, మే 01(నినాదం):** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని నగరపు లక్ష్మీకుమారి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'క్లోఫరాబైన్, డెసిటాబైన్, బెలినోస్టాట్, బోర్టెజోమిబ్ తయారీలో కీలక మధ్యస్థ పదార్థాలు, క్రియాశీల ఔషధ పదార్థాల (ఏపీఐ) సంశ్లేషణకు అధునాతన విధానాల'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చిత్తలూరి సుధాకర్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ కుమారి చేసిన డాక్టరల్ పరిశోధన, కీలకమైన ఔషధ మధ్యస్థ పదార్థాలు, క్రియాశీల ఔషధ పదార్థాల (ఏపీఐల) సంశ్లేషణ కోసం వినూత్న, సమర్థవంతమైన వ్యూహాలను అందిస్తుందన్నారు. ఈ అధ్యయనం తేలికపాటి చర్య పరిస్థితులలో తక్కువ ఖర్చుతో కూడిన కారకాలను వినియోగించడం ద్వారా, పారిశ్రామిక వినియోగానికి అనువైన వేగవంతమైన, అధిక దిగుబడినిచ్చే, విస్తరించదగిన ప్రక్రియలను సూచిస్తోందని తెలిపారు. డాక్టర్ కుమారి పరిశోధన, క్యాన్సర్ నిరోధక మందుల అభివృద్ధికి గణనీయమైన అవకాశాలను అందించే ఆచరణాత్మక, పారిశ్రామిక-ఆధారిత సంశ్లేషణ పద్ధతులను పరిచయం చేస్తుందన్నారు. ప్రాణాలను కాపాడే ఈ చికిత్సా విధానాల తయారీలో ఎదురయ్యే కీలక సవాళ్లను పరిష్కరించడం ద్వారా, ఆమె పరిశోధన ఔషధ రసాయన శాస్త్రం, ఔషధ తయారీ రంగాలలో పురోగతికి గణనీయంగా దోహదపడుతుందని వెల్లడించారు. డాక్టర్ లక్ష్మీకుమారి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ కుమారి సాధించిన ఈ విజయం ఆమె అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తుందని, క్యాన్సర్ చికిత్సల భవిష్యత్తుకు ఒక విలువైన తోడ్పాటును అందిస్తుందన్నారు.

## బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడమే లక్ష్యం

### ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్

**వికారాబాద్, మే 1(నినాదం ):** ప్రజల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి వారికి భరోసా కల్పించడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందని బాధితులు తమ సమస్యల కోసం ఎప్పుడైనా ఎస్పీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ బాధితులకు అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్వయంగా ఫిర్యాదుదారులను కలిసి వారి ఇబ్బందులను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల సమస్యలపై స్పందించి అక్కడికక్కడే సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు ఫోన్ చేసి కేసుల పురోగతిపై ఆరా తీశారు. చట్ట పరిధిలో ఉన్న సమస్యలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా, పూర్తి పారదర్శకతతో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. సమాజంలో వృద్ధుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేసినా లేదా వారిని మానసిక, శారీరక ఇబ్బందులకు గురిచేసినా అటువంటి వారిపై



చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయం పైన పలు ఫిర్యాదులు అందినాయని , ప్రజావాణికి వచ్చిన ప్రతి అర్జీని కంప్యూటరైజ్ చేసి, ఆ సమస్య పరిష్కారమయ్యే వరకు నిరంతరం పర్యవేక్షించేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## నత్తనడకగా చేర్యాల తహసీల్దార్ కార్యాలయం పనులు

### సమయానికి రాని అధికార సిబ్బంది

### ప్రజలు పనుల కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు

**చేర్యాల, మే 1(నినాదం):** చేర్యాల మండలం తాసిల్దార్ కార్యాలయం నందు సమయం 11 దాటిన గానీ ఏ అధికారి కార్యాలయం నందు కనబడుట లేదు కొన్ని గదిలో తాళాలతో దర్శనమిస్తున్నాయి డెత్ సర్టిఫికేట్ , ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్, రెసిడెన్షియల్ సర్టిఫికేట్, నెలలు తరబడి తిరిగిన సర్టిఫికేట్ ఐతలేవు సార్ లేదు మీటింగ్ పోయిండు అని ఎన్నోసార్లు చెబుతున్నారు నీపైలు నెలరోజులకు అయితది



సంతకం కాలే అన్న మాటలు విని వినీ ప్రజలు నెలలు తరబడి తిరిగి తిరిగి విసుకు చెంది పోతున్నారు ఇచ్చిన ఫైలు చూసేసరికి ఇచ్చింది ఇచ్చినట్లే ఉండే సరికి అధికారుల తీరి ఇదేనా అని ప్రజలు వెనుతిరిగి వెళ్తున్నారు కొన్ని సందర్భాల్లో ఫైలు దొరకడానికి నెల రెండు నెలలు పడుతుంది అని ప్రజలు అసహనానికి గురవుతున్నారు ఒక అధికారి మీద కాకుండా ఇంకో అధికారి దగ్గర మీ పైలు ఉండొచ్చు చెప్పుకుంటూ కాలం గడుపు తున్నారు గ్రామాల నుండి అన్ని పనులు వదిలిపెట్టుకొని వచ్చిన వారికి తీరా ఎట్లా ఉన్న పైలు అట్లే ఉండేసరికి వారి బాధని వెలిబుచ్చుకుంటూ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఉన్నారు ఎమ్మార్వో ను అడిగితే నా దగ్గర ఎలాంటి ఫైలు పెండింగ్లో లేదు అధికారులను అడగండి అని అంటున్నారు ఏదేమైనా పైఅధికారులు దృష్టి పెట్టి ఆఫీసుల్లో పనులు తొందరగా అయ్యే తట్టు చేసి సర్టిఫికెట్లు అవసరాలకు అందుతటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## మేడే స్ఫూర్తితో ఎనిమిది గంటల పనిదినానికై ఉద్యమిద్దాం

### సిఐటియు మండల కన్వీనర్ కీలుకానీ లక్ష్మణ్



**కుత్బుల్లాపూర్, మే 1 (నినాదం):** సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాల సందర్భంగా భవన నిర్మాణ కార్మికుల సంఘం, సెంట్రింగ్ కార్మికుల సంఘం, జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంత లోడింగ్ అన్లోడింగ్ అమాలి యూనియన్ అడ్డా వద్ద, షాపూర్ నగర్ మార్కెట్, ఈఎస్ఐ చౌరస్తా, గాజులరామారం చౌరస్తా, దేవేందర్ నగర్, జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతం దీపక్ నైట్రేట్ గేటు వద్ద సిఐటియు జెండాలను ఆవిష్కరించారు. అనంతరం షాపూర్ నగర్ కార్యాలయంలో జరిగిన సభలో సిఐటియు సీనియర్ నాయకులు రావుల వరప్రసాద్, కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ 140 సంవత్సరాల క్రితం అమెరికాలోని చికాగో నగరంలో ఎనిమిది గంటల పని దినాలను అమలు చేయాలని, పనికి తగిన వేతనాలు ఇవ్వాలని, పని స్థలాల్లో మెరుగైన పరిస్థితులు కల్పించాలని సూచించారు. పెట్టుబడిదారులు కార్మికుల శ్రమదోపిడీకి వ్యతిరేకంగా పోరాడి ఎనిమిది గంటల పని దినాల్ని సాధించుకున్నారని 1886 మే 1న జరిగిన ఈ పోరాటాన్ని ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గ పోరాట దినంగా గుర్తిస్తూ ప్రపంచ కార్మిక దినోత్సవంగా పాటిస్తున్నారని వారు పేర్కొన్నారు . ఆ ఉద్యమంలో ఎనిమిది మంది కార్మిక నాయకులు తమ ప్రాణాలను అర్పించగా, వారి త్యాగాల ఫలితంగా నేడు ప్రపంచవ్యాప్తంగా రోజుకు ఎనిమిది గంటల పని అమలవుతుందని వాపోయారు. ఆ పోరాట స్ఫూర్తిని తీసుకొని నేడు కార్మిక వర్గంపై పెరుగుతున్న పనిభారం, పని గంటల పెంపు, శ్రమదోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉన్నదన్నారు. దేశంలో కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం కాలరాస్తోందని, కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చే కుట్ర దుర్మార్గమైనదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్ను అమలు చేయడం ద్వారా కార్మికులపై మరింత శ్రమదోపిడీ పెరుగుతుందని తెలిపారు. పనిగంటల పెంపు, సమ్మె హక్కు హరించడం, తక్కువ వేతనాలతో పని చేయించడం వంటి చర్యల ద్వారా కార్మికులపై భారం పెరుగుతోందని, ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాడి తమ హక్కులు కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు జి వెంకన్న, అంజయ్య, కే శీను, వెంకయ్య, ముత్యాలు, జాకీర్, స్వాతి, కరుణాకర్, అనిల్, చందు, తదితరులు పాల్గొన్నారు.

## నిరంతరం కార్మికుల సమస్యలపై పోరాడి వారి హక్కులు కాపాడుతా..

### అల్ మెలో కంపెనీలో ఐఎన్టీయూసీ జెండాను ఎగరవేసిన కేఎం ప్రతాప్



**కుత్బుల్లాపూర్, మే 1 (నినాదం) :** ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే వేడుకల సందర్భంగా ఐడిఏ కూకట్పల్లి అల్ మెలో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఐ.న్.టి.యు.సి. జెండాను ఆవిష్కరించిన కార్మిక యూనియన్ అధ్యక్షులు, శ్రమశక్తి అవార్డు గ్రహీత, రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు,శ్రీ కె.యం.ప్రతాప్ ఐ ఎన్ టి యు సి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె ఎం ప్రతాప్ మాట్లాడుతూ,ప్రపంచ కార్మికుల దినోత్సవం మే డే శుభాకాంక్షలను యావత్ కార్మిక లోకానికి కార్మికుల దినోత్సవం మే డే శుభాకాంక్షలు తెలిపారు. వెట్టి చాకిరి నుంచి విముక్తి పొందిన రోజును మేడేగా మనం జరుపుకుంటున్నామన్నారు. కార్మికులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, వారి హక్కుల కోసం పోరాడుతానన్నారు. ఈ కార్యక్రమంలో అల్ మెలో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యూనియన్ ఉపాధ్యక్షులు యం.శ్రీనివాసరెడ్డి, ఎస్.రామచందర్, ప్రధాన కార్యదర్శి యం.శాంతారావు, సంయుక్త కార్యదర్శి కె.మల్లికార్జున్, కోశాధికారి టిఆర్. జయన్న, కార్య నిర్వాహక కార్యదర్శి యం.సురేష్, కమిటీ సభ్యులు కృష్ణ, రాజు, కుమార్, చిన్నపరెడ్డి,యాదగిరి గౌడ్,వి అర్ ఎస్.రెడ్డితదితరులు పాల్గొన్నారు.

## సఖి కేంద్రాల పాత్ర ఎంతో కీలకం

### సఖి సెంటర్ సందర్శించిన ఎమ్మెల్యే



**అల్వాల్, మే 1 (నినాదం):** ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అల్వాల్లోని సఖి వన్ స్టాప్ సెంటర్ను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో అందిస్తున్న సేవలు, నిర్వహిస్తున్న కార్యక్రమాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మహిళలకు అత్యవసర సహాయం, రక్షణ, న్యాయసహాయం, కౌన్సెలింగ్ వంటి సేవలు అందించే ఈ కేంద్రాల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా ధైర్యంగా ముందుకు వచ్చి ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం కేంద్రంలో ఉన్న సదుపాయాలు, నిర్వహణ ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించి, మరింత మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సఖి వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది, స్థానిక నాయకులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# కార్మికుల శ్రమే సమాజ అభివృద్ధికి మూల స్థంభం

### కష్టపడి పనిచేసే ప్రతి కార్మికుడికి గౌరవం ఇవ్వాలి

### అదనపు కలెక్టర్ వినోద్ కుమార్

**వనపర్తి ప్రతినిధి, మే 1 (నినాదం):** కార్మికుల శ్రమే సమాజాభివృద్ధికి మూల స్తంభమని, కష్టపడి పనిచేసే ప్రతి కార్మికుడికి గౌరవం ఇవ్వాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వినోద్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మేడే అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో డీఎస్పీ బాలాజీ నాయక్, జెడ్పీ సీఈఓ యాదయ్య, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, ఇతర కార్మికులను అధికారులు ఘనంగా సన్మానించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలోనే అత్యధిక పని దినాలు పనిచేసిన కార్మికురాలు విజయమ్మను కూడా సన్మానించారు. అలాగే ఐటీఐ విద్యార్థులకు ప్రతిభా పురస్కార పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రతి రంగంలో కార్మికుల పాత్ర అమూల్యమని, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో కార్మికుల సహకారం కీలకమని చెప్పారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కార్మికుల చట్టాలపై వారిలో అవగాహన కల్పించి కార్మికుల హక్కులను కాపాడటంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.





సమాన పనికి సమాన వేతనం ఇవ్వడమే వారికి ఇచ్చే గౌరవం అని తెలిపారు. జిల్లాలోని పరిశ్రమలు కూడా తమ వద్ద పనిచేసే కార్మికులకు మంచి వసతులు కల్పించాలని సూచించారు. అదేవిధంగా కార్మిక శాఖ అధికారులు జిల్లా నుంచి వలస వెళ్లిన వారిని జాతరలు, మరి ఏదైనా ఇతర వేడుకల సందర్భంగా వారు ఇక్కడికి వచ్చినప్పుడు వారిని కలుసుకొని వారికి కార్మిక చట్టాలపై అవగాహన కల్పించి కార్మిక శాఖ తరఫున అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా జిల్లాలో బాల కార్మికులు ఎక్కడైనా ఉన్నట్లు దృష్టికి వస్తే వారిని రక్షించాలని సూచించారు. డీఎస్పీ బాలాజీ నాయక్ మాట్లాడుతూ కార్మికుల కృషి వల్లనే సమాజం ముందుకు సాగుతుందని అన్నారు. ప్రతి వ్యక్తి తన పని పట్ల నిబద్ధతతో ఉండాలని సూచించారు. కార్మికులకు గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. క్రమశిక్షణ, శ్రమతో విజయాలు సాధ్యమవుతాయని చెప్పారు. కార్మికుల హక్కులను కాపాడటంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఐటిఐ కళాశాలకు సంబంధించిన అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ లో విద్యార్థులకు అందుబాటులో ఉన్న కోర్సులకు సంబంధించిన పోస్టర్, కార్మిక శాఖ ఆధ్వర్యంలో కార్మిక చట్టాలపై, కార్మికులకు కల్పించే పథకాలపై రూపొందించిన బుక్లెట్ ను అధికారులు ఆవిష్కరించారు. జిల్లాకు చెందిన బీడీ, లిక్కర్ పరిశ్రమలో 1600 మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారికి మంచి వసతులు కల్పిస్తున్న యాజమాన్యం తరఫున హాజరైన రీజనల్ మేనేజర్ ఉమాశంకర్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్మిక శాఖ అధికారి రవి, ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ హక్, ఐటిఐ విద్యార్థులు, అధికారులు, సిబ్బంది, కార్మికులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మధుసూదన్ కుటుంబానికి ప్రభుత్వం అండగా..

### రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**నల్లగొండ ప్రతినిధి మే 1 (నినాదం):** ఇటీవల గుండెపోటుతో మరణించిన తన పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎం.మధుసూధన్ మరణం బాధాకరమని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం అయన నల్గొండ జిల్లా, మిర్యాలగూడ లోని ఉపముఖ్య మంత్రి పిఆర్ఓ దివంగత మధుసూదన్ గృహాన్ని సందర్శించి మధుసూదన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మధు మరణం తనకు షాకింగ్ న్యూస్ అని, మధుసూదన్ మరణ వార్త విన్న వెంటనే తాను తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని ,చిన్న వయసులో మధుసూదన్ చనిపోవడం బాధాకరమని, భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరుతూ, వారి కుటుంబ సభ్యులకు ప్రఘాడ సానుభూతి తెలిపారు. మధుసూదన్ కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకుంటామని తెలిపారు. కీర్తిశేషులు మధుసూదన్ భార్య జ్యోతి, కుమారుడు వెంకట్ సూరజ్ లను ఆయన ఓదార్చారు. వారి వెంటమిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నలగొండ డిసిసి అధ్యక్షుడు పున్న కైలాస్ నేత, తదితరులు ఉన్నారు .

## వడదెబ్బతో వ్యక్తి మృతి



**హుజూర్‌నగర్, మే 1 (నినాదం):** మఠంపల్లి మండలంలో రోజురోజుకీ పెరుగుతున్న ఉష్ణోగ్రత తీవ్రతకు మండల కేంద్రంలో వడదెబ్బ తగిలి ఎస్కే మాబు సుభాని వయసు 65 సంవత్సరాలు అస్వస్థకు గురి అయ్యాడు గత రెండు రోజుల నుండి జ్వరం నీరసంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం మిర్యాలగూడ హాస్పిటల్ కి వెళ్ళగా అక్కడే చనిపోయారని కుటుంబ సభ్యులు తెలిపారు.

## రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి

### కలెక్టర్ ఆదర్శ్ సురభి వెల్లడి



**వనపర్తి ప్రతినిధి, మే 1 (నినాదం):** ప్రజల సమస్యల పరిష్కారానికి మరింత పారదర్శకమైన, బాధ్యతాయుతమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయిలో నిర్వహించాలని నిర్ణయించినట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అదనంగా వెంటనే అమలులోకి వచ్చే విధంగా ప్రతి రెవెన్యూ డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయలలో ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 4 (సోమవారం) నుంచి ప్రారంభించి నిరంతరంగా నిర్వహించేలా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో అందిన పిటిషన్ల సంఖ్యను అదే రోజు ముగింపు నాటికి సేకరించి ప్రభుత్వం సూచించిన నమూనా ప్రకారం నివేదికగా పంపించాల్సిందిగా తెలిపారు. ఈ ఫార్మాట్ త్వరలో తెలపడం జరుగుతుందని చెప్పారు. అలాగే ఫిర్యాదుల నమోదు, పరిశీలన, పరిష్కార ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు సీజీజీ ద్వారా వెబ్ ఆధారిత అప్లికేషన్ అభివృద్ధి చేయబడుతున్నదని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు ఆర్ డి వో కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కోరారు.

## ఉపాధిహామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



**కమలాపూర్ మే 1 (నినాదం):** ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా ఉపాది హామీ కూలీలకు మజ్జిగ, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. మండలంలోని వంగపల్లి గ్రామంలో గల ఉరచేరువులో పని చేస్తున్న ఉపాది హామీ కూలీలకు శుక్రవారం ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా గ్రామ సర్పంచ్ నకీర్త రాజు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా ఆశా కార్యకర్తలు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిల్డ్ అసిస్టెంట్ రామంచ రాజ్ కుమార్, ఉప సర్పంచ్ చిలువేరు పద్మ శ్రీనివాస్, ఆశా కార్యకర్తలు, సునీత రేణుక, ఉపాది కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేయాలి

### ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, కలెక్టర్ చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి, మే 1 (నినాదం):** మిర్యాలగూడ సమీపంలోని తుంగపాడు వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాటు చేయాలని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశంలో వారు మాట్లాడుతూ డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో గిలిపోయిన చిన్న చిన్న మరమ్మతులు, ఇతర పనులను పూర్తి చేసి లబ్ధిదారుల ద్వారా గృహప్రవేశాలు చేయించేందుకు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఆయా శాఖలకు సంబంధించిన పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని చెప్పారు .ముఖ్యంగా తాగునీరు, ఎలక్ట్రిసిటీ కనెక్షన్ వంటివి వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. తాగునీటికై బోర్ల ద్వారా సంపులు ఏర్పాటు చేయగా, మున్సిపాలిటీ నుండి సంపులలో నీరు నింపి నిరంతరం సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ,మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. అంతర్గత సిసి రహదారులు, అప్రోచ్ రోడ్డు వేయాలని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాలనీలో ప్రారంభం నుండి చివరి వరకు చెత్తను తొలగించి మొక్కలు నాటి గ్రీనరీ పెంచాలన్నారు. మొత్తం 10 బ్లాకులలో ఎలక్ట్రికల్ వైరింగ్ శుక్రవారం పూర్తి చేయాలని,పనులు పూర్తయిన ఇళ్లకు తాళాలు వేసి తాళాలు కస్టడీలో ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఇన్చార్జి సబ్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి ఎస్ ఈ శ్రీధర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడి రాజ్ కుమార్, పంచాయతీరాజ్ ఈ ఈ గిరిధర్, తాసిల్దార్ శ్రీనివాస్ కమిషనర్ జె. శ్రీనివాస్ , ఇతర అధికారులు, ఈ సమీక్ష సమావేశానికి హాజరయ్యారు.

## అభిలాష హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పేద జంటలకు పెళ్లిళ్లు

### ఆర్గనైజేషన్ అధినేత్రి సరోజనమ్మను అభినందించిన మంత్రి శ్రీహరి





**అమరచింత, మే 1 (నినాదం):** ప్రార్ధించే పెదవుల కన్నా సాయం చేసిన చేతులే మిన్న అన్న మదర్ తెరిసా వ్యాఖ్యలను నిజం చేస్తున్నారు అభిలాష హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ అధినేత్రి సరోజనమ్మ. అమరచింతకు చెందిన జయమ్మ, కుమార్ అని దంపతుల కూతురు శృతి కడుపేదలైన వీరు పెళ్లి చేసేందుకు ఉన్నాయా పైస లేకపోవడంతో హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ గారిని అక్కున చేర్చుకుంది. ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామానికి చెందిన శరత్ అనే బాబుకు ఇచ్చి పెళ్లి చేసేందుకు ఆర్థిక పరిస్థితి లేక పోవడంతో ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మూలమల్ల గ్రామంలో ఘనంగా పెళ్లి జరిపించారు. పెళ్లి తో పాటు అమ్మాయికి బట్టలు రెండు క్వింటాళ్ల బియ్యం 50 వేల రూపాయ ల వస్తువులను అందజేశారు. పెళ్లికి అమరచింత మూలమల్ల గ్రామాలకు చెందిన బంధువులు హాజరై దంపతులను ఆశీర్వదించారు. ఆర్గనైజేషన్ చేసిన ఈ కృషిని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, ఆత్మ కూరు సీఐ శివకుమార్, ఎస్ఐలు జయన్న, స్వాతి సంస్థ నిర్వాహకులను అభినందించారు. హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో ఇప్పటికీ 19వ పెళ్లి చేసినట్లు సరోజమ్మ తెలిపారు. పెళ్లికి సహకరించిన దాతలకు ఆమె ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీం సభ్యులు ఎం లక్ష్మీ చంద్రశేఖర్ హర్షిత వర్షిని ఇందిరా నారాయణ సుమతి సుమ సాజిదా సికిందర్ జ్యోతి సుకుమారి పాల్గొన్నారు.

## ఆదర్శ విద్యార్థినికి మంత్రి శ్రీధర్‌బాబు అభినందనలు

### ఎస్సెస్సీలో జిల్లా టాపర్‌గా నిలవడం పట్ల ప్రశంసలు



**భూపాలపల్లి ప్రతినిధి, మే 1(నినాదం):** పదవ తరగతి ఫలితాల్లో 590 మార్కులతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా టాపర్ గా నిలిచిన మండలకేంద్రంలోని ఆదర్శ హై స్కూల్ విద్యార్థిని మనోజ్ఞను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శుక్రవారం ధన్వాడలో శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. గ్రామీణ ప్రాంతం నుండి రాష్ట్రస్థాయి మార్కులు సాధించడం పట్ల అభినందించి, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థినికి ఉత్తమ విద్యను అందించిన ఆదర్శ హైస్కూల్ చైర్మన్ జనగామ కరుణాకర్ రావు, ఉపాధ్యాయులను, విద్యార్థిని తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. అంతకుముందు భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆదర్శ విద్యార్థిని మనోజ్ఞను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, తదితరులు అభినందించి షీల్డ్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, కాటారం ఏఎంసీ చైర్ పర్సన్ పంతకాని తిరుమలసమ్మయ్య, డిసిసి అధ్యక్షుడు బట్టు కరుణాకర్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, తదితరులు ఉన్నారు.

## ఘనంగా కార్మిక దినోత్సవ వేడుకలు



**పెబ్బేరు, మే 01 (నినాదం):** సమాజ నిర్మాణంలో కార్మికుల పాత్ర అమూల్యమని, వారి సేవలు వెలకట్టలేనివని మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పెబ్బేరు మున్సిపల్ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా పారిశుద్ధ్య విభాగానికి చెందిన పలువురు మున్సిపల్ సిబ్బందిని చైర్మన్, వైస్ చైర్మన్ శాలువాలతో సన్మానించారు. పట్టణ పరిశుభ్రత కోసం అహర్నిశలు, శ్రమిస్తున్న కార్మికులను అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ఎండనక వాననక కష్టపడే కార్మికుల వల్లే సమాజం ఆరోగ్యంగా కొనసాగుతుందని అన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య కార్మికులు తెల్లవారుజామునే విధులకు హాజరై పట్టణాన్ని శుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. వారి సంక్షేమానికి పాలకవర్గం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని హామీ ఇచ్చారు. అదే విదంగా వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి మాట్లాడుతూ, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తున్న సిబ్బందిని గుర్తించి గౌరవించడం సమాజ బాధ్యత అని తెలిపారు. మున్సిపాలిటీలో కార్మిక దినోత్సవ వేడుకలో సన్మానం పొందిన కార్మికులు తమ సేవలను గుర్తించినందుకు ఆనందం వ్యక్తం చేస్తూ, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖాజా అరిఫుద్దీన్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి





### అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ వెల్లడి

**వనపర్తి ప్రతినిధి, మే 1 (నినాదం):** జిల్లాలో యాసంగి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ సూచించారు. శుక్రవారం వరి కొనుగోలు ప్రక్రియను పరిశీలించేందుకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ కొత్తకోట మండలంలోని అప్పరాల, అమడబాకుల, రామకృష్ణాపురం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో కొనసాగుతున్న కొనుగోలు ప్రక్రియను ఆయన సమగ్రంగా పరిశీలించారు. కేంద్రాల్లో రైతులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే ధాన్యం రికార్డులను పరిశీలిస్తూ నమోదు పత్రాల నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని కేంద్రాల ఇన్‌చార్జీలకు అదనపు కలెక్టర్ ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని, తేమ శాతం వచ్చిన వెంటనే తూకం చేసి కొనుగోలు పూర్తి చేయాలని కోరారు. ఆ తర్వాత ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ వేగంగా జరగాలని, తద్వారా రైతులకు నగదు చెల్లింపులు వంటి అంశాల్లో ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిఎస్ ఓ కాశీ విశ్వనాథ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా మేడే వేడుకలు



**కమలాపూర్ మే 1 (నినాదం):** మండల కేంద్రంతో పాటుగా మండలంలోని గ్రామాల్లో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం పలు కార్మిక సంఘాల నాయకులు జెండాలు ఎగుర వేశారు. హమాలి కార్మికులు, తాపీ మెస్త్రి కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు,ఎలక్ట్రిషన్ అండ్ ప్లంబింగ్ కార్మికులు, ఎ ఐ టి యు సి, సి ఐ టి యు సంఘాల ఆధ్వర్యంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కార్మిక హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మికుల కు ఎనమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పనికి తగ్గ కనీస వేతనాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాలలో సౌకర్యాలు కల్పించాలన్నారు. మే డే స్ఫూర్తితో ఐక్యంగా కార్మికుల హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. పలు చోట్ల ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రిషన్ ప్లంబర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు మోటం రమేష్, ఆడెపు శ్రీకాంత్, వెన్నెల సుభాష్. బాబురావు. బండి చేరాలు. సంతోష్. అరవింద్. పలు కార్మిక సంఘాల నాయకులు,హమాలి కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల దాహార్తి తీరుస్తున్న శైలేంద్ర సింగ్, రామ్ సింగ్



**అమరచింత, మే 1, (నినాదం):** అమరచింత మండలంలోని నాగల్ కడుమూర్ ధర్మపురి ప్రధాన రహదారిపై శైలేందర్ సింగ్, రాంసింగ్ అంబలి కేంద్రాన్ని నడుపుతూ ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్నారు. రహదారి పక్కన ఉన్న తమ మామిడి తోట వద్ద ప్రతిరోజు అంబలిని అందిస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు. శుక్రవారం హైదరాబాదు నుండి రాంసింగ్ నడుపుతున్న అంబలి కేంద్రాన్ని సందర్శించి ప్రయాణికులకు అంబలి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరచింత నుండి నాగల కడుమూరు మీదుగా మక్తల్ జక్లేర్ వెళ్లే ప్రయాణికులకు అంబలి కేంద్రాలు లేకపోవడం తమను కలిసి వేసిందన్నారు. ఈ నేపథ్యంలోని అంబలి కేంద్రాన్ని నడపాలని నిశ్చయించుకుందామన్నారు. ఎండల తీవ్రత దృశ్య మే 31 వరకు అంబలి కేంద్రాన్ని కొనసాగిస్తామన్నారు. తమ సొంత డబ్బులతో ఈ అంబలి కేంద్ర నడుపుతున్నామని అన్నారు. అంబలి కేంద్రాల్లో నడుపుతున్న శైలేందర్ సింగ్ రామ్సింగులను ధర్మపురం నాగల కడుమూరు గ్రామ ప్రజలు అభినందించి శాలువా పూలమాలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా నాగల్ కడుమూరు సర్పంచ్ శివకుమార్ అంబలి కేంద్రాన్ని సందర్శించి వారి అభినందించారు. వేసవిలో అంబలిని అందిస్తున్న దాతలను ఆయన ప్రత్యేకంగా అభినందించి శాలువా పూలమాలతో సన్మానించారు.

## ఘనంగా శ్రీనివాస రెడ్డి జన్మదిన వేడుకలు



**మిర్యాలగూడ, మే 1( నినాదం):** నల్లగొండ జిల్లా రైతు బంధు సమితి మాజీ చైర్మన్ చింతరెడ్డి శ్రీనివాస రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని బి.ఆర్.ఎస్ పార్టీ కార్యాలయంలో అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు శ్రీనివాస రెడ్డి తో కేక్ కట్ చేయించి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మాట్లాడుతూ.. చింతరెడ్డి శ్రీనివాస రెడ్డి జిల్లా రైతు బంధు సమితి చైర్మన్‌గా మరియు మార్కెట్ కమిటి చైర్మన్ గా, మండల పార్టీ అధ్యక్షులుగా, రైతు సంక్షేమం కోసం విశేష కృషి చేశారని, పార్టీ బలోపేతంలో ఆయన పాత్ర కీలకమని కొనియాడారు. కార్యక్రమములో ఎడవెల్లి శ్రీనివాస రెడ్డి, అన్నబీమోజు నాగార్జున చారి,మట్టపల్లి సైదయ్య యాదవ్,పాలుట్ల బాబయ్య,రాజఖ ప్రసాద్,ఎండి. ఇలియాస్, అంగోతు హాతిరం నాయక్, పులి జగదీష్,పెండ్యాల పద్మ, చిత్రం ఉమా,పాదురి సంజీవ రెడ్డి,సలీం, మాలావాత్ రవీందర్ నాయక్, మొండికత్తి లింగయ్య, జెట్టి లింగయ్య, మాధర్, చేలిమెండ్ల పద్మయ్య, తలకోప్పుల సైదులు, బిక్షా నాయక్, వీరయ్య, చిరుమామిళ్ళ వేణు,రాచూరి శ్రీను,సైదులు, వజ్రం, రామావత్ వినోద్ నాయక్,గయాస్,రాబర్ట్,ఆయిల వెంకన్న,కొనకంచి శేఖర్ రావు,ధనావాత్ వెంకటేశ్వర్లు నాయక్,మాంజ నాయక్, శంకర్ నాయక్, సూర్య నాయక్, దుండిగాల శ్రీనివాస్, రవి, సుధాకర్,రాజ్ కుమార్, కుర్ర సేవ్యా నాయక్,రామదాస్ నాయక్, నీలేశ్వర రావు నాయక్,రవి , అంజి,ఫయాజ్, భరత్,నల్లమేకల వెంకులు,సత్యం, ధర్మ నాయక్ తదితరులు ఉన్నారు.

## సమాజ మార్పు కోసం జీవితాన్ని అంకితం చేసిన కామ్రేడ్ సామెల్



**అమరచింత, మే 1, (నినాదం):** చిన్న వయసు నుండే సమాజ మార్పు కోసం తపించి తన జీవితాన్ని కార్మిక వర్గానికి అంకితం చేసిన టి యు సి ఐ జిల్లా అధ్యక్షులు సిపిఐ మాస్ లైన్ డివిజన్ కమిటీ సభ్యులు కామ్రేడ్ సామిల్ మరణం మాస్ లైన్ పార్టీకి తీరనిలోటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, టి యు సి ఐ రాష్ట్ర అధ్యక్షులు కే సూర్యం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు కేజీ రామచందర్ అన్నారు. అమరచింతకు చెందిన కామ్రేడ్ సామిల్ కార్మికుల హక్కుల కోసం పోరాడుతూ వారి జీవితాల్లో మార్పు రావాలని అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు ఇటీవల ఆయన ఆరోగ్యం పూర్తిగా క్షీణించి మృతి చెందడంతో శుక్రవారం ఆయన ఇంటి వద్ద మోపక్ష పార్టీల నేతలు సంతాప సభను నిర్వహించారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని నాయకులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సామేలు అంత్యక్రియలో వామపక్ష పార్టీలనేతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎమ్మెల్ మాస్ లైన్, టి యు సి ఐ, సిఐటియు ఏఐటీయూసీ సిపిఎం సిపిఐ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

నినాదం
శనివారం। తెలంగాణ
2 మే 2026
www.ninadam.in

# కన్నుల పండుగగా హేమాచల లక్ష్మి నర్సింహా స్వామి తిరు కళ్యాణ మహోత్సవం

వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

ప్రభుత్వం తరపున స్వామి వారికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సమర్పించిన మంత్రి సీతక్క







**ములుగు ప్రతినిధి మే 1 నినాదం:** ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు గ్రామంలో రెండో యాదగిరి గుట్టగా ప్రసిద్ధి చెందిన శ్రీహేమాచల క్షేత్రంలో( మల్లూరు గుట్ట) నెలకొని ఉన్న శ్రీ హేమాచల లక్ష్మి నర్సింహా స్వామి తిరు కళ్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదవ రోజైన శుక్రవారం ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎం.వీరాస్వామి పర్యవేక్షణలో శుక్రవారం ఉదయం మేళతాళాల నడుమ, ప్రత్యేక పూజల అనంతరం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అర్చకులు, శ్రీ హేమాచల ( మల్లూరు ) లక్ష్మి నృసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల నిర్వాహక పూజారులు అమరవాది మురళీ కృష్ణమాచార్యులు, వారి బృందం, శ్రీ హేమాచల లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు ముక్కామల రాజశేఖర శర్మ, అర్చకులు యేదునూతల ఈశ్వర చందు శర్మ, కారంపూడి పవనకుమారాచార్యులు, ముక్కామల వేంకట నారాయణ శర్మ ( బాబీ ), అనిపెద్ది రాజీవ్ నాగ శర్మ తదితరుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ లక్ష్మీనృసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మేళతాళాల నడుమ కళ్యాణ మండపంకి తీసుకువచ్చి కళ్యాణ తంతు కార్యక్రమం ప్రారంభించారు రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి వారికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను రాష్ట్ర మంత్రి సీతక్క స్వామి వారికి సమర్పించి కళ్యాణం తిలకించారు. . మధ్యాహ్నం 12.02 గంటలకు అభిజిత్ లగ్నంలో ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లతో శ్రీ లక్ష్మీనర్సింహా స్వామికి పాణిగ్రహణం ( జీలకర్ర బెల్లం) కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మాంగల్య ధారణ కార్యక్రమం, ముత్యాలతో తలంబ్రాల కార్యక్రమం నిర్వహించారు. కళ్యాణ అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.




# కార్మికుల అభ్యున్నతికి సంక్షేమ పథకాల అమలు

కార్మికుల కృషితోనే

ఏ రంగంలోనైనా అభివృద్ధి సాధ్యం

నిరుద్యోగ యువతకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ

మేడే వేడుకల్లో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్





**గద్వాల బ్యూరో మే 1( నినాదం) :** సంఘటిత, అసంఘటిత కార్మికుల కృషితోనే ఏ రంగంలోనైనా అభివృద్ధి సాధ్యమవుతుందని, వారీ సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మేడే ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం గద్వాల ఐడిఓసి సమావేశపు మందిరంలో కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి కార్మికులు ఎంతో బాధ్యతతో పని చేస్తుంటారని, వారి హక్కులను కాపాడేందుకు, సేవలకు గుర్తుగా ప్రతి ఏటా మే 1న ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఇచ్చే లేబర్ కార్డులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, రెన్యువల్ చేసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వం నుంచి అందే పథకాలకు అర్హత కోల్పోవాల్సి వస్తుందన్నారు. పని ప్రదేశంలో మహిళలపై వివక్ష, లైంగిక వేధింపుల నివారణకు ఉద్దేశించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కార్మికులకు అవసరమైన న్యాయ సహాయం ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఐటిఐ, ఏటిసి విద్యార్థులకు సాంకేతికాభివృద్ధిపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అలంపూర్ నియోజకవర్గంలో కూడా త్వరలో ఏటీసీ కేంద్రం ఏర్పాటు కానున్నట్లు చెప్పారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో తరచు జాబ్ మేళాలు నిర్వహిస్తుండడంతో నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలు అంతర్జాతీయ వెబ్సైట్లో ఉద్యోగాలకై రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఆయా విదేశీ భాషలు నేర్చుకొని, మంచి వేతనాలతో అక్కడ ఉద్యోగాలు పొందవచ్చన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువతలో నైపుణ్యాభివృద్ధి, కమ్యూనికేషన్స్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు ఉంటేనే ఏ రంగంలోనైనా రాణించవచ్చన్నారు. ఎవరైనా సరే ప్రభుత్వం నుంచి తీసుకునే వివిధ రుణాలను సొంత అవసరాలకు ఖర్చు పెడితే లాభం లేదని ఏవైనా వృత్తులు, వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సూచించారు. అనంతరం కార్మిక శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన బుక్లెట్లను కలెక్టర్ పలువురు జిల్లా అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వివిధ శాఖల్లో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు, పరిశ్రమల యాజమాన్యాలకు అవార్డులు అందజేశారు. పలువురు కార్మికుల ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్రతినిధి రాజేందర్, సహాయ కార్మిక అధికారి వేణుగోపాల్, జిల్లా ఉపాధి కల్పనాధికారి చరణ్ దీప్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సుషిత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా, డీఈవో విజయలక్ష్మి, ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ సత్య నారాయణ, మండల ప్రత్యేక అధికారి నూకరాజు, అధికారులు, కార్మికులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# సజావుగా మొక్కజొన్న కొనుగోళ్లు చేపట్టాలి

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**భూపాలపల్లి ప్రతినిధి, మే 1(నినాదం):** మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసి కార్యాలయంలో మార్క్ఫెడ్, మార్కెటింగ్, రవాణా, సహకార, పౌర సరఫరాలు, సంస్థ, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో ఎమ్మెల్యే కలెక్టర్ తో కలిసి మొక్కజొన్న కొనుగోలు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో సుమారు 49,175 హెక్టార్లలో మొక్కజొన్న సాగు జరిగిందని తెలిపారు. ఇప్పటివరకు 3274 క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. మొత్తం 65,000 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టం చేశారు. మొక్కజొన్న కొనుగోలుకు జిల్లాలో 7 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొనుగోలు తక్కువగా ఉండటంపై కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోదాం, హమాలీలు, రవాణా సమస్యలు ఉన్నట్లు గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా, కొనుగోలు చేసిన మొక్కజొన్నను నిల్వ చేసేందుకు జిన్నింగ్ మిల్లులు తదితర గోదాంల సామర్థ్యంపై పూర్తి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ కొనుగోలు చేసిన మొక్కజొన్న నిల్వ కోసం మండల వారీగా తహసీల్దారుల నుంచి నివేదికలు సేకరించనున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం మొక్కజొన్న ఉత్పత్తి అధికంగా వచ్చిన నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, మార్క్ ఫెడ్ డిఎం శ్రీదేవి, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, ఆర్టీవో సందాని, సహకార అధికారి వాలియానాయక్, పౌర సరఫరాల డిఎం రాములు, పౌరసరఫరాల అధికారి కిరణ్ కుమార్, వ్యవసాయ అధికారి బాబురావు, చిట్యాల మార్కెట్ కమిటి చైర్మన్ గుమ్మడి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

N NADAM CINEMA

## మరోమారు సుకుమార్ రామ్‌చరణ్ కాంబో

పెద్ది విడుదల తరవాత పట్టాలెక్కనున్న ప్రాజెక్ట్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం దర్శకుడు బుచ్చిబాబు సానతో కలిసి తన 16వ చిత్రం పెద్దిలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ఇప్పటికే భారీ అంచనాలు సొంతం చేసుకోగా, తదుపరి ప్రాజెక్ట్‌పై కూడా అభిమానుల్లో ఆసక్తి పెరుగుతోంది. చరణ్ కెరీర్‌లో 17వ సినిమాగా దర్శకుడు సుకుమార్‌తో ఓ భారీ పాన్ ఇండియా చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ కాంబినేషన్ అనౌన్స్ అయినప్పటి నుంచే ఇండస్ట్రీలో మంచి బజ్ క్రియేట్ అయింది. గతంలో సుకుమార్,చరణ్ కాంబినేషన్‌లో వచ్చిన 'రంగస్థలం' భారీ విజయాన్ని అందుకోవడంతో, ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింత పెరిగాయి. తాజా సమాచారం ప్రకారం, 'పెద్ది' సినిమా విడుదల తర్వాత రామ్ చరణ్ ఎక్కువ గ్యాప్ తీసుకోకుండా వెంటనే తన 17వ సినిమాను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. 'పెద్ది' జూన్‌లో విడుదల కానుండగా, అదే నెలలో సుకుమార్ ప్రాజెక్ట్ షూటింగ్ ప్రారంభించే ఉన్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్‌తో పాటు సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మించనున్నారు. భారీ బ్జడెట్‌తో, పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను రూపొందించేందుకు ఎ÷-లాన్ చేస్తున్నారు. సుకుమార్ తన ప్రత్యేకమైన కథనం, డిఫరెంట్ టేకింగ్‌తో సినిమాలను తెరకెక్కించడంలో పాపులర్ కాగా, రామ్ చరణ్ కూడా తన నటనతో ప్రేక్షకులని మరింత అలరించే దిశగా ముందుకు సాగుతున్నారు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో రాబోయే ఈ సినిమా మరోసారి ఇండస్ట్రీలో కొత్త రికార్డులు సృష్టిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఏదిఏమైన 'పెద్ది' తర్వాత గ్యాప్ లేకుండా చరణ్ కొత్త సినిమా స్టార్ట్ చేయనున్నాడనే వార్త మెగా ఫ్యాన్స్‌లో ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తోంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక వివరాలు త్వరలో వెల్లడయ్యే అవకాశం ఉంది.

## ఓటిటిలోకీ ఎంట్రీ ఇచ్చిన రాకాస




యంగ్ హీరో సంగీత్ శోభన్ ప్రధాన పాత్రలో, నయన్ సారిక హీరోయిన్‌గా నటించిన హారర్ కామెడీ చిత్రం రాకాస ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేసింది. దర్శకురాలు మానస శర్మ తెరకెక్కించిన ఈ చిత్రం థియేటర్లలో మంచి స్పందన అందుకున్న తర్వాత డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. చిన్న సినిమాగా వచ్చినప్పటికీ, మంచి నిర్మాణ విలువలు, వినోదాత్మక కథతో ప్రేక్షకులను ఆకట్టుకున్న 'రాకాస' ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్ వేదికగా నేటి నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. థియేటర్లలో మిస్ అయిన వారు ఇప్పుడు ఈ సినిమాను ఇంటి వద్దే ఆస్వాదించే అవకాశం పొందుతున్నారు. ఈ సినిమా హారర్ ఎలిమెంట్స్‌తో పాటు కామెడీ మేళవింపుతో అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందించబడింది. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్, పిల్లలతో కలిసి చూసేందుకు సరదాగా ఉండే కంటెంట్‌గా ఇది నిలుస్తుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. వీకెండ్ లేదా హాలిడే టైంలో ఫ్యామిలీతో కలిసి చూడడానికి ఇది మంచి ఆప్షన్‌గా చెప్పవచ్చు. ఈ చిత్రాన్ని నిహారిక కొణిదెల సమర్పించగా, జీ స్టూడియోస్ నిర్మాణ బాధ్యతలు చేపట్టింది. టెక్నికల్‌గా కూడా సినిమా మంచి స్థాయిలో ఉండటం, వినోదాన్ని అందించే కథా రూపకల్పన ఉండటం ఈ చిత్రానికి ప్లస్‌గా మారాయి. మొత్తానికి థియేటర్లలో మంచి టాక్ తెచ్చుకున్న 'రాకాస' ఇప్పుడు ఓటీటీలో మరింత విస్తృతమైన ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైందని చెప్పాలి. హారర్ కామెడీ జానర్‌ను ఇష్టపడే వారికి ఈ సినిమా బెస్ట్ ఆప్షన్‌గా నిలుస్తోంది. ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను దక్కించుకున్నట్టు తెలుస్తుంది. మెగా డాటర్ నిహారిక కొణిదెల తన హోమ్ బ్యానర్ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ద్వారా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహించారు. హారర్ ఎలిమెంట్స్‌కు స్వచ్ఛమైన కామెడీని జోడించి రూపొందించిన ఈ కథాంశం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, గెటప్ శ్రీనుల కామెడీ టైమింగ్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది.

## కిల్లింగ్ లుక్స్‌తో ఫ్యాన్స్‌ను ఫిదా చేస్తున్న సమంత



మోస్ట్ గార్జియస్ బ్యూటీ సమంత గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈ నటి ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటూ, ఎప్పటికప్పుడు తనకు సంబంధించిన హాట్ ఫోటోలను షేర్ చేస్తోంది. తాజాగా ఈ బ్యూటీకి సంబంధించిన కొన్ని పిక్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆ ఫోటోలలో సమంత అల్ట్రా స్టైలిష్ లుక్ ఉన్న పింక్ కలర్ స్లీవ్‌లెస్ డ్రెస్ ధరించి, మెడలో భారీ హారం వేసుకుంది. చెవులకు ఇయర్‌రింగ్స్ పెట్టుకొని, జుట్టును అందంగా వదిలేసింది. ఈ పిక్స్‌లో ఆమె చాలా ఆకర్షణీయంగా కనిపించడంతో ప్రస్తుతం అవి సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. ఇదిలా ఉంటే ప్రస్తుతం సమంత 'మా ఇంటి బంగారం' చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తోంది. ఈ సినిమా త్వరలోనే విడుదలకు సిద్ధమవుతోంది.

## కొరటాలతో బాలయ్య మూవీ పక్కా



టాలీవుడ్‌లో మరో క్రేజీ మాస్ కాంబో ఫిక్స్ అయింది. బాలకృష్ణ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో సినిమా రానున్నట్లు ఎన్నో రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌ను శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. కొరటాల శివ మార్కు సామాజిక సందేశంతో పక్కా మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్‌గా ఈ సినిమా ఉండనున్నట్లు తెలుస్తోంది. అధికారానికి ఉద్దేశం తోడైతే.. అది ఉద్యమంగా మారుతుంది' అనే పవర్‌ఫుల్ కొటేషన్‌తో టీమ్ దీనిపై అంచనాలు పెంచేసింది. దర్శకుడు ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేశారని త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుందని టీమ్ తెలిపింది. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడించనున్నారు. ప్రస్తుతం బాలకృష్ణ.. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. 'వీరసింహారెడ్డి' తర్వాత బాలకృష్ణ - గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. ఇందులో బాలయ్యకు జోడీగా నయనతార నటిస్తున్నట్లు సమాచారం.

## గందరగోళంలో పడేసేలా.. జెట్లీ మూవీ




మత్తు వదలరా' సిరీస్ చిత్రాలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు రితేశ్ రానా. ఇప్పుడు సత్యతో కలిసి ఆయన రూపొందించిన సినిమా 'జెట్లీ'. ప్రజాపతి (అజయ్) వ్యాపారవేత్త. రూ. 15 వేల కోట్ల బ్యాంకింగ్ స్కామ్‌కు పాల్పడి.. దేశం వదిలి దుబాయ్ పారిపోతాడు. దీంతో కేంద్ర హోం మంత్రి మేల్కోటి (శ్రీనివాస్ వడ్లమాని) అతన్ని అరెస్ట్ చేసి తిరిగి దేశానికి రప్పించే బాధ్యతను భారత ఇంటెలిజెన్స్‌కి అప్పజెప్తాడు. అయితే, అప్పటికే జజీరా సిండికేట్‌తో పాటు ఇంకొంత మంది శత్రువుల నుంచి తన ప్రాణాలకు ముప్పు ఉందని తెలియడంతో.. ప్రజాపతి స్వయంగా లొంగిపోయినట్లు నటించి, ఆ తర్వాత తప్పించుకోవాలని ఓ ప్రణాళిక రచిస్తాడు. అతన్ని దుబాయ్ నుంచి కొచ్చికి ప్రత్యేక విమానంలో తీసుకొస్తుండగా.. ఆ స్కామ్‌లో భాగమైన మిగతా వ్యక్తులు తనని చంపేందుకు ఓ ప్రణాళిక రచిస్తారు. ఇలా భారత ఏజెంట్స్ నుంచి తప్పించుకోవాలని ప్రజాపతి.. అతన్ని చంపాలని శత్రువులు ప్రయత్నిస్తున్న తరుణంలో ఆ విమానంలోకి గతం మర్చిపోయిన స్థితిలో డాక్టర్ వేదవ్యాస్ (సత్య) పాత్ర ఎంట్రీ ఇస్తుంది. మరి ఆ తర్వాత ఏమైంది? అసలు వేదవ్యాస్ ఎవరు? తన వల్ల ప్రజాపతి ఎస్కేప్ ప్లాన్ ఎలా తలకిందులైంది? ప్రజాపతి శత్రువుల్ని అతనెందుకు అడ్డుకున్నాడు? ఆఖరికి ఆ విమానం సేఫ్‌గా కొచ్చిలో ల్యాండ్ అయిందా? లేదా? ఈ కథలో ఏజెంట్ శివానీ రాయ్ (రియా సింఘా), సినీ సుడోకు ఆడుకునే వెన్నెల కిశోర్ పాత్రలకు ఉన్న ప్రాధాన్యత ఏంటి? అన్నది సినిమా చూసి తెలుసుకోవాలి. 'మత్తు వదలరా', 'హ్యాపీ బర్త్‌డే' సినిమాలు చూసిన వారికి రితేశ్ కామెడీ స్టైల్, తన చిత్రాల్లోని పాత్రలు ఎంత గమ్మత్తుగా ఉంటాయన్నది తెలిసే ఉంటుంది. ఈ 'జెట్లీ' కూడా పూర్తిగా అదే మీటర్‌లో సాగే టిపికల్ కామెడీ కథతో.. చిత్రమైన క్యారెక్టరైజేషన్లతో నిండి ఉంటుంది. ఈ కథంతా పూర్తిగా ఓ విమానంలోనే జరుగుతుంటుంది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at RAHNUMA-E-DECCAN PRESS, H.No.12-2-837/A/3, Asifnagar, Hyderabad., Telangana-500028 Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787